ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 30.10.2025 | సంపుటి :12 సంచిక : 99 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV



హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





# కుండపోత.. రైతుకు గుండెకోత

ఎనిమిది జిల్లాలకు రెడ్ అలర్ట్

## రాష్ట్రవ్యాప్తంగా నీటి మునిగిన పంటలు.. తడిచిన ధాన్యం
## ఖమ్మం,మహబూబాబాద్‌ల మధ్య నిలిచిన రాకపోకలు
## భద్రాచలానికి ఆగ్నేయంగా 50 కి.మీల దూరంలో 'మొంథా'

- వరంగల్‌జిల్లా వరద దిగ్బంధం.. జలమయమైన రహదారులు.. నీట మునిగిన వరంగల్ రైల్వేస్టేషన్
- తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు
- కల్లెడలో అత్యధికంగా 36.7 సెం.మీ వర్షపాతం
- మున్నేరుకు భారీగా వరద
- దిండి ప్రాజెక్టు సమీపంలో కోతకు గురైన శ్రీశైలం-హైదరాబాద్ రహదారి
- ఖమ్మంలో పొంగుతున్న వాగులు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. అవసరమైతేనే తప్ప బయటికి రావద్దు
- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
- పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు వరంగల్– ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. ప్రధాన రహదారిపై వర్షం నీరు చేరటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆ రహదారిని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు. వరంగల్‌లోని శివనగర్, మైసయ్య నగర్, ఎన్ఎన్ నగర్, లక్ష్మీగణపతి, విశ్వనాథ్ కాలనీ, కాశీబుగ్గ, వివేకానంద కాలనీ, స్టేషన్‌రోడ్, బట్టల బజార్‌లో రోడ్లపైకి వరదనీరు చేరింది. వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు బారీగా నిలిచింది. శివనగర్‌లో రహదారిపై వరద నీటితో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వరంగల్ బస్టాండ్ చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాల దృష్ట్యా హనుకొండ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సహాయక చర్యల కోసం 79819 75495 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వరంగల్ జిల్లా కల్లెడలో అత్యధికంగా 34 సెం.మీ వర్షపాతం నమోదైంది. **8 జిల్లాలకు రెడ్ అలర్ట్:** హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్,

మిగతా 2లో..

## ఏపీలో 'మొంథా'పోత


- పెను తుపానుతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరిగింది
- ఆస్తి నష్టం చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం
- పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి
- నష్టపోయిన రైతులను, కౌలు రైతులను ఆదుకుంటాం
- సత్వర నివేదికలు సిద్ధం చేసి కేంద్రానికి పంపిస్తాం
- వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే
- పునరావాస కేంద్రంలో సీఎం ప్రజలకు పరామర్శ

2 లో..

### ముంచుకొస్తున్న మరో ముప్పు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలు చేసిన భారత వాతావరణ శాఖ

శ్రీశైలం ఘాట్ రోడ్డులో విరిగిపడ్డ కొండచరియలు.. రహదారి మూసివేత




## అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలి

- ఎక్కడాకూడా ప్రాణ,ఆస్తి నష్టం జరగొద్దు
- ధాన్యం తడవకుండా నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలి
- వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి
- ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి
- చెరువులు, రిజర్వాయర్ల వద్ద నీటిమట్టాలకు గమనిస్తూ ఉండాలి
- రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్(జనంసాక్షి):** అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని.. దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం

మిగతా 2లో..



# జీసీసీల రాజధానిగా హైదరాబాద్

- పాలనపైనమ్మకం, ప్రతిభ పై విశ్వాసానికి ప్రతీక 'మ్యాక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్'
- నెహ్రూ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దూర దృష్టితో హైదరాబాద్‌కు బలం
- మ్యాక్‌డొనాల్డ్స్ గ్లోబల్ కార్యాలయం ప్రారంభోత్సవ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ప్రతిభ పై విశ్వాసం పరిపాలనపై నమ్మకానికి మ్యాక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ఒక ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం ఆయన పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి టీ హబ్ సమీపంలో మ్యాక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ ను ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. తెలంగాణ అద్భుత ప్రతిభకు మ్యాక్ డోనాల్డ్ గ్లోబల్ ఆఫీస్ కోసం హైదరాబాదును కేంద్రంగా ఎంచుకోవడం ఒక నిదర్శనం అన్నారు. జీసీసీలకు రాజధానిగా హైదరాబాద్ నిలిచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. మాజీ ప్రధాని నెహ్రూ మొదలుకొని ఆ తర్వాత పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ వంటి మహా నేతలు దూరదృష్టితో చేపట్టిన చర్యల మూలంగా హైదరాబాద్ కు మరింత బలం చేకూరిందని డిప్యూటీ సీఎం వివరించారు. మ్యాక్‌డొనాల్డ్స్ గ్లోబల్ నాయకత్వ బృందాన్ని మరియు సిబ్బందిని హైదరాబాద్‌కు స్వాగతించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది, ఇది ఇప్పుడు మీ ప్రపంచ ప్రతిభకు కొత్త నిలయం అని

మిగతా 2లో..

# కేబినెట్‌లోకి అజహరుద్దీన్

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వేళ కీలకపరిణామం

మాజీ క్రికెటర్‌ను వరించనున్న మంత్రి పదవి

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- 31న ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం
- సీఎం రేవంత్ రెడ్డితో అజారుద్దీన్ భేటీ

**హైదరాబాద్(జనంసాక్షి):** మహమ్మద్ అజహరుద్దీన్ కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఇదిలా వుంటే తాజాగా అజారుద్దీన్‌ను సిఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకోవడం, వార్తలకు బలం చేకూరింది. తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరపున చాలా మంది

మిగతా 2లో..





# రక్తదానంతో ప్రాణదానం

- రక్తదానం చేసిన డీజీపీ బి.శివధర్ రెడ్డి
- ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు
- రక్తదానంతో మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతున్నామని వెల్లడి
- డీజీపీ కార్యాలయంలో తొలిసారి రక్తదాన శిబిరం

2 లో..

# రఫేల్‌లో రాష్ట్రపతి విహారం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత వైమానిక దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేసారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో

మిగతా 2లో..

# తేజస్వీ బీహార్ సీఎం.. రాహుల్ దేశ ప్రధాని కాలేరు

- వారసత్వ రాజకీయాలకు మేం ఒప్పుకోం:అమిత్‌షా
- ఎన్డీయే కూటమి, మహా కూటమిల పోటాపోటీ ప్రచారం
- 'మీ కోసం సీఎం, పీఎం పోస్టులు ఖాళీగా లేవు': అమిత్‌షా



**పట్నా(జనంసాక్షి):** బిహార్ ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ.. ఎన్డీఏ కూటమి, మహా కూటమిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బిహార్‌లో ఓట్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ..డ్యాన్స్ చేస్తారంటూ ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ విమర్శలు చేయగా, దానికి బీజేపీ స్ట్రాంగ్‌గానే కౌంటర్ ఇచ్చింది. ఇవి సీఎం, పీఎం పోస్టులు అని, అవేమీ మీ కోసం ఖాళీగా లేవని కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ అగ్రనేత అమిత్ షా ధ్వజమెత్తారు. బుధవారం, అక్టోబర్ 29వ తేదీ) దార్‌భంగాలో ఎన్నికల ర్యాలీ చేపట్టిన అమిత్ షా.. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా కూటమిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అసలు కాంగ్రెస్‌లో కానీ ఆర్జేడీలో కానీ వెవరైనా యువ కాంగ్రెస్ నేతలకు టికెట్లు ఇచ్చారా? అని అమిత్ షా ప్రశ్నించారు. తమ ఎన్డీఏ కూటమి మాత్రం యువ నేతల్ని ప్రోత్సహించే క్రమంలో చాలా మందికి టికెట్లు ఇచ్చిందన్నారు. 'ఒకరేమో(లాలూజీ) తన కుమారుడిని సీఎం చేయాలనుకుంటున్నారు.. మరొకరు(సోనియా జీ) తన తనయుడు రాహుల్ గాంధీని దేశానికి పీఎం చేయాలని అనుకుంటున్నారు. ఇవేమైనా ఖాళీగా ఉన్న పదవులా.. వచ్చి కూర్చోవడానికి. మీ కుమారుల కోసం అవేమీ ఖాళీగా లేవు'

మిగతా 2లో..

# బీహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారు నడుస్తోంది

- భాజపా నేతృత్వంలోని కేంద్రం సామాజిక న్యాయానికి వ్యతిరేకం
- ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే కులగణనకు మోదీ అంగీకారం : రాహుల్

**పట్నా(జనంసాక్షి):** నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారును నడుపుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని కేంద్రం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని విమర్శించారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముజఫ్ఫర్‌పుర్‌లో నిర్వహించిన తన తొలి ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని ఆరోపించారు. "బిహార్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్ ద్వారా నడుస్తోందని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. భాజపా కేవలం నీతీశ్ కుమార్‌ను

మిగతా 2లో..



# స్పామ్ కాల్స్‌కు ఇకచెక్

మోసపూరిత కాల్స్ సులువుగా గుర్తింపు

ట్రాయ్ ఆధ్వర్యంలో ట్రూకాలర్ సేవలు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత టెలికమ్యూనికేషన్ రంగంలో ఒక కీలక మార్పు రాబోతోంది. ఇకపై కాల్ వచ్చే సమయంలో నంబర్‌తో పాటు కాలర్ పేరు కూడా కచ్చితంగా కనిపించేలా ట్రాయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టే దిశగా కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్

మిగతా 2లో..

# కాల్పుల విరమణ ఉల్లంఘన

- గాజాపై ఇజ్రాయెల్ బీకరదాడులు
- డ్రోన్లు, యుద్ధ విమానాలతో విరుచుకుపడ్డ ఐడీఎఫ్
- ఘటనలో వందమందికిపైగా మృతి



**గాజాస్ట్రిప్(జనంసాక్షి):** రెండేళ్లుగా కొనసాగిన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో వేలాది మంది పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. చివరకు అమెరికా జోక్యంతో సంధి కుదిరినప్పటికీ.. ఉల్లంఘనలు జరుగుతుండటం ఆందోళలకు కారణమవుతోంది. తాజాగా ఇజ్రాయెల్ మెరుపు దాడులతో గాజా మరోసారి దద్దరిల్లింది. డ్రోన్లు, యుద్ధ, నిఘా విమానాలతో విరుచుకుపడింది. ఈ ఘటనలో ఒక్కరోజే 100 మందికిపైగా చనిపోయారు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందంతో ఊపిరి పీల్చుకుంటున్న పాలస్తీనావాసుల్లో మళ్లీ గుబులు మొదలైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో రెండేళ్ల కాల్పులకు తెరదించుతూ అక్టోబర్ 10న ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇది అమల్లోకి వచ్చిన పక్షం రోజుల్లోనే ఉల్లంఘనలపై ఇరుపక్షాలు ఆరోపణలకు దిగాయి. బందీల మృతదేహాలను అప్పగించడంలో హమాస్ ఉల్లంఘనలకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తున్న సమయంలోనే ఓ ఇజ్రాయెల్ సైనికుడు రఫాలో ప్రాణాలు కోల్పోవడం నెతన్యాహు ఆగ్రహానికి కారణమైంది. ఆయన ఆదేశాల మేరకు గాజాపై ఐడీఎఫ్ భీకర దాడులు చేపట్టింది. ఇందులో భారీ ప్రాణ నష్టంతోపాటు మౌలిక

మిగతా 9లో..

# భారత్‌పై పాక్ మరో కుట్ర

- బంగ్లాలోని తమ దౌత్య కార్యాలయంలో ఐఎస్ఐకు ప్రత్యేక సెల్ ఏర్పాటు
- న్యూఢిల్లీపై గూఢచర్యానికి పాల్పడేందుకు పన్నాగాలు

2 లో..

## పాక్‌తో సంబంధాలు.. ఢిల్లీలో గూఢచారి అరెస్ట్



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వివిధ మైనారిటీ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ నేతలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, అజారుద్దీన్, ఫహీం ఖురేషి, వివిధ మైనారిటీ సంఘాల నేతలు ఉన్నారు

## ఏపీలో 'మొంథా'పోత

**అమరావతి(జనంసాక్షి):** మొంథా తుపాను పెనువిపత్తని.. రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, తుపాను బాధితులను పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, పరిహారం అందించారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడుతూ..మొంథా తుపానుపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. గతంలో తుపానుల సమయంలో పనిచేసిన అనుభవం నాకు ఉంది. ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణనష్టం లేకుండా చూశాం. ఆస్తి నష్టం కూడా చాలా వరకు తగ్గేలా చర్యలు తీసుకున్నాం. పలు జిల్లాల్లో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షం నమోదైంది. ఆస్తి నష్టంపై నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటాం. కౌలు రైతులకు పరిహారం అందిస్తాం. మత్స్యకారులు, చేనేత కార్మికులకు అదనంగా 50 కిలోల చొప్పున బియ్యం ఇస్తున్నాం అని సీఎం తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం వల్ల ఏపీలో పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తుఫాను కారణంగా చేతికి అందివచ్చిన పంట పాడైపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మొంథా తుఫాను వల్ల జరిగిన ప్రాథమిక నష్టాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే రెండు రోజుల్లో అధికారులు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో శరవేగంగా అధికారులు పంట నష్టంపై వివరాలు తెలుసుకుంటున్నారు. అయితే, ప్రాథమిక అంచనాలు వచ్చాక కేంద్ర ప్రభుత్వానికి నివేదించనుంది ఏపీ ప్రభుత్వం. 249 మండలాలు, 48 మున్సిపాలిటీల్లో 18 లక్షల మందిపై తుఫాను ప్రభావం ఉందని అధికారులు గుర్తించారు.






# కుండపోత.. రైతు గుండె కోత

జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ తాజాగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, నిర్మల్, సూర్యాపేట, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ అయ్యాయి.

**ఖమ్మం- మహబూబాబాద్ జిల్లాల మధ్య నిలిచిన రాకపోకలు**

ఖమ్మం- మహబూబాబాద్ జిల్లాల మధ్య వాల్యాతండా సమీపంలోని వంతెనకు ఆనుకుని ఆకేరు వాగు ప్రవహిస్తోంది. దీంతో ఇవాళ సాయంత్రం నుంచి రెండు జిల్లాల మధ్య అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

ఏన్కూర్ బ్రిడ్జి వద్ద కొట్టుకుపోయిన డిసిఎం

తుపాన్ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలో గల అంజనాజపురం నిమ్మవాగు బ్రిడ్జి పై నుండి నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కాగా, పల్లిపాడు -ఏన్కూర్ మార్గ మధ్యలో ఉన్న బ్రిడ్జిపై పొంగిపొర్లుతున్న నీటి ప్రవాహం నుంచి డ్రైవర్ డీసీఎం వ్యాను దాటించే ప్రయత్నం చేశాడు. అయితే బ్రిడ్జి మధ్యలోకి రాగానే వాహనం ఆగిపోవడంతో స్థానికులు డీసీఎంను వదిలి ఒడ్డుకు రావాలని ఎంత చెప్పిన వినలేదు. దీంతో డీసీఎం నీటి ప్రవాహంలో కొట్టుకు పోయింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ నీటిలో గల్లంతు అయ్యాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీశైలం ఘాట్‌రోడ్డులో విరిగిపడ్డ భారీ కొండచరియలు


మొంథా తుఫాను ప్రభావంతో ఏపీ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వర్షాలకు నదులు, వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా భారీ వర్షాలకు శ్రీశైలం ఘాట్‌రోడ్డులో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. తుఫాను ప్రభావంతో శ్రీశైలంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఈ వర్షానికి డ్యామ్ ఘాట్ రోడ్డుపై భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. అప్రమత్తమైన పోలీసులు జేసీబీ సాయంతో రోడ్డుపై పడిన బండరాళ్లను తొలగిస్తున్నారు. మరోవైపు లింగాలగట్టు చెక్ పోస్ట్ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

హైదరాబాద్‌లో పలుచోట్ల భారీ వర్షం

హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. మొంథా తుఫాన్ ప్రభావంతో నగరం ముసురేసింది. పలుచోట్ల గట్టిగానే కురిసింది.,ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. నగరంలో కురుస్తున్న వర్షం వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. తరచూ.. సీవరేజీ ఓవర్ ఫ్లో అయ్యే మ్యాన్ హోల్స్ గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డీప్ మ్యాన్‌హోల్స్ దగ్గర సీవరేజి సూపర్‌వైజర్లు ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ మూతలను తెరవకూడదని అశోక్ రెడ్డి సూచించారు. ఎమ్జర్జెన్సీ కోసం జలమండలి హెల్ప్ లైన్ 155313కి కాల్ చేయాలని ఆయన కోరారు. జంట జలాశయాల గేట్లు ఎత్తిన నేపథ్యంలో జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ నగరంలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. వర్షాలతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లు తున్నాయి. పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గచ్చిబౌలి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, నల్లకుంట, బర్కత్‌పురా, బీఎన్‌రెడ్డినగర్, మీర్‌పేట్, బాలాపూర్, బడంగ్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జవహర్‌నగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, దోమలగూడలో వర్షం కురుస్తోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలి

ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశర చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాల న్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. తుపాను ప్రభావంపై మహబూబాబాద్, ములుగు, అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిస్థితులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.



## ముంచుకొస్తున్న మరో ముప్పు

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖహెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. రాబోయే కొన్ని గంటల్లో ఏపీ,తెలంగాణ, విదర్భా, మరాఠవాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందనిపేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వరద ప్రభావంతో రహదారులపై నీరు వచ్చి చేరవచ్చని వెల్లడించింది.

## తేజస్వీ బీహార్ సీఎం.. రాహుల్ దేశ ప్రధాని కాలేరు

అని అమిత్ షా ధ్వజమెత్తారు. బిహార్‌లో ఏర్పడ్డ మహాఘట్‌బంధన్( మహా కూటమి) కాదని, అదొక దొంగల కూటమి అంటూ అమిత్ షా విమర్శలు గుప్పించారు.'జన్నాయక్ కర్పూరి ఠాకూర్‌కు మోదీ జీ భారతరత్న ప్రదానం చేశారు. ఇప్పుడు, వారు (ప్రతిపక్షాలు) కర్పూరి జీ నుండి ఆ బిరుదును తీసివేయాలనుకుంటున్నారు. అది ఎప్పటికీ జరగదు. బాబు జగ్జీవన్ రామ్‌ను ప్రధానమంత్రి కాకుండా చేసిన కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు చూశారు' అని తనదైన శైలిలో మహా కూటమిపై విరుచుకుపడ్డారు.

## బీహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారు నడుస్తోంది

వాడుకుంటోంది. దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఛఠ్ పూజ సందర్భంగా దిల్లీలోని యుమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారు" అని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఎంతకైనా వెళ్తారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. మహాగఠ్‌బంధన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిహార్‌లో వలసలకు ముగింపు పలుకుతామని తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. బిహార్‌ను నేరరహితంగా, అవినీతిరహితంగా మారుస్తామన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే బిహార్‌ను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మారుస్తానని తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రకటించారు. ఇటీవల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు గతంలో తాను ఇచ్చిన హామీలకు నకలు అని ఎద్దేవా చేశారు. అవినీతి, శాంతిభద్రతలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని, బయటి వ్యక్తుల నియంత్రణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు.

## జీసీసీల రాజధానిగా హైదరాబాద్

కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం అన్నారు.1940లలో మ్యాక్‌డొనాల్డ్స్ ప్రారంభమైనప్పుడు, అది కేవలం ఆహారం గురించి మాత్రమే కాదు అది పరిమాణం, సామర్థ్యం, మరియు అనుసంధానమైన ప్రపంచం అనే భావనకు ప్రతీకగా నిలిచింది అన్నారు.దశాబ్దాల క్రమంలో ఆ బంగారు చిహ్నాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ కోట్లాది మందికి సేవలు అందించే విధంగా ఆవిష్కరణ మరియు నిర్వహణ కలయికకు చిహ్నామయ్యాయి అరే డిప్యూటీ సీఎం వివరించారు. మార్క్ నాప్లర్ రాసిన "బూమ్ లైక్ దట్" పాటలో మ్యాక్‌డొనాల్డ్స్ వ్యవస్థా పకుడు రే క్రాక్ కథకు ప్రేరణగా చెప్పినట్లుగా, మ్యాక్‌డొనాల్డ్స్ కథ అనేది ధైర్యవంతమైన ఆలోచనలు ఒకేసారి ఒక పల్లెలో ప్రపంచమంతా వ్యాపించిన గాథ అన్నారు. ఒక రకంగా చెప్పాలంటే, హైదరాబాద్ కూడా అలాంటి ప్రయాణమే చేసింది అన్నారు. మినార్లు, సరస్సులతో ఉన్న చారిత్రక నగరం నుండి, డేటా, డిజైన్, నిర్ణయాల గ్లోబల్ హబ్‌గా ఎదిగింది అన్నారు. స్పష్టమైన లక్ష్యం ఉంటే, కేవలం ఒక నగరానికో, దేశానికో కాదు, ప్రపంచానికి సేవ చేయవచ్చు అని హైదరాబాదు నగరం మరియు మాక్ డోనాల్డ్ రెండు నిరూపించాయి అన్నారు భారతదేశ అభివృద్ధి క్రమాన్ని పరిశీలిస్తే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దూరదృష్టిని మరవలేము అన్నారు.

## స్పామ్ కాల్స్‌కు ఇక చెక్

సేవను డీఫాల్ట్ ఫీచర్‌గా ప్రవేశ పెట్టాలని ట్రాయ్ అంగీకరించింది. అక్టోబర్ 28న విడుదలైన ఈ నిర్ణయం ప్రకారం ఇకపై కాల్ చేసిన వారి పేరు నంబర్‌తో పాటు రిసీవ్ చేసుకొనే వ్యక్తికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సేవ అమలుకు సంబంధించిన చర్చలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. సేవ సాధ్యాసాధ్యాలపై సిఫార్సులు ఇవ్వాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం 2022 మార్చిలో ట్రాయ్‌ను సంప్రదించింది. ఆ తర్వాత 2024 ఫిబ్రవరిలో ట్రాయ్ తన తొలి సిఫార్సులను సమర్పించగా.. 2025 సెప్టెంబరులో ఆని పునఃపరిశీలన కోరింది. ఈ నేపథ్యంలో ట్రాయ్ తాజాగా ఇచ్చిన సమాధానంలో ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకుని కొన్ని కీలక మార్పులతో తన మునుపటి సిఫార్సులను పునరుద్ధరించింది. ఈ సేవ ప్రధానంగా మోసపూరిత, స్పామ్ కాల్స్‌ను అరికట్టడమే లక్ష్యంగా దశలవారీగా ప్రవేశపెట్టబడుతుంది. ఇది అన్ని వినియోగదారులకూ డీఫాల్ట్‌గా యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, అవసరమైతే ఆప్షనల్‌గా డిసేబుల్ చేసుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారుల పేర్లు ఐజఅ ధృవీకరించిన వివరాల ఆధారంగా చూపిస్తాయి. లైసెన్సింగ్ నియమాల్లో కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ నిర్వచనాన్ని విస్తరించి.. కాలింగ్ నేమ్ ను కూడా చేర్చనున్నారు. గోప్యత రక్షణలో భాగంగా.. అఐఎఖీ ఎంచుకున్న వినియోగదారుల పేర్లు మాత్రం ప్రదర్శించబడవు.వ్యాపార వినియోగదారులు తమ ట్రేడ్ నేమ్ లేదా ట్రేడ్‌మార్క్‌ను కాలర్ ఐడెంటిటీగా చూపించుకునే వీలు ఉంటుంది. కానీ, అది ప్రభుత్వ ధృవీకరణ పక్రియకు లోబడి ఉంటుంది. అలాగే కొత్త మొబైల్ పరికరాల్లో ఫీచర్ తప్పనిసరిగా ఉండేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తో సమన్వయం చేయాలని ట్రాయ్ ప్రకటించింది. ఈ సేవను అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం మార్గదర్శకాలకు అనుగుణంగా సప్లిమెంటరీ సేవగా వర్గీకరించారు. ట్రాయ్ తాజా నిర్ణయం మేరకు టెలికాం ఆపరేటర్లకు ఒక వారంలో కనీసం ఒక సర్కిల్‌లో సేవ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత 60 రోజుల పైలట్ దశ పూర్తి చేసిన అనంతరం దేశవ్యాప్త రోల్‌అవుట్ జరగనుంది.

## రఫేల్‌లో రాష్ట్రపతి విహారం

దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్ధాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు. సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు.

# కేబినెట్‌లోకి అజహరుద్దీన్

ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే బిసి రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న వేళ కేబినేట్‌లో బిసిల కోటాను పెంచాలని డిమాండ్ వచ్చింది. దీనిని కాంగ్రెస్ పట్టించుకున్నట్లు లేదు. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగు తున్నట్టు తెలుస్తోంది. దీంతో బిసి సామాజిక వర్గాలు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్యలు ఎప్పటి నుంచో మంత్రిపదవికి డిమాండ్ చేస్తున్నారు. అజారుద్దీన్ రాకతో ఇప్పుడు హైదరాబాద్‌కు చోటు దక్కినట్లు కానుంది.



## రక్తదానంతో ప్రాణదానం

**రక్తదానం చేసిన డీజీపీ బి.శివధర్ రెడ్డి**
**ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు**
**డిజిపి కార్యాలయంలో తొలిసారి రక్తదాన శిబిరం**

**హైదరాబాద్(జనంసాక్షి):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమాల సందర్భంగా బుధవారం డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలిసారిగా డిజిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి రక్తదానం చేశారు. శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్, ఐజిపిలు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి, ఎం.రమేష్ లతో సహా 164 మంది పోలీస్ సిబ్బంది తో పాటు ఆదిక సంఖ్యలో పాల్గొన్న మినిస్టీరియల్ సిబ్బంది నుండి రెడ్ క్రాస్ సొసైటీ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనుషులను ప్రాణాపాయం నుండి కాపాడగలుగుతామన్నారు. రక్తదానం చేయడం వల్ల మూడు రకాలుగా మనుషులకు ఉపయోగపడుతుం దని అన్నారు. ఒకరు రక్త దానం చేయడం వల్ల రక్తంతో పాటు, ప్లాస్మా, ప్లేట్లెట్స్ వంటివి మరో ముగ్గురికి ప్రాణదానం చేసే ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. బాధితులకు అవసరమైన రక్తాన్ని సేకరించేందుకు అవకాశమున్న ప్రతి ఒక్కరు ముందుకు రావాలని డిజిపి పిలుపునిచ్చారు. గత రెండు రోజుల క్రితం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్నానని, దాదాపు 4,500 యూనిట్ల రక్తాన్ని వారు సేకరించారని వెల్లడించారు. ఏటా ప్రతి ఒక్కరు నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారని, కనీసం ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడగలుగుతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో దాదాపు 8,000 మంది ప్రాణాలు కోల్పోతున్నారని రక్తం అందుబాటు ఉన్నట్లయితే అందులో కొంతమంది ప్రాణాలైనా కాపాడగలిగే అవకాశం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఐజిపి ఎం రమేష్ స్వాగతోపన్యాసం చేస్తూ... రక్తదాన శిబిరం డిజిపి కార్యాలయంలో నిర్వహించడం ఇది తొలిసారి అని పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏఐజీలు రమణ కుమార్, నాగరాజు, డాక్టర్ పిచ్చిరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీరాములు, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిరెడ్డి తదితరులు రక్తదాన శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భారత్‌పై పాక్ మరో కుట్ర

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** సీమాంతర ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ భారత్‌తో తరచూ తగవు పెట్టుకుంటోన్న పాకిస్థాన్.. ఇప్పుడు మరో ఎత్తుగడ వేసింది. బంగ్లాదేశ్ వేదికగా న్యూఢిల్లీపై గూఢచర్యానికి పాల్పడేందుకు సిద్ధమైంది. ఇందులోభాగంగానే ఢాకాలోని తమ దౌత్య కార్యాలయంలో పాక్ నిఘా సంస్థ ఐఎస్‌ఐ ప్రత్యేక సెల్ ఏర్పాటుకు ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ నిఘా వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్లమీడియా కథనం వెల్లడించింది.గత కొంతకాలంగా బంగ్లాదేశ్ పాక్ మధ్య స్నేహబంధం పెరుగుతోంది. తాజాగా పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్మన్ జనరల్ సాహిర్ షంషద్ మీర్జా బంగ్లాదేశ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా రక్షణ రంగంలో పరస్పరం మరింత విస్తృత సహకారం అందించుకోవాలని ఇరుదేశాలూ నిర్ణయించుకున్నాయి. పర్యటనలో భాగంగా షంషద్ మీర్జా నేతృత్వంలోని ఎనిమిది మంది సభ్యుల బృందం.. బంగ్లా జాతీయ భద్రతా నిఘా సంస్థ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫోర్సెస్ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులతో చర్చలు జరిపింది. ఈ సందర్భంగా ఢాకాలోని పాక్ హైకమిషన్‌లో నిఘా అధికారులను నియమించుకునేందుకు బంగ్లాదేశ్ అనుమతినిచ్చినట్లు సదరు కథనం వెల్లడించింది. దీంతో త్వరలోనే ఢాకా మిషన్‌లో ఐఎస్ఐ ప్రత్యేక సెల్ ఏర్పాటు కానున్నట్లు సమాచారం.



## ఢిల్లీలో గూఢచారి అరెస్ట్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** గూఢచర్యానికి పాల్పడుతూ నకిలీ పాస్‌పోర్ట్ రాకెట్ నడుపుతోన్న 59 ఏళ్ల వ్యక్తిని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ అణు శాస్త్రవేత్తలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం.. నిందితుడి పేరు మహమ్మద్ అదిల్ హుస్సైనీ. ఇంకా రెండుమూడు మారుపేర్లతో విదేశాల్లోని అణుశాస్త్రవేత్తలను పలుమార్లు సంప్రదించినట్లు, పాక్ సహా పలు దేశాలకు పర్యటించినట్లు వెల్లడించాయి. అతడు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి నుంచి అసలు, నకిలీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతలో కీలకమైన సంస్థలకు సంబంధించిన ఐడీ కార్డులు కలిగిఉన్నట్లు గుర్తించారు.

# ప్రజలు, రైతులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- తుపాను ప్రభావంతో రైతులు నష్టపోకుండా చూడాలి..
- జిల్లా అధికారులను ఆదేశించిన మంత్రి కొండా సురేఖ



వరంగల్ ప్రతినిధి, అక్టోబర్ 29(జనంసాక్షి): వాతావరణ శాఖ ముంథా తుఫాన్ కారణంగా జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ చేసిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ రైతులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి వరంగల్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ తో జిల్లా అధికారులతో మంత్రి మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల... రైతులకు నష్టం వాటిల్లకుండా వ్యవసాయ, మార్కెటింగ్, రెవిన్యూ, డిఆర్డీఓ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉంటూ అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పునరావస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసి ప్రజలకు తరలించేలా పూర్తి సన్నదతో ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లోని అన్ని చెరువులు నిండి ఉన్నందున, ఆయా లోతట్టు ప్రాంతాల్లో ముందస్తుగా పునరావస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా మండల అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ముఖ్యంగా తాసిల్దారులు, ఆశావర్కర్లు, అంగన్వాడి వర్కర్లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో తిరుగుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. జలమయమయ్య ప్రాంతాలలో నిర్వాసితులైన ప్రజలకు భోజనం, వృద్ధులకు పండ్లు, పిల్లలకు ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేయాలన్నారు. చెరువులు నిండి వంకలన్నీ ఉధృతంగా ప్రవహించనున్న నేపథ్యంలో తాసిల్దార్లు, ఎంపీడీవోలు తమ మండల పరిధిలోని లు గ్రామాలు జల మాయమయ్యే ప్రాంతాల్లో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద సంకేత బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలందించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా వరద ఉద్ధృతితో రోడ్లు తెగిపోయిన ఉధృతంగా ప్రవహించిన ఆయా ప్రాంతాల్లో ఆ గ్రామ ప్రజలు వెళ్లవద్దని బ్యారికలు ఇతర పరికరాలు ఏర్పాటు చేసి ప్రమాదాల బారిన పడకుండా చూడాలన్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయ్యే అవకాశం ఉంటుందని, కావున రోడ్డు రవాణా విద్యుత్ సరఫరా లో అంతారం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా రెవెన్యూ, విద్యుత్, రోడ్ల భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు చెరువులు కుంటలు లోని నీటిమట్టలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దని సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేస్తూ క్లోరినేషన్ చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు వారి వారి పరిధిలోని చెరువులను నిత్యం పర్యవేక్షిస్తూ ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉన్నచో యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పారిశుద్ధ్య ఆరోగ్య సమస్యల పరంగా మరింత క్లిష్టమైనవి అని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ముంపు సమస్యలపై శ్రద్ధ వహించాలన్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితులను తన దృష్టికి గాని జిల్లా కలెక్టర్ల దృష్టికి గాని తీసుకురావాలని మంత్రి కొండా సురేఖ సూచించారు. అత్యవసర సహాయం కొరకు ప్రజలు వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టరేట్ 1800 425 3424, 9154225936, 1800 425 1115 గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 1800 425 1980, 9701999676 విద్యుత్ సంబంధించిన సమస్యలను పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 1800 425 0028 ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లకు సంప్రదించాలని మంత్రి కొండా సురేఖ కోరారు.

# డోర్నకల్‌లో పట్టాలపై నిలిచిన నీరు

- పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



మహబూబాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : మొంథా తుపాన్ కారణంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో భారీ వర్షం కురుస్తోంది. వర్షానికి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో భారీ తలపిస్తున్నాయి. రైలు పట్టాలపైకి వరద నీరు చేరింది. డోర్నకల్ స్టేషన్‌లో వరద నీరు పట్టాలను ముంచెత్తింది. దీంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గోల్కొండ ఎక్స్‌ప్రెస్, మహబూబాబాద్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లను భద్రతా కారణాలరీత్యా రైల్వే అధికారులు నిలిపివేశారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

- 24 క్యారెట్లపై 760 పెరుగుదల

హైదరాబాద్, అక్టోబర్29 (జనంసాక్షి) : మూడు రోజులుగా కొండదిగుతూ వస్తున్న బంగారం ధరలు ఇవాళ స్వల్పంగా పెరిగాయి. బుధవారం ఉదయం ట్రేడింగ్‌లో తులంపై గరిష్ఠంగా రూ.700 పెరిగింది. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన పది గ్రాముల ధర రూ.760 పెరిగి రూ.1,21,580కి చేరింది. 22 క్యారెట్ల పది గ్రాముల పసిడి ధర రూ.700 పెరిగి రూ.1,11,450గా నమోదైంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,730గా, 22 క్యారెట్ల పది గ్రాముల పుత్తడి ధర రూ.1,11,600గా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1.60 లక్షల వద్ద కొనసాగుతోంది. కాగా, గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4 వేల డాలర్ల దిగువకు పడిపోవడంతోపాటు అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో దేశీయంగా ధరలు భారీగా తగ్గిన విషయం తెలిసిందే. మంగళవారం దేశీయంగా తులం బంగారంపై ఏకంగా రూ.4వేలు తగ్గింది. గత రెండు రోజుల్లో గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ ధర 200 డాలర్లకు పైగా తగ్గడంతో 3,887 డాలర్లకు పడిపోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా పసిడి ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఏడాది సెప్టెంబర్ ఆఖరునాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) దగ్గరున్న బంగారం నిల్వలు 880 మెట్రిక్ టన్నులకు చేరాయి. గడిచిన ఏడాది కాలంలో 25.45 మెట్రిక్ టన్నులు పెరిగినట్టు మంగళవారం 2025 ఏప్రిల్-సెప్టెంబర్ విదేశీ మారకపు నిల్వల నిర్వహణపై విడుదలైన ఆర్బీఐ అర్ధ వార్షిక నివేదిక తెలియజేసింది. గత ఏడాది సెప్టెంబర్ ఆఖర్లో ఆర్బీఐ వద్ద 854.73 మెట్రిక్ టన్నులుగా ఉన్న పసిడి నిల్వలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరినాటికి 880.18 మెట్రిక్ టన్నులకు పెరిగాయి. ఇందులో 575.82 మెట్రిక్ టన్నులు దేశీయంగానే ఉండగా, మిగతా వాటిని విదేశాల్లో ఆర్బీఐ నిల్వ చేసింది.

# బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదింపజేసే బాధ్యత కిషన్ రెడ్డిదే

- సీఎం రేవంత్ రెడ్డి బీసీ బిల్లు కోసం అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లాలి
- 2వ తేదీ తర్వాత బీసీ రిజర్వేషన్లు ఉద్యమంతో భూకంపం సృష్టిస్తాం
- బీసీ జాగృతి సమావేశంలో బిసి జేఏసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



హైదరాబాద్ (జనంసాక్షి) : అంబర్‌పేట నుండి మూడుసార్లు శాసనసభ్యునిగా, సికింద్రాబాద్ నుండి రెండుసార్లు పార్లమెంట్ సభ్యునిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని బీసీలు గెలిపించారని, ఇప్పుడు గెలిపించిన బీసీల రుణం తీర్చుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించే బాధ్యత కిషన్ రెడ్డి నే తీసుకోవాలని బీసీ జాక్ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని అంబర్‌పేటలోని అశోక ఫంక్షన్ హాల్ లో బీసీ జాగృతి అధ్యక్షులు కేపి మురళీకృష్ణ అధ్యక్షతన 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాలు-కుల సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని బీసీలు బీసీ రిజర్వేషన్ల పై రాష్ట్ర బంద్ నిర్వహించి లక్షలాది మంది రోడ్లమీదకి వచ్చి ఆందోళన చేపడుతున్నారని, ఈ చట్టాన్ని కేంద్రాన్ని ఒప్పించి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే బాధ్యత కిషన్ రెడ్డి నే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఎన్నికలలో ఆయన రాజకీ ఎదుగుదలకు అండగా ఉన్న బీసీలకు రిజర్వేషన్ల బిల్లుకు ఆమోద ముద్ర వేయించి బీసీల రుణం తీర్చుకోనే అవకాశం కిషన్ రెడ్డికి వచ్చిందని, ఇది ఆయన ఉపయోగించుకో వాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించడానికి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీ తో భేటీ జరపాలని, ఒకవేళ ప్రధాని, సీఎం నేతృత్వంలోని అఖిల పక్షానికి సమయం ఇవ్వకపోతే ప్రధాని నివాసం ఎదుట వంట వార్పు కార్యక్రమం నిర్వహించి బీసీల నిరసనను దేశం మొత్తం చూసేలా సీఎం నిర్ణయం తీసుకోవాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. నవంబర్ 2న హైదరా బాదులో కళింగ భవన్‌లో బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశామని ఆ సమా వేశంలో భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామని బిసి రిజర్వేషన్లు సాధన కోసం భూకంపం సృష్టించైన 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని నమ్మకం ఉందని తెలిపారు.

# రక్తదానం సామాజిక సేవలో భాగమే

- ప్రముఖ సామాజిక సేవకులు, రక్త దాత, టిప్పుసుల్తాన్ సంస్థ వ్యవస్థాపకులు ఉమర్ ఫరూక్ ఖాన్




హిందూపురం (జనంసాక్షి) : రక్తదానం సామాజిక సేవలో భాగమేనని ప్రముఖ సామాజిక సేవకులు, రక్త దాత, టిప్పుసుల్తాన్ సంస్థ వ్యవస్థాపకులు ఉమర్ ఫరూక్ ఖాన్ తెలిపారు. హిందూపురం సంజీవరాయన పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎన్ ఎస్ ఎస్ జాతీయ సామాజిక సేవా సంస్థ కార్యాక్రమంలో బాలయేసు ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ప్రారంభమైంది. శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం సౌజన్యంతో బాలయేసు డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 2 ఆధ్వర్యంలో బేవిన హల్లి పంచాయితీ " సంజీవరాయని పల్లె"లో బుధవారం ప్రారంభమైంది. ప్రారంభ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. జియావుల్లా ఖాన్ మాట్లాడుతూ "విద్యార్థులు చదువుతో పాటు, సామాజిక సేవా బాధ్యతలను తెలుసుకోవడానికి, ప్రజా జీవన విధానాలు తెలుసుకోవడానికి ఇలాంటి క్యాంపులు ఉపయోగపడతాయని" అన్నారు. ముఖ్యఅతిథి ప్రముఖ సామాజిక సేవకులు, రక్త దాత, టిప్పుసుల్తాన్ సంస్థ వ్యవస్థాపకులు ఉమర్ ఫరూక్ ఖాన్ ప్రసంగిస్తూ" ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులను గౌరవిస్తూ, చక్కని లక్ష్యాలతో కూడిన చదువుతో పాటు, సామాజిక సేవల్లో భాగస్వామ్యులు కావాలని, రక్తదానం, నేత్ర దానం, అవయవ దానాల గురించి అవగాహన" కలిగించారు. ఇందులో విశ్రాంత ఇఎస్ఐ ఆఫీసర్ ఉబేదుల్లా హుస్సేన్, ప్రధానోపాధ్యాయురాలు దేవి ప్రసన్న, ఉపాధ్యాయురాలు రజని, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు నాగమణి, ప్రోగ్రాం అధికారులు హరీష్, అశ్వర్థ నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా ఏర్పడిన సంస్థ గణనీయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలో తలసీమియా వ్యాధితో మరణిస్తున్న చిన్నారులను కాపాడటం కోసం విద్యార్థులు రక్తదానాన్ని సామాజిక బాధ్యత గా సామాజిక సేవగా ఉద్యమ రూపంలో నడుంబిగించాలని పిలుపు నిచ్చారు రక్తదానం చేద్దాం ప్రాణదాతలుగా మారుదాం రక్త దానం చేద్దాం కుల మతాల అడ్డుగోడల్ని కూలుద్దాం రక్త దానం చేద్దాం వసుధైక కుటుంబం నిర్మిద్దాం అని విద్యార్థులు శపథం చేశారు.

# కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వేతన సవరణ కమిటీ నివేదికకు రెండేళ్లు పూర్తికా వస్తున్న, ఇంకా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపాదనలతో సమగ్ర నివేదిక సిద్ధం చేసిన కమిటీ నుంచి స్వీకరించినందుకు సిద్ధంగా లేదని, ఇష్టంలేక కాలయాపన చేస్తుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. 2023 జూన్ 30మొదటి తెలంగాణ పిఆర్సి ముగియగా అదే ఏడాది జూలై 1 నుంచి రెండో పిఆర్సి వర్తింపజేయాల్సి ఉందని, గత ప్రభుత్వం ఐఏఎస్ రిటైర్డ్, అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్గా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి, రామయ్య సభ్యుడుగా రెండో పిఆర్సి కమిటీని నియమించిన సంగతి విదితమే. ఆరు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉండగా 2024 ఏప్రిల్ 2తో గడుగు ముగిసింది. కొన్ని అనివార్య కారణాలవల్ల కమిటీని ఆరు నెలలు పొడిగించారు. పిఆర్సి కమిటీ కి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు 51 %శాతం ఫిట్మెంట్ ప్రకటించాలని ప్రతిపాదించాయి. సరిగ్గా రెండేళ్లు పూర్తవుతున్నా సరే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా కమిటీ గడువును ఆరు నెలలు పెంచినప్పటికీ నేటి వరకు కూడా పిఆర్సి ప్రతిపాదనలు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం స్వీకరించలేదు..సమర్పించడానికి ప్రభుత్వం అనుమతి కోరగా ,సుఖంగా లేనీ సూచనలు కనిపిస్తున్నాయి.. ఈ ఉద్యోగ ఉపాధ్యాయులను నిరాశ గురి చేసే విధంగా ఉంది. తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్న ప్రభుత్వంగా విశ్వసిస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల తరపున వెంటనే పిఆర్సి కమిటి నుంచి నివేదికను స్వీకరించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పిఆర్సిని ప్రకటించాల్సిందిగా డిమాండ్ చేశారు.


# భద్రాచలం వద్ద జోరు వరద

## చేపలవేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

అమరావతి, అక్టోబర్29 (జనంసాక్షి): మొంథా తీవ్ర తుపాను కాకినాడకు దక్షిణంగా నరసాపూర్‌కు సమీపంలో తీరం దాటిందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర వాయువ్యదిశగా పయనిస్తూ క్రమంగా బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను ఆనుకొని భద్రాచలం సమీపంలో కొనసాగు తుందని పేర్కొంది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. భారీ వర్షాలు పడుతాయని ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, ఏలూరు, పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల, కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కోస్తా జిల్లాల్లో గంటకు 60 నుంచి 70 గరిష్టంగా 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 గరిష్టంగా 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో అన్ని పోర్టులలో మూడవ నెంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రేపు ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# విపత్తు సమయంలో విష ప్రచారమా?

## ఏపీ మంత్రి నారా లోకేశ్



అమరావతి, అక్టోబర్29 (జనంసాక్షి) : విపత్తుల సమయంలో మానవత్వం ఉన్న ఎవరైనా ప్రజలకు సాయం చేస్తారని.. వైకాపా అధ్యక్షుడు జగన్ మాత్రం ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తూ విష రాజకీయాలు చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగళూరు ప్యాలెస్‌లో సేదతీరుతూ దొంగ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కాకినాడ జిల్లా కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పునరావాస కేంద్రంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడ ఉన్నవారికి ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకున్నాం. వదంతులు నమ్మొద్దు.. ఇది ప్రజల ప్రభుత్వం. అత్యవసర సాయానికి టోల్‌ఫ్రీ నంబర్ 18004250101 ఏర్పాటు చేశాం' అని లోకేశ్ పేర్కొన్నారు.


# మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- నాణ్యతతో కూడిన పనులు చేపట్టి పూర్తి చేయాలి
- పనులను పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీనివాస రాజు రిటైర్డ్ ఐఏఎస్



ములుగు ప్రతినిధి, అక్టోబర్ 29(జనంసాక్షి) : వచ్చే సంవత్సరం జనవరి 28 నుండి 31వ తేదీ వరకు జరుగనున్న మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కెఎస్ శ్రీనివాస రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఆర్ అండ్ బి ఈ ఎన్ సి మోహన్ నాయక్ తో కలిసి ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కెఎస్ శ్రీనివాస రాజు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రాంగణం పనులు, పలుచోట్ల చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. గుత్తేదారులు సమయానికి అన్ని పనులను పూర్తి చేయాలని, ఆయా పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మేడారం అమ్మ వాళ్ళని దర్శించుకోవడానికి వస్తున్న భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టాలని, ప్రస్తుతం చేస్తున్న పనులు శాశ్వతంగా నిలిచిపోయేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, ఆర్ అండ్ బి, పిఆర్, ఎలక్ట్రిసిటీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, పూజారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్ పూర్, అక్టోబర్ 29 ( జనం సాక్షి ) : స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసం లో బుధవారం మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఎంఎల్ఏ కడియం శ్రీహరి తో పాటు దేవాలయం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో 8 రోడ్లు 91.55 కిలోమీటర్లు 171.82కోట్లు మంజూరు అయ్యాయని వెల్లడించారు. ఒక చిల్పూర్ మండలానికి 80 కోట్లకు పైగా మంజూరు కావడం జరిగిందని అన్నారు.ఎవరు ఎన్ని విమర్శలు చేసిన నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాని అన్నారు. చిల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి కి 5 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి కి, ఎంఎల్ఏ కడియం శ్రీహరి కి చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు,లింగాల ఘనపూర్ మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, బ్రహ్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా


# డాక్టర్ జీ.ఆదిత్య రెడ్డి నియామకం



హైదరాబాద్ (జనం సాక్షి) : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అనుబంధ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ చక్రవర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు వివిధ రంగాలలోని ప్రొఫెషనల్స్ ను ఏకతాటిపై తీసుకుని రావాలని ఆదిత్య రెడ్డిని ప్రవీణ్ చక్రవర్తి సూచించారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని, రాష్ట్రంలో ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతానికి కృషి చేస్తానని డాక్టర్ ఆదిత్య రెడ్డి పేర్కొన్నారు.

# బట్టల షోరూమ్‌లో అగ్నిప్రమాదం


## కాలిబూడిదయిన సరుకు



కరీంనగర్, అక్టోబర్ 29 (జనంసాక్షి) : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్ వద్ద బుధ వారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కపిల డ్రస్సెస్ షోరూమ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో క్షణాల్లోనే పక్కనున్న షాపులకు కూడా మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో బట్టల దుకాణంతో పాటు వినాయక ఎంటర్‌ప్రైజెస్, ఫొటోగ్రఫి షాపు, కెనాన్ ఫొటోగ్రఫి దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించాల్సి వచ్చింది. ఈ ప్రమాదం కారణంగా కపిల దుకాణం యాజమాన్యానికి భారీగా ఆస్తి నష్టం సంభవించింది.

# రైతు చెమటకు శాస్త్ర బలం చేర్చిన భారత కర్తవ్య పురుషుడు!

**ప్రాచీన భారతదేశంలో వ్యవసాయం పుణ్యక్షేత్ర సమానమైన పని. పచ్చని పంటను ధన లక్ష్మిగా భావించిన సంస్కారం వేల ఏళ్లుగా కొనసాగింది. వర్షాన్ని అనుసరించి సాగు జరిగే రోజులలో రైతు నమ్మకం ఆకాశం వైపు ఉండేది. ఆ సంప్రదాయ మట్టిలోనే శాస్త్రం కొత్త ఆశను నాటగలదని చూపించారు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్. పాత జ్ఞానానికి ఆధునిక పరిశోధన జతచేసి భారత వ్యవసాయానికి కొత్త శ్వాస ఇచ్చిన మహనీయుడు. పంట పొలంలో శ్రమ విలువను విజ్ఞాన శక్తిగా మార్చిన హరిత విప్లవ దర్శి.**



2.1965 సంవత్సరంలో ఢిల్లీ శివార్లలో జౌంటి గ్రామం. పొలాల గుండా నడుస్తూ రైతుతో కరచాలనం చేస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్. రైతు నమ్మకంతో పలికిన మాటలు ఆయనలో ఉన్న సేవా విలువలను అద్దం పట్టించాయి. కష్టపడి పొలాల్లో తిరుగుతున్న శాస్త్రజ్ఞుడు లాభం కన్నా విలువలకు ప్రాధాన్యత ఇస్తున్నాడనే భావన రైతున్ని కొత్త విత్తనాలను పండించడానికి ప్రోత్సహించింది. ఈ చిన్న ఘటన తీరని ఆకలితో వేదన పడుతున్న భారతదేశానికి ఉన్న కాలంలో జరిగినందు వల్ల చారిత్రక మలుపు గా నిలిచింది. ఈ శాస్త్రజ్ఞుడి కృషితో భారతదేశం ఆహార కొరత దేశం నుండి ఆహార ధాన్యాల స్వయం సమృద్ధికి చేరుకున్నది. ఈ కారణం చేత ప్రపంచ ప్రసిద్ధ టైమ్ పత్రిక ఆయనను హరిత విప్లవ పితామహుడు గా గొప్పగా కొనియాడింది. స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే భారతదేశం పేదరికం ఆకలి కరువు ధోరణుల్లో చిక్కిపడింది. అప్పుడు గోధుమ వరి పంటల దిగుబడులు అతి తక్కువగా ఉండేవి. వర్షాధార వ్యవస్థపై ఆధారపడిన వ్యవసాయం రైతుల జీవితాలను అశాంతి లోకి నెట్టింది. పంటలు నిలువనప్పుడు విదేశాల మీద భరోసా పెట్టుకుని ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునే పరిస్థితి నెలకొన్నది. దేశ ఆత్మగౌరవం క్షణం క్షణం దెబ్బతింటున్న సందర్భంలో డాక్టర్ స్వామినాథన్ వ్యవసాయ శాస్త్రానికే కొత్త దారి చూపించాడు. అతని పరిశోధనల వల్లే అధిక దిగుబడినిచ్చే గోధుమ రకాలు లభించాయి. కేవలం విత్తనాలకే పరిమితం కాక మెరుగైన ఎరువుల వినియోగం సాగునీటి సౌకర్యాల పెంపు వ్యవసాయ సాంకేతికత ప్రభావితం అయ్యే ప్రతి కోణంలో పరిజ్ఞానం అందించాడు. ఈ మార్పుల కారణంగా గోధుమ ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరుకుంది. తర్వాత వరి పంటపైన కూడా దిగుబడి పెంపు సాధించడానికి దిశా నిర్దేశం అందించి లక్షలాది రైతుల జీవితాల్లో వెలుగు నింపాడు. రైతుపై భారం తగ్గే విధానాలు రూపొందించబడటానికి శాస్త్రీయ ఆధారాలు చూపించాడు. ఆహార భద్రత కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన పథకాలలో ఆయన సూచనలు కీలక పాత్ర పోశాయి. పంట వైవిధ్యం పెంపు నేల ఆరోగ్య పరిరక్షణ రైతు క్షేమం అన్న ప్రతీ అంశంపైన ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఆవేదననే తన కృషిగా మార్చి వ్యవసాయం శాస్త్ర బలంతో అభివృద్ధి చెందగలదని ప్రపంచానికి చూపించాడు.

హరిత విప్లవం భారతదేశం అభివృద్ధి గమనాన్ని వేగవంతం చేసింది. ప్రజలు ఆకలితో బాధపడకుండా ఉండే స్థితి ఏర్పడింది. పంటల ఫలితం రైతు ఇంట బంగారాన్ని తెచ్చిన రోజులు ఆరంభమయ్యాయి. కేవలం నేడు మాత్రమే కాదు భవిష్యత్తుకు సరిపడే ఆహార నిల్వలు సృష్టించే సామర్థ్యం దేశానికి కలిగింది. వ్యవసాయ శాస్త్ర రంగంలో వచ్చే నూతన సమస్యలను ముందుగానే ఊహించి పరిష్కార మార్గాలు చూపించాడు. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేటి రోజుల్లో కూడా ఆయన సూచించిన నిలకడైన వ్యవసాయ పద్ధతులు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. డాక్టర్ స్వామినాథన్ దృష్టిలో రైతు కేవలం ఆహారం ఉత్పత్తి చేసే వాడే కాదు దేశ భవిష్యత్తును లాలించే శక్తి. అందుకే ఆయన శాస్త్రజ్ఞుడిగా ఉన్నా రైతుతోని అనుబంధాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. పొలాల్లోనే సమాధానం దొరుకుతుందనే నమ్మకంతో పరిశోధన చేశాడు. ఆయన చూపిన దారి లక్షలాది పరిశోధకులను ప్రేరేపిస్తుంది. భారత వ్యవసాయం ఆశయాలను కార్యరూపంలోకి తీసుకొచ్చిన ఆయన పేరు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తుంది. అతని సేవ భారత మట్టి గర్వంగా గుర్తుంచుకునే చిరస్మరణీయ స్మృతి. ఆకలితో బాధపడే కన్నీళ్ళను తుడిచిన మహనీయుడు. రైతు చెయ్యిని పట్టుకుని విజ్ఞానంతో ముందుకు నడిపించిన మహోన్నతుడు. ఇలాంటి మహానుభావుల వల్లే భారతదేశం ఒకప్పుడు బాధలతో నిండిన వ్యవసాయ రంగాన్ని విజయాలతో నిండిన భవిష్యత్తుగా మలుచుకుంది. హరిత విప్లవం కేవలం సాంకేతిక మార్పు కాదు ఒక నమ్మకం పునరుద్ధరణ. రైతు పనిచేసే ప్రతి మొక్కలో ఆశ చిగురించడానికి డాక్టర్ స్వామినాథన్ వంటి శాస్త్ర సేవకుల పాత్ర భూమిక చూపింది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# బీహార్ సమస్యలు పట్టని ఎన్నికల రాజకీయాలు

బిహార్ రాష్ట్రంలో ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికలు నవంబర్ మొదటి వారంలో జరగనున్నాయి. రెండు దశల్లో పోలింగ్ ఉంటుంది. మొదటి దశ నవంబర్ 5న. రెండో దశ నవంబర్ 13న. ఇది రాష్ట్ర అసెంబ్లీకి సంబంధించినది. ఎన్నికల కమిషన్ దీన్ని ప్రకటించింది. ఈ ఎన్నికల్లో హింస పెద్ద ఎత్తున చెలరేగే అవకాశం ఉంటుందని అక్కడ ప్రజలు భయపడుతున్నారు.

బిహార్ ఎన్నికలకు భారీ భద్రత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ 4.5 లక్షల మంది పోలింగ్ సిబ్బందిని నియమించింది. 2.5 లక్షల మంది పోలీసులు ఉన్నారు. 470 మంది కేంద్ర పరిశీలకులు పని చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాల నుంచి ఐఏఎస్ అధికారులు ఉంటారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి బలగాల నుంచి లక్ష మంది మోహరించారు. 1200 కంపెనీల సెంట్రల్ ఆర్మ్ పోలీస్ ఫోర్స్ వస్తుంది. గయా జిల్లాలో 21 కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇది ఇంతకు ముందు ఎన్నడూ లేని భద్రత. బిహార్ ఎన్నికలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా ఉంటాయి. హింస, నేరాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉంటాయి. నేపాల్ సరిహద్దులోని ఏడు జిల్లాల్లో 21 సీట్లు ప్రభావితమవుతాయి. ఇది ఎన్నికల్లో ఒక సవాలు.

బిహార్ రాష్ట్రం నేరాలకు నిలయం. రాష్ట్ర క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం ప్రతి నెలా 229 హత్యలు జరుగుతున్నాయి. రోజూ హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు ఉంటాయి. 2023 ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం మర్డర్ రేట్ 2.0 పెర్ 100,000. కిడ్నాపింగ్ రేట్ 8.2. రేప్ రేట్ 4.4. మహిళలపై నేరాలు 16.3 శాతం పెరిగాయి 2018-2022 మధ్య. ప్రతి రోజు 953 నేరాలు జరుగుతున్నాయి. అందులో 8 హత్యలు, 33 కిడ్నాప్‌లు, 55 మహిళలపై నేరాలు. నితీశ్ కుమార్ 20 ఏళ్లుగా ముఖ్యమంత్రి. అయినా ఆ రాష్ట్ర నేర చరిత్రలో మార్పు లేదు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఇదే విషయాన్ని ఒప్పుకుంటున్నారు. అక్కడ న్యాయ వ్యవస్థ కూడా నేరాలను అరికట్టలేకపోతోంది. ఈ రాష్టంలో శాంతి భద్రతల పరిరక్షణ పెద్ద గుదిబండ సమస్యగా ఉంది.

బిహార్ ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రం. పేదరికం 33.76 శాతంగా ఉంది. ఇది దేశంలో అత్యధికం. నీతి ఆయోగ్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ ప్రకారం బిహార్ లాస్ట్ ర్యాంక్‌లో ఉంది. తలసరి ఆదాయం దేశ సగటు కంటే తక్కువ. స్థూల దేశీయోత్పత్తి కూడా తక్కువ. అన్‌ఎంప్లాయ్‌మెంట్ రేట్ 3.9 శాతం . దేశ సగటు 3.2 శాతం కంటే ఎక్కువ. మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ చాలా తక్కువ. 60 శాతం జనాభా 30 ఏళ్ల లోపు వారే. వారికి ఉద్యోగాలు లేవు. దీంతో శాంతిభద్రతల సమస్యలు పెరుగుతున్నాయి. లక్షలాదిమంది యువత చిన్నాచితక పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. 74.5



లక్షల మంది బిహారీలు బయట రాష్ట్రాల్లో పని చేస్తుకొని దుర్భరంగా బ్రతుకుతున్నారు.

బిహార్ అభివృద్ధి లేకుండా మిగిలిపోయింది. 20 ఏళ్ల క్రితం లాలూ ప్రసాద్ పాలనలో ఆటవిక రాజ్యం అని బీజేపీ విమర్శించింది. 2005 నుంచి జనతాదళ్ (యు) అధికారంలో ఉంది. 15 ఏళ్లు బీజేపీ భాగస్వామి. అయినా బీహార్ రాష్ట్రం నిరుపేదగానే మిగిలిపోయింది. సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, పాలనలో ఇలా అన్ని విధాలా బిహార్ అధమ స్థానంలో ఉంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 35 వేల రైల్వే ఉద్యోగాలకు కోసం కోటి మంది అప్లై చేశారు. ఎంపికలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆందోళన చేశారు. రైళ్లకు నిప్పు పెట్టారు. కాల్పులు జరిగాయి. ఎన్నికల ముందు పార్టీలు ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇస్తాయి. కానీ అవి నినాదాలుగా మిగులుతాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం బిహార్ లో అత్యధిక పేదరికం, నిరుద్యోగం సమస్యలు ఉన్నాయి. కుల సర్వేలో 94 లక్షల మంది రోజుకు 200 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. 10 వ ,తరగతి పూర్తి చేసుకున్న వారు కేవలం 10 శాతం మాత్రమే.

బిహార్ రాజకీయాలు ఎంత సేపు దారిద్ర్యం, వలసలు, పాలనా వైఫల్యాలు, హింస, కులతత్వం, అవినీతి చుట్టూ తిరుగుతుంటాయి. ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టడం అక్కడ సర్వ సాధారణం అయిపోయింది. ఇక్కడ విద్యా వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని సపోర్ట్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల ప్రాజెక్టులు పేపర్ పై ప్రకటినలను గుప్పిస్తుంది. కానీ ఆచరణలో అమలైన దాఖలా లేదు. ఉపాధి కల్పన లేదు. బిహార్ రూపురేఖలు గత 15 ఏళ్ళ పాలనలో మారలేదు. దీనికి నితీష్ కుమార్, మోదీ ద్వయమే బాధ్యత వహించాలి. రాజకీయ నిర్లక్ష్యంమే కారణం.

బీజేపీ వారు డబుల్ ఇంజిన్ సర్కార్ అభివృద్ధి తెస్తుందని చెబుతారు. లక్షా 26 వేల కోట్ల ప్రాజెక్టులు ప్రారంభించారు. ఎన్‌డీఏకు మోదీనే నాయకుడు. బిహార్ ఎన్నికల్లో మోదీ నే కీలకం. బీజేపీ గెలిస్తే మోదీ బలం పెరుగుతుంది. ఓడితే ఇతర శక్తులు బలపడతాయి. బిహార్ రాజకీయాలు కులం చుట్టూ తిరుగుతాయి. కుల లెక్కలు, మత విద్వేషాలు, తాయిలాలు ప్రభావితం చేస్తాయి. వీటిని అధిగమించాలి. అప్పుడే బిహార్ భవిష్యత్ ఉజ్వలం. లేకపోతే ప్రజలు ఎదురుతిరుగుతారు.

బీహార్ భారత దేశంలో భాగమే కానీ , పరిస్థితి మాత్రం భిన్నం. 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోంది. జపాన్‌ను అధిగమించింది. కానీ బిహార్ ను చూస్తే విషాదం కలుగుతుంది. రాజకీయ పార్టీలు,వాటి నేతలు తమ బుద్ధులు మార్చుకోవాలి. ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, భద్రత మెరుగుపరచాలి. అప్పుడే బిహార్ మారుతుంది. ఈ ఎన్నికలు ఒక అవకాశం. ప్రజలు సరైన నాయకులను ఎన్నుకోవాలి.



**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# మాకు వైద్య సహాయం అందించండి సార్

ఈ మధ్య ప్రసారమాధ్యాలు పత్రికలు సోషల్ మీడియాలలో తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు బిడ్డలు అని చూస్తున్నాము సంతానం ఎందుకు పట్టించుకోవడం లేదంటే వారి అవసరాలు తీరిపోయాయి గొప్పగా సంపాదన ఓ స్థాయికి ఎదిగి సంఘంలో గౌరవ ప్రదమైన హొదాలో ఉంటున్నాం అనే భావన కానీ కని పెంచిన తల్లిదండ్రులను విస్మరించడం శోచనీయమైన విషయం ప్రస్తుత బిడ్డలు తాము కూడా భవిష్యత్తులో ఇదే పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆలోచించకపోవడం వలనే ఈ పరిస్థితి వస్తున్నది ఇదే పద్ధతిలో సింగరేణి సంస్థ అవలంబిస్తున్నది సంస్థ మహోన్నతికి తోడ్పడిన రిటైర్డ్ ఉద్యోగులను విస్మరిస్తున్నది ఉచిత మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని పదే పదే కోరుతున్న ఫలితం శూన్యం సింగరేణి కేంద్ర తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా 41:59 ఆధీనంలో నడుస్తున్న ప్రత్యేక ప్రతిపత్తి గల సంస్థ వేతన ఒప్పందాలు చట్టరీత్యా బావుల త్రవ్వకము మూసివేత ఇతరత్రా మాత్రమే కోల్ఇండియాతో సంబంధం లేని విధంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్ పాలసీ అనేక ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్నది ఇంతేగాక లాభాల వాట కూడా ప్రతి సంవత్సరం చెల్లిస్తున్నారు కానీ రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించడానికి కోల్ ఇండియా నియమ నిబంధనలు అడ్డువస్తున్నాయి అని తెలుపుతున్నారు ఇది చాలా విచిత్రమైన విషయం స్వయంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజా కార్మిక సంక్షేమానికి మారుపేరైన మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి సూచించిన యాజమాన్యం వైద్య సౌకర్యాలు కల్పించుటకు కనికరించడం లేదు ఆకాశమే హద్దుగా ఇతర రంగాలలో ప్రవేశించడానికి సంస్థ కృషి చేస్తున్నది కానీ రిటైర్డ్ ఉద్యోగులను కాలిపోయిన బొగ్గు బూడిదగా భావిస్తున్నది రాష్ట్ర సంక్షేమానికి అభివృద్ధికి ఇతోదికముగా పాటుపడు తున్న విధంగా రిటైర్డ్ ఉద్యోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని మనసారా వేడుకొనుచున్నాము ప్రస్తుతం సింగరేణి హాస్పిటల్ లలో ఔట్ పేషెంట్ సిపిఆర్ఎంఎస్ ద్వారా ఎనిమిది లక్షల వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నారు అచేతన వ్యవస్థలో ఉన్న మాకు దిన దినం పెరుగుతున్న వైద్య ఖర్చులు సరిపడక జీవిత చివరిరోజులలో అల్లాడిపోతున్నాం సార్



**దండంరాజు రాంచందర్ రావు**
**అధ్యక్షుడు, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్ర హైదరాబాద్**
**9849592958**

## తలపోత

కప్పు గెలువడం గొప్ప
దేశ సైనికులకు
అంకితం ఇవ్వడం తప్పా
తీవ్రవాదులకుజి
అంటకాగడం కాదా తప్పు
దేశప్రజల గుండెల్లో
మండదా నిప్పు...
గెలుపు పై అభినందనలు
చెప్పక పోవడం
ఎంత అజ్ఞానం
నిరాయుధులు కాల్పుల్లో
మరణిస్తే ఖండించక పోవడం
కాదా దుర్మార్గం...
అందుకే షేక్ హ్యాండ్ లు లేవు
వారి చేతులు మీదుగా
కప్పు తీసుకోలేదు
మానవత్వం లేని మనుషుల పట్ల
కనువిప్పు కల్గన తీవ్రవాదులపట్ల
దూషణ లేని మౌనం భూషణం
భాషణ లేని భావజ్ఞానం

ఆటగాళ్లకు శిరోధార్యం
గాంధీజీ అహింస మార్గమే మిన్న
బుద్ధదేవుని శాంతి మార్గమే మిన్న
భరతజాతి ధర్మ మార్గం మిన్న

**రేడియమ్**
**9291527757**

## సామెత...

పరిమాణం
స్వల్పం
పరివ్యాప్తం
అనంతం
పరిమళం
సురభిళం

**డా. తిరునగరి శ్రీనివాస్**
**9441464764**


## నన్నావాహన చేసుకో..

నన్ను నీ మునివేళ్ల సందుల్లో బంధించు,
నీలో రగులుతున్న మోహావేశాగ్నుల్ని నాలోకి
ఒంపి
ఎర్రని నిప్పు కణికల లావాగ్నితో
ఎగసిపడే విస్ఫోటనాన్ని రగిలించు!

**బాలాజీ పోతుల**
**8179283830**

# ఢిల్లీ వాయు కాలుష్యం.. క్లౌడ్ సీడింగ్ పరిష్కారమా?

దేశ రాజధాని ఢిల్లీ ప్రతీ ఏటా చలికాలం ఆరంభంలో, ముఖ్యంగా దీపావళి పండుగ ముగిసిన వెంటనే, తీవ్రమైన వాయు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడం ఒక నిరంతర సవాలుగా మారింది. ఈ సమయంలో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) స్థాయిలు సులభంగా 401 నుండి 500 మధ్య ఉండే అత్యంత ప్రమాదకరమైన 'తీవ్రమైన' స్థాయిని చేరుకుంటాయి. పండుగ సందర్భంగా కాల్చే బాణసంచా నుండి వెలువడే ఉద్గారాలు, పొరుగు రాష్ట్రాలైన హర్యానా, పంజాబ్‌లలో జరిగే పంట వ్యర్థాల దహనం వలన చల్లని, నిశ్చలమైన వాతావరణం కలిసిపోయి, గాలిలో పిఎం 2.5, పిఎం 10 వంటి సూక్ష్మ కణాల సాంద్రతను విపరీతంగా పెంచుతాయి. ఈ కాలుష్య మేఘం ఢిల్లీని వాయు కాలుష్య గనిగా మార్చింది. తక్షణ ఉపశమనం కోసం ఢిల్లీ ప్రభుత్వం, ఐఐటీ-కాన్పూర్ వంటి పరిశోధనా సంస్థలు క్లౌడ్ సీడింగ్ అంటే కృత్రిమ వర్షం అనే వినూత్న శాస్త్రీయ పరిష్కారం వైపు దృష్టి సారించాయి. గాలిలో పేరుకుపోయిన విష కణాలను వర్షం ద్వారా నేలపైకి కడిగివేసి, ప్రజలకు తాత్కాలికంగా మెరుగైన గాలిని అందించాలనే ఆశతో ఈ ప్రయత్నం చేయడం జరిగింది.



**ఢిల్లీలో దీపావళి తర్వాత వాతావరణ కాలుష్యం:**

ఎక్యూఐ అనేది ఆరు ప్రధాన కాలుష్య కారకాలైన సూక్ష్మ కణాలు పిఎం 2.5, పిఎం 10, నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, ఓజోన్ ఆధారంగా గాలి నాణ్యతను కొలవడానికి ఉపయోగించే ఒక ముఖ్యమైన కొలమానం. ఈ సూచీ 0 నుండి 500 వరకు ఉంటుంది. గాలి ఎంత ప్రమాదకరంగా ఉందో ఇది సాధారణ పౌరులకు తెలియజేస్తుంది. ఢిల్లీలో దీపావళి తర్వాత ఈ స్థాయిల పెరుగుదల గత కొన్ని సంవత్సరాలుగా ఆందోళన కలిగిస్తోంది. ఉదాహరణకు దీపావళి రాత్రి ఈ సూచిక 'చాలా దారుణమైన' స్థాయికి పడిపోయింది. ఆ మరుసటి రోజు ఉదయానికల్లా 'తీవ్రమైన' స్థాయికి చేరుకుంది. ఈ స్థాయిలో, కాలుష్యం కేవలం శ్వాసకోశ లేదా గుండె జబ్బులు ఉన్నవారిని మాత్రమే కాకుండా, ఆరోగ్యవంతులైన ప్రజలను కూడా ప్రభావితం చేస్తుంది. ఇది తీవ్రమైన శ్వాస సమస్యలకు ఇతర అనారోగ్యాలకు దారితీస్తుంది. ఈ కాలుష్యం సాధారణంగా పది రోజుల నుండి రెండు వారాల పాటు కొనసాగుతుంది, నగరంపై దట్టమైన పొగమంచు దుప్పటి కప్పుతుంది, దృశ్యతను తగ్గిస్తుంది. విమాన రాకపోకలకు కూడా అంతరాయం కలిగిస్తుంది. ఢిల్లీ ఎదుర్కొనే ఈ వాయు కాలుష్యం కేవలం బాణసంచా వలనే కాకుండా, భూమికి దగ్గరగా పేరుకుపోయే విషపూరిత పొగను వాతావరణం పై పొరలకు తీసుకెళ్లడానికి సరిపడా గాలి లేకపోవడం వంటి వాతావరణ శాస్త్రపరమైన అంశాలు కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి.

**క్లౌడ్ సీడింగ్ సాంకేతికతతో ఢిల్లీ ప్రస్తుత ప్రయత్నం:**

క్లౌడ్ సీడింగ్ అనేది శాస్త్రీయంగా వాతావరణ మార్పు సాంకేతికత అని కూడా పిలుస్తారు. ఇది కృత్రిమంగా వర్షపాతాన్ని లేదా హిమపాతాన్ని ప్రేరేపించే ఒక ప్రక్రియ. ఈ పద్ధతిలో, సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లేదా పొడి మంచు వంటి తేమను పీల్చుకునే రసాయనాలను ప్రత్యేకంగా రూపొందించిన విమానాలు లేదా డ్రోన్‌ల ద్వారా మేఘాల అత్యంత చల్లని భాగాలపై చల్లుతారు. ఈ రసాయన కణాలు మేఘాలలో ఉన్న నీటి ఆవిరిని తమ చుట్టూ కేంద్రీకరించి, ఘనీభవన కేంద్రాలుగా పనిచేస్తాయి. దీని ఫలితంగా నీటి బిందువులు బరువెక్కి వర్షం రూపంలో భూమిపై పడతాయి. ఢిల్లీలో ఈ ప్రయత్న ప్రధాన లక్ష్యం:

వర్షపాతం పెంచడం కంటే, కాలుష్య కణాలను తొలగించడమే. ఈ వర్షం కురిసినప్పుడు, అది గాలిలోని విషపూరితమైన పిఎం 2.5, పిఎం 10 ఇతర ధూళి కణాలను పీల్చుకొని, వాటిని నేలపైకి తీసుకువస్తుంది. దీనిని "శుభ్రపరిచే ప్రభావం (వాష్‌అవుట్ ఎఫెక్ట్)" అని పిలుస్తారు. దీని ద్వారా గాలి నాణ్యత తక్షణమే మెరుగుపడుతుంది. ఢిల్లీ ప్రభుత్వం ఐఐటీ-కాన్పూర్ సహకారంతో, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ నుండి అనుమతులు పొంది, ఈ పరీక్షలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి, వాతావరణంలో కనీసం 40% కంటే ఎక్కువ తేమ, తగినంత సాంద్రత కలిగిన మేఘాలు ముఖ్యంగా నింబోస్ట్రాటస్ మేఘాలు ఉండాలి. ఈ మేఘాలు ఒక ముఖ్యమైన మధ్యస్థ మేఘ రకం. ఇవి దట్టంగా, బూడిద రంగుతో ఉండి, ఆకాశాన్ని పూర్తిగా కప్పేసేవిగా కనిపిస్తాయి. నింబోస్ట్రాటస్ మేఘాలు చాలా కాలం పాటు సాగే విస్తృత వర్షాలను కలిగిస్తాయి, వడగండ్ల వర్షం లేదా ఉరుములు ఇవి సాధారణంగా ఇవ్వవు. వాతావరణ పరిస్థితులు అనుకూలించనందున ఈ ప్రయోగం తరచుగా వాయిదా పడుతున్నప్పటికీ, కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఢిల్లీకి ఇది ఒక ఆశ.

**క్లౌడ్ సీడింగ్ చరిత్ర - ఫలితాలు:**

ఈ సాంకేతికత మన దేశానికి కొత్తేమీ కాదు, అయితే దీనిని కాలుష్య నివారణ కోసం ఉపయోగించడం ఇదే తొలిసారి. భారతదేశంలో పూర్వపు ప్రయోగాలను ప్రధానంగా కరువు నివారణ, వర్షపాతం పెంపుదల కోసం నిర్వహించారు. 2003లో మహారాష్ట్రలో వర్షపాతాన్ని పెంచడానికి ఈ సాంకేతికతను విజయవంతంగా ఉపయోగించారు. రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతాలలో జరిపిన ప్రయోగాలలో వర్షపాతాన్ని పెంచడంలో

**పారిశ్రామిక ఉద్గారాలను తగ్గించడానికి కఠినమైన చట్టాలు, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం వంటి సుస్థిరమైన మరియు దీర్ఘకాలిక విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ పద్ధతి కేవలం ఒక సంక్షోభ నిర్వహణ సాధనంగా మాత్రమే చూడాలి, అంతేకానీ శాశ్వత పరిష్కారంగా చూడకూడదు.**

ఇది కొంతవరకు విజయం సాధించింది. అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కూడా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వ్యవసాయానికి, జల వనరులకు మద్దతుగా ఈ పద్ధతిని ఉపయోగించాయి. ఈ ప్రయోగాలలో 25% నుండి 40% వరకు వర్షపాతం పెరుగుదల కనిపించినట్లు కొన్ని నివేదికలు సూచించాయి.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు దీనిని విజయవంతంగా అమలు చేశాయి. వాతావరణాన్ని నియంత్రించడంలో ప్రపంచంలోనే అత్యంత చురుకైన దేశంగా చైనా ఉంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి ముందు వర్షాన్ని కురిపించి, కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ సాంకేతికతను ఉపయోగించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి ఎడారి దేశాలు ముఖ్యంగా నీటి వనరులను పెంచడానికి, వేసవిలో వర్షపాతాన్ని ప్రేరేపించడానికి ఈ పద్ధతిని నిరంతరం ఉపయోగిస్తున్నాయి. ఈ విధానం ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ, దీని ఫలితాలు పూర్తిగా మేఘాల నాణ్యత, అందుబాటులో ఉన్న తేమ, గాలి దిశ వంటి స్థానిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. కాలుష్య నివారణ విషయంలో, ఈ పద్ధతి ద్వారా తక్షణమే మెరుగుపడినప్పటికీ, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమే. కాలుష్యానికి మూల కారణాలు పరిష్కరించబడనంత వరకు, గాలి నాణ్యత తక్కువ సమయంలోనే తిరిగి క్షీణించే అవకాశం ఉంది. అంతేకాకుండా, సిల్వర్ అయోడైడ్ వంటి రసాయనాల వల్ల పర్యావరణంపై దీర్ఘకాలిక ప్రభావాలు ఉంటాయా అనే అంశంపై శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తల మధ్య ఇప్పటికీ ఆందోళనలు, చర్చలు కొనసాగుతున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం ఈ పద్ధతి ద్వారా గాలి నాణ్యతను గరిష్టంగా 80-100 పాయింట్ల వరకు మాత్రమే మెరుగుపరచగలరు. ఇది కాలుష్యాన్ని పూర్తిగా తొలగించడానికి సరిపోదు.

**దీర్ఘకాలిక పరిష్కారాల అవసరం:** ఢిల్లీలో ప్రస్తుత ఈ చర్య అనేది వాయు కాలుష్యం అనే తీవ్రమైన సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వ నిబద్ధతను సూచిస్తుంది. అయినప్పటికీ, ఇది కేవలం ఒక తాత్కాలిక చర్య మాత్రమే. దేశ రాజధానిలో శాశ్వత పరిష్కారం రావాలంటే, పంట వ్యర్థాల దహనాన్ని పూర్తిగా అరికట్టడానికి రైతులకు ప్రత్యామ్నాయాలను అందించడం, పారిశ్రామిక ఉద్గారాలను తగ్గించడానికి కఠినమైన చట్టాలు, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం వంటి సుస్థిరమైన మరియు దీర్ఘకాలిక విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ పద్ధతి కేవలం ఒక సంక్షోభ నిర్వహణ సాధనంగా మాత్రమే చూడాలి, అంతేకానీ శాశ్వత పరిష్కారంగా చూడకూడదు.

**డి జైరామ్**
**jmrdunga@gmail.com**
**9440485824**

## కలల పక్షుల్లో

పడుకున్నాను
ఓ కల నా కన్నుల్లో దూరింది
గుర్రమెక్కి స్వారీ చేస్తున్నట్టు నేను
కొద్ది సేపటికి మళ్ళీ
ఓ కల నా కన్నుల్లో చేరింది
రథం మీద కూర్చొని తోల్తున్నట్టు నేను
చాపమీద మరోపక్కకి మళ్ళీ
దుప్పటి కప్పుకొని -
తెల్లవారు ఝామున ఓ కల
పాడెమీద పడుకొని వెళ్తున్నట్టు -
టపీమని లేచి పట్టిన చెమట తుడిచి
ఇలలోనే కాదు కలలోనూ
మరణం భయమే -
జీవితంలో వివిధ మజిలీలలో తనకెదురైన
అనుభవించిన సంఘటనలకి చలించలేదు కాని
ఇదేమిటి?
రేపు ఎలా పడుకుంటాను
నిద్రంటే ఆసక్తి పైగా కుతూహలం
ఈ క్షణం నుండే నా కళ్ళల్లోంచి దూకే
వెలుగే క్షీణమైంది
కలలు బుసకొట్టాయా?
డబ్బు పోగొట్టుకున్న ట్టు
ఉత్సాహం పొగొట్టుకొని -
ఐనా
కలల పక్షులన్నీ కలకలారావంతో
సందడికే ఇంత అలజడా!
నిద్రలేస్తేనే తుర్రంటూ జారుకొంటవి
కళ్ళుతెరిస్తేనే బుర్రంటూ ఎగిరిపోతవి
నిజమై జీవిస్తా
కవితై విరుస్తా

**కోటం చంద్రశేఖర్ 9492043348**

## నిద్రలేవకుండానే..

**పగలు రేయి తేడా లేకుండా**
**నిరంతరం పనిచేసే జీవి**
**అటు శారీరకంగా**
**ఇటు మానసికంగా**
**అలసిపోతుంది.. సోలిపోతుంది**
**దానికి ఇల్లే ఉపశమనం**
**కుటుంబమే విశ్రాంతి**
**కాని అవే లేనిపోని రసాభాసలతో**
**ప్రతిదినం నరకమైతే? సేద తీరకుండా**
**మళ్లీ ఉదయాన్నే విధుల్లోకెళ్తే?**
**బంధాలతో బాధలు**
**సంబంధాలతో బాధ్యతలు**
**ఒకేసారి మోయలేక.. వంటిట్లో పాలు కాచకుండానే**
**విరిగిపోతాయి!**
**నట్టింట్లో గుండెలు నిద్రలేవకుండానే**
**పగిలిపోతాయి!!**

**కోటం త్రిశూల్, 8523005678**

# కోత దశలో పంటలు నేలపాలు..

- ఇటీవల కురుస్తున్న భారీ వర్షానికి భారీ నష్టం..
- వరి, పత్తి, మక్క నేలపాలు..
- దిక్కుతోచని స్థితిలో రైతన్న..



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** కోస్తా తీరాన్ని దాటిన మొంథ తుఫాను అలజడికి రైతన్న విలవిలలాడిపోయాడు. పంట చేతికందే సమయంలో మొంతా తుఫాను అలజడిని తట్టుకోలేకపోయాడు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ప్రత్తి మొక్కజొన్న వరి వానకాలంలో 4లక్షల 12వేల ఎకరాల్లో రైతన్న సాగు చేశాడు. కోత దశలో ఉన్న పంటలు ఇప్పటికే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు భారీ పంట నష్టం వాటిల్లింది. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి బుధవారం కురిసిన భారీ వర్షానికి వరి ప్రత్తి మొక్కజొన్న నేలమట్టమయ్యాయి. వాతావరణం అనుకూలించడంతో రంగారెడ్డి జిల్లాలో దాదాపు లక్షల ఎకరాల్లో రైతులు వరి, పత్తి, మొక్కజొన్న సాగు చేశారు. కానీ ఈ తుఫాన్ ప్రభావం రైతుల పాలిట శాపంగా మారింది ఇప్పటికే అధిక వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంట ఆగమై పెట్టుబడి చేతికొచ్చే పరిస్థితి లేదని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. వరి చేతికి వచ్చిన సందర్భంలో ప్రత్తినీ పంట నుండి తీసే సమయంలో వర్షాలు నిండా ముంచాయని లక్షల రూపాయలు అప్పులు చేసి పంట పెట్టుబడి పెడితే అధిక వర్షాలతో రైతన్నకు నష్టం జరిగిందని ప్రభుత్వం అకాల వర్షాలతో పంటను నష్టపోయిన రైతన్నకు న్యాయం చేయాలని కోరుతున్నారు. రైతన్నలు తుఫాన్ ప్రభావంతో దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయని వర్షాల కారణంగా నాణ్యత దెబ్బతిని పంటకు గిట్టుబాటు ధర కూడా రావడం లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

### పంటను నష్టపోయిన రైతన్నను ప్రభుత్వమే ఆదుకోవాలి..



అకాల వర్షాల కారణంగా పంటను నష్టపోయిన రైతన్నను ప్రభుత్వమే ఆదుకోవాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మంచల తిరుమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేసుకున్న రైతన్నకు అకాల వర్షాలు తుఫాన్ ప్రభావం వల్ల పంట నేలకొరిగి నష్టం వాటిల్లుతుందని దీంతో రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నాడని పంట నష్టపోయిన తీవ్రతను ప్రభుత్వం గుర్తించి రైతన్నను ఆదుకోవాలని అన్నారు.

**పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తిరుమలయ్య..**

## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా కాంగ్రెస్ పార్టీ

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి



**కేశంపేట, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆడపడుచుల పెళ్లిళ్లకు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా నిలబడతామని సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన మల్తుంకర్ ఈశ్వరి భాయ్ ఇసు బాబుల కూతురు లక్ష్మీబాయి వివాహం జరగనుండడంతో కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు 11 వేల రూపాయల నిత్యావసర సరుకులను వధువు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య, గుత్తి శేఖర్, గుత్తి రంగయ్య, డాక్టర్ వెంకటేష్, ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, కల్వకోలు నిరంజన్, శంభుల శేఖర్ , పోగుల నర్సింలు, కందెన శివయ్య, పబ్బతి మల్లయ్య, బ్యాగరి మల్లయ్య, బత్తిన శేఖర్, రాజు, బాలకృష్ణ, కావాలి చెన్నయ్య, భాషమోని మల్లేష్, కటిక యాదగిరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు వరం కల్యాణలక్ష్మి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కేశంపేట, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం నిరుపేద కుటుంబాల్లో పుట్టిన ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరం లాంటిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 21 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితోపాటు బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశంపేట తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, ఆర్ఐ చెన్నకేశవ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశం, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు త్రిప్పిశెట్టి కరుణాకర్, భాస్కర్ గౌడ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇబ్రహీం, నాయకులు తుమ్మల గోపాల్, కృష్ణయ్య యాదవ్, రమేష్, ఎండి అమేర్, మల్లేష్ యాదవ్, ముత్యాల్ రెడ్డి పాల్గొన్నారు.

## చెట్ల పొదల్లో గుర్తు తెలియని శిశువు లభ్యం..

- చేరదీసిన స్థానికులు
- శిశు విహార్‌కు తరలించిన పోలీసులు
- కేసు నమోదు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** అర్ధరాత్రి 2గంటల సమయంలో చెట్ల పొదల్లో నుంచి శిశువు ఏడుపు గమనించిన స్థానికులు వెళ్లి చూడగా చెట్ల పొదల్లో వర్షం పడుతుండగా అప్పుడే పుట్టిన మగ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్ళిపోవడంతో స్థానికులు చేరదీశారు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా చౌదర్ గూడా మండలం మల్కాపహడ్ తండా సమీపంలోని ఇటుక బట్టిల దగ్గర చెట్ల పొదల్లో నుండి శిశువు ఏడుపు గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకున్న చౌదర్ గూడా మండల పోలీసులు శిశువును స్వాధీనం చేసుకొని అమీర్ పేట్ లోని శిశు విహార్ కు తరలించరూ అంగన్ వాడి టీచర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌదర్ గూడా మండల ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి



**వీపనగండ్ల, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పుల్గర్ చర్ల గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి రైతులతో కలిసి వేరుశనగ, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పుల్గర్ చర్ల గ్రామంలో పర్యటించిన జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు గౌడ్ పంట పొలాలను పరిశీలించి రైతులకు తెగుళ్లు పురుగుల నివారణ ఏ విధంగా ఉపయోగించుకోవాలని రైతులకు వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారులు మండల అగ్రికల్చర్ అధికారులు వ్యవసాయ విస్తరణ మండల అధికారులు మోహన్ కుమార్ రెడ్డి, రైతులు గోవిందు, మధుగం నరేష్, జుర్రు శివుడు, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం




**చేవెళ్ల, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** 42 శాతం బిసి రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదు అని బిసి రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు అన్నారు. గురువారం 18 వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా పద్మశాలి సంఘం నాయకులు ఏశాల చంద్రశేఖర్ పద్మశాలి, భాస నర్సింలు పద్మశాలి, ఏశాల మధుసూదన్ పద్మశాలి, డాక్టర్ రాజు పద్మశాలి మద్దతు తెలుపుతూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏశాల చంద్రశేఖర్ పద్మశాలి, ఏశాల మధుసూదన్ పద్మశాలి, భాస నర్సింలు పద్మశాలి మాట్లాడుతూ...జనాభాలో అధిక శాతంలో ఉన్న బిసి లు అణిచివేతకు గురవుతున్నారని 42 శాతం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశాలు కల్పించాలని, ప్రతి బిసి నాయకులు రాజకీయంగా రాణించాలని అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు న్యాయమైన పోరాటమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు జెడల రాజేందర్ గౌడ్, తమ్మలి రవీందర్, నక్క శ్రీనివాస్ గౌడ్, రమేష్ యాదవ్, రాపోలు నర్సింలు, పద్మశాలి సంఘం నాయకులు కృష్ణ, సతీష్, భాస వేణు, బాస కరుణాకర్, సత్యనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి

### ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను



**కేశంపేట, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** భారతదేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి పై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్ నగరంలో నవంబర్ ఒకటవ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే దళిత ఆత్మగౌరవ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిర్ర శ్రీను మాట్లాడుతూ జస్టిస్‌పై దాడి చేయడం అంటే దళితులందరిపై దాడి చేయడంగానే భావిస్తున్నామని అన్నారు. దాడి చేసిన న్యాయవాదిని ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. నిరసన ప్రదర్శనకు మండలంలోని ప్రతి గ్రామం నుండి వందలాదిమంది దళితులు తరలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చిర్ర రమేష్, దశరథ్, కృష్ణయ్య, రామచంద్రయ్య, జంగయ్య, గోపాల్, యాదగిరి, చింటు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన రికార్డులను పరిశీలించిన ఎంపిడిఓ కిశోర్ కుమార్



**కృష్ణ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** కృష్ణ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముడుమాలలో ఉదయం 11గంటలకు కృష్ణ మండల ఎంపిడిఓ శ్రీ కిశోర్ కుమార్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, బియ్యం నాణ్యత, వంటకు వాడే నీరు, స్టాక్ రిజిస్టర్, ఇష్యూ రిజిస్టర్,టేస్ట్ రిజిస్టర్,ఫుడ్ సెఫ్టి కమిటీ రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన కార్మికులతో విద్యార్థులతో మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కు భోజనం సర్వ్ చేసి,భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యంపిడిఓ భాధ్యతలు చేపట్టిన తరువాత మొదటగా ముడుమాల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్,పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధ్యాయులు భారతి, రవికుమార్, ఆస్మా నిషాత్, జ్యోతి, పద్మావతమ్మ, వాలంటీర్ శిరీష, సర్వీస్ పర్సన్స్ సోఫీ, శివమ్మ మధ్యాహ్న భోజన సిబ్బంది పద్మమ్మ, నర్సమ్మ, సురేఖ, హాఫీజా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన అవసరం

- ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు



**ఖైరతాబాద్, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలతో పాటుగా వాహ నాల కండిషన్ సరిగ్గా లేకపోవడం, పర్యావరణ ప్రతికూల పరిస్థితులో కూడా డ్రైవ్ చేయడం, లాం గ్ జర్నీలో డ్రైవర్లకు రెస్ట్ లేకపోవడం తదితర కార ణాలతో రోజుకు 1317 రోడ్డు ప్రమాదాలు జరుగు తుంటే 470 మంది చనిపోతున్నారని, కాళ్ళు చేతు లు విరగడం, అంగ వైకల్యంతో సుమారు వందల మంది బాధ పడుతున్నారని, రోడ్డు ప్రమాదాలకు రహదారుల నిర్మాణాల్లో లోపాలు కూడా కారణమ ని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండీల్య అన్నారు.గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఏస్కీ)లో భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ అండ్ హై వేస్ ఆధ్వర్యంలో సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం రోడ్ యాక్సిడెంట్స్ పై ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో బుధవారం సందీప్ శాండీల్య మాట్లాడుతూ 2023లో 4 లక్షల 43 వేల రోడ్ ప్రమాదాల్లో 4 లక్షల 61వేల మంది అంగ వైకల్యం పొందడం బాధాకరమన్నారు. తమిళనాడు రాష్ట్రం రోడ్డు ప్రమాదాల్లో మొదటి స్థానం ఉంటె, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో రోడ్ ప్రమాదాలతో ఎక్కువ మంది గాయ పడుతున్నారని అన్నారు. ఏస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు మాట్లాడుతూ రోడ్ ఆక్సిడెంట్ సంబంధించిన శిక్షణా కార్యక్ర మాలు ఎస్కీలో ఎక్కువగా చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు చేయూత అందిస్తున్న డాక్టర్ గురువారెడ్డి ఆధ్వర్యంలో పనిచేస్తున్న సర్వేజనా ఫౌండేషన్‌తో కూడా ఎస్కీ ఒప్పందం చేసుకుందని, రోడ్ ప్రమాదాల నియంత్రణకు యునైటెడ్ నేషన్స్ ప్రతిపాదించిన సేఫ్టీ వెహికల్ డిజైన్స్, సేఫర్ రోడ్ యూజర్స్, గ్రీన్ ఫీల్డ్ హై వేస్, పోస్ట్ క్రాష్ కేర్ మొదలైనవి అమల్లోకి రావాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ ట్రాన్స్ పోర్టేషన్ హెడ్ డాక్టర్ ఆర్.వెంకటరెడ్డి, ఫ్యాకల్టీ సి.హెచ్ తిలక్, సునీత తదితరులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుండి అభ్యర్థులు హాజరయ్యారు.

## పేద కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఎంతో వరం



**శంకర్‌పల్లి, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఎంతో దోహదం చేస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పేర్కొన్నారు. శంకర్ ప ల్లి మండల పరిషత్ కార్యాలయంలో తహ సిల్దార్ సురేందర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డితో కలిసి 62 కళ్యాణ లక్ష్మి, ఏడు షాదీ ముబారక్ చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్ల కోసం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. శంకర్‌పల్లి తహసిల్దార్ సురేందర్ మాట్లాడుతూ శంకర్పల్లి మండలంలో 62 మంది కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు, ఏడుగురు షాది ముబారక్ లబ్ధిదారులకు రూ. 67 లక్షల 7 వేల 772/- చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, సొసైటీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో వెంకయ్య గౌడ్, గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయకులు బొల్లారం వెంకటరెడ్డి, బొల్లారం ప్రశాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సర్తాజ్, చంద్రమౌళి, చాకలి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే



**ఉప్పల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** హనుమాన్ ఆలయం ఉప్పల్ భాగాయత్ వెనుక మంజూరైన ఎస్ టి పి ప్లాంట్ స్థానాన్ని మార్చమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి . మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతపత్రం అందజేశారు. ఉప్పల్ భాగయత్‌లోని హనుమాన్ ఆలయం సమీపంలో హైదరాబాద్‌లోని హెచ్ఎమ్డబ్ల్యూఎస్ మరియు ఎస్‌బి మంజూరు చేసిన మురుగునీటి శుద్ధి కర్మాగారం ఎస్‌టిపి నిర్మాణంపై నాలుగు కాలనీలు 1. కూర్మా నగర్ 2. ఉప్పల్ హిల్స్ 3. లక్ష్మీ నరసింపనగర్ మరియు 4. సమదాన్ సొసైటీ నివాసితులు తీవ్రమైన అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ అలాగే ఈ నాలుగు కాలనీలకు ఈ ప్రదేశం దగ్గరగా ఉంది, ఇక్కడ 1997 నుండి దాదాపు 2,000 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ నివాస మండలంలో ఎస్‌టిపి ఏర్పాటు వల్ల దుర్వాసన వస్తుందని, బ్యాక్టీరియా వ్యాప్తి చెందుతుందని, గాలి మరియు పర్యావరణ కాలుష్యం సంభవిస్తుందని, తద్వారా నివాసితుల ఆరోగ్యం, శ్రేయస్సుపై ప్రభావం చూపుతుందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. పైన పేర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకుని, ప్రతిపాదిత ఎస్‌టిపి స్థానాన్ని పునఃపరిశీలించి, నివాసితుల అసౌకర్యాన్ని నివారించడానికి మరియు వారి ఆరోగ్యం మరియు శ్రేయస్సును కాపాడటానికి దానిని ప్రత్యామ్నాయ నాన్-రెసిడెన్షియల్ ప్రాంతానికి మార్చమని నేను హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎం డబ్ల్యూ మరియు ఎస్‌బి) మేనేజింగ్ డైరెక్టర్ తో మాట్లాడు తాను అని ఎంపీ ఈటల రాజేందర్ ,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఈ విషయంలో వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 అక్టోబర్ 2025

# సీఎం ప్రకటించిన వెయ్యి కోట్ల నిధులు ఎక్కడ..?

- శ్వేతపత్రం విడుదల చేయండి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. నారాయణ



**వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** వనపర్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన,వెయ్యి కోట్ల నిధులు ఎక్కడని, వాటిపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ వనపర్తి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో పాతికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్స్ (యుఐడిఎఫ్) ద్వారా 11 మున్సిపల్ కార్పొరేషన్లు,36 మున్సిపాలిటీలలో డ్రైనేజీ, సిసి రోడ్లు, త్రాగునీరు సరఫరాకై 2954.52 కోట్లు మంజూరు చేసిందని, అందులో కేంద్ర ప్రభుత్వం నేషనల్ హౌసింగ్ బ్యాంకు( ఎన్ హెచ్ బి) ద్వారా 80 శాతం, నిధులు 2352.42 కోట్లు విడుదల చేయగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 523 కోట్లలో వనపర్తి మున్సిపాలిటీకి 18.70 కోట్లలో 15 కోట్లు వాటా,3.70 కోట్లు రాష్ట్ర వాటా అని, మున్సిపల్ కార్యదర్శి డా. టీకే శ్రీదేవి ,స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగిందని, కానీ స్థానిక శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు పూర్తిగా రాష్ట్ర బడ్జెట్ మేమే ఇస్తున్నామని, ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని 80శాతం నిధులను ఆధారాలతో సహా ఏ వేదిక ద్వారానైనా నిరూపించడానికి, బిజెపి సిద్ధంగా ఉందని, సీఎం రేవంత్ రెడ్డి 1000 కోట్ల నిధులపై, ఎమ్మెల్యే మేఘా రెడ్డి కి వనపర్తి ప్రజల పట్ల అభిమానం చిత్తశుద్ధి ఉంటే ,జీవోలు,ఆర్థిక శాఖ అనుమతులు, ఎక్కడెక్కడ శంకుస్థాపనలు, జరిగి పనులు, కొనసాగుతున్నాయో, ఒక శ్వేత పత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో శాసనసభ్యులు సీఎం ని కలవడం ఆనవాయితీ అని, కలిసిన ప్రతి సందర్భంలో 100, 200 కోట్ల నిధులు వనపర్తికి సాధించానని, పత్రికల్లో రాయించుకుని ఆనందపడితే, అది అభివృద్ధి కాదని విజ్ఞులైన వనపర్తి ప్రజలు అన్ని గమనిస్తున్నారనే విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.వర్షాకాల ధాన్యానికి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న శాసనసభ్యులు మేఘా రెడ్డి,యాసంగి సీజన్లో రైతులకు బకాయి పడ్డ సన్నాళ్ల బోనస్ డబ్బులు దాదాపు 48 కోట్ల కై 4 నెలలుగా రైతులు వ్యవసాయ కార్యాలయాలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, వరి ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వానికి రైతులకు మధ్య నోడల్ ఏజెన్సీగా ఉంటున్న పౌరసరఫరాల సంస్థ రైతులకు మద్దతు ధర ప్రకారం వారం లోపు అకౌంట్లో డబ్బులు వేస్తే, రాష్ట్ర ప్రభుత్వ మాత్రం నాలుగైదు నెలలుగా రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారని, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్రభుత్వంతో మాట్లాడి జిల్లాలోని రైతులకు బోనస్ బకాయిలను విడుదల చేయించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి బిజెపి కలెక్టరేట్ ముట్టడిస్తుందని హెచ్చరించారు. మరికుంట చెరువు అలుగు నీరు వల్ల పెబ్బేరు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్య సంబంధిత కాలనీ ప్రజల సమస్యలను మూడు దఫాలుగా వివిధ రూపాల్లో కలెక్టర్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వ తప్పిదమని, చెప్పడం అవివేకమని, నీరు పల్ల మెరుగు నిజం దేవుడెరుగు అనే నానుడిని మరిచిన కాంగ్రెస్ నాయకులు ఎగువకు కాలువ ద్వారా నీటిని తరలిస్తామని కల్వర్టు కట్టి సమస్యను సృష్టించారని, జరిగిన పొరపాటున మీరే సరిదిద్దుకోవాలని, లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, సర్పంచ్ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, మీడియా కన్వీనర్ తిరుమలేష్, కార్యాలయ కార్యదర్శి ఆగపోగు కుమార్ ,పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లుల విడుదలయ్యేదాకా పోరాటం

- ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులకు మరియు పిఆర్సి విషయంలో పోరాటం నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం కుత్బుల్లాపూర్ మండలంలో సాయి ఫంక్షన్ హాల్లో పిఆర్టియు మండల అధ్యక్షులు ఎస్.సుభాష్ అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయులు డి.భగవంతు రెడ్డి పదవి విరమణ సన్మాన కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు.సర్వీస్ లో ఉన్న ఉపాధ్యాయులకు పెట్టిన నిబంధనను రద్దు చేసేందుకు న్యాయపోరాటం చేస్తున్నట్లు తెలిపారు.జీపీఎఫ్,సంబంధించిన మనం దాచుకున్న డబ్బులను సరైన సమయంలో ఇవ్వకపోవడం దారుణమని సి.ఆర్.టి.టి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ విచారం వ్యక్తం చేశారు.ఎంఎల్సి ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమానికి సిద్ధమని చెప్పారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుల ప్రధాన కార్యదర్శులు వై.రామేశ్వర్ గౌడ్,సిహెచ్ ఆనంద్ రెడ్డి,ఏ.ఎం.ఓ రవీందర్ రాజు,జిహెచ్ఎంఏ అధ్యక్షులు రామ్ రెడ్డి,కుత్బుల్లాపూర్ మండల ఎంఈఓ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీకార్యాలయంలో రక్తదాన శిబిరం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవం గుర్తుగా రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న పోలీస్ అధికారుల తో పాటు యువకులు పాల్గొని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను కాపాడిన వారవుతారని తెలిపారు. రక్తదానం చేయడానికి వచ్చిన యువకులను అభినందించారు.రక్తదానం లో పాల్గొన్న పోలీస్ అధికారులకు మరియు యువకులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర్లు నాగర్ కర్నూల్ డిఎస్పి శ్రీనివాస్, ఎస్ బి సి ఐ కనకయ్య ,డిసిఆర్బిసిఐ ఉపేందర్ రావు , నాగర్ కర్నూల్ సిఐ అశోక్ రెడ్డి ఆర్ఐ జగన్ నాగర్ కర్నూల్ ఎస్సై గోవర్ధన్, ఆర్ఎస్ఐ గౌస్ పాషా, ప్రశాంత్, శివాజీ లతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ హెల్త్‌పై అవగాహన

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలో బిఎస్సీ నర్సింగ్ కాలేజీ నాలుగో సంవత్సరం విద్యార్థులచే స్కూల్ హెల్త్ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సతీమణి మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి హాజరయ్యారు. స్కూల్ హెల్త్ అవగాహన సదస్సు కార్యక్రమం నర్సింగ్ కాలేజీ ఫోర్త్ ఇయర్ విద్యార్థుల చేత పాఠశాలలోని విద్యార్థులకు ట్రైనింగ్‌లో భాగంగా అవగాహన కల్పించడం జరిగింది.ప్రస్తుతం సమాజంలో మహిళలు, విద్యార్థినీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు,ఆరోగ్య, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పించడం జరిగినది. స్కూల్ దశ నుండి విద్యార్థులు, ఆడపిల్లలు ఎలా ఉండాలి అనే విషయంపై ఆడపిల్లలకు అవగాహన కల్పించడం జరిగినది అని పేర్కొన్నారు. ఆడపిల్లలు చిన్నప్పటినుండి మంచి క్రమశిక్షణ,సంస్కృతి సాంప్రదాయబద్ధంగా నడవడిక ఉండాలనీ చదువుతోపాటు అన్ని రంగాలలో కూడా రాణించాలనీ. అదేవిధంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ మంచి పోషక పదార్థాలను తీసుకోవాలి.శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలనీ,చెడు అలవాట్లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని మంచి ఆలోచనలను మంచి అలవాట్లపై శ్రద్ధ వహించాలనీ అని తెలిపారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ తక్కువగా వాడాలనీ దాని వల్ల ఎంత ఉపయోగం ఉంటే అంతనే ఉపయోగించుకోవాలి మొబైల్ వల్ల లాభము ఉన్నది అలాగే నష్టము ఉన్నది కాబట్టి చిన్నప్పటినుండి దానిని మంచికి ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ బి.ఎస్సి నర్సింగ్ కాలేజీ నాలుగో సంవత్సరం విద్యార్థులు స్కూల్ హెల్త్ అవగాహన కార్యక్రమం చక్కటి కార్యక్రమం నిర్వహించడంపై విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు ఏ విధంగా ఉండాలి వ్యక్తిగత శుభ్రతను ఏ విధంగా ఉంచుకోవాలి అనే విషయాల పైన అవగాహన కల్పిస్తూ అదే విధంగా సమాజంలో నెలకొన్న సమస్యలను బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల పైన అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం నింపడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. చిన్నప్పటి నుండి ప్రతి ఒక్క ఆడపిల్ల మంచి మార్గము వైపుగా అడిగులు వేయాలి చదువుతోపాటు అన్ని రంగాలలో అవగాహన కలిగి ఉండాలి




మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించాలి పెద్దల మాటలను గౌరవించాలి అలాగే మనము తీసుకునే పదార్థాలలో పోషక పదార్థాలు ఉండేలా చూసుకొవాలనీ మంచి పోషక పదార్థాలు తీసుకోవడం వల్ల మనము ఆరోగ్యంగా ఉండడం జరుగుతుంది ప్రస్తుతం సమాజంలో జంక్ ఫుడ్ కు నూనె పదార్థాలకు అలవాటు కావడంతో ఆడపిల్లలు బలహీనంగా ఉంటున్నారని కాబట్టి వాటిని అరికట్టి మంచి ఆరోగ్యకరమైన పోషక పదార్థాలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ రాధా రెడ్డి,నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్, లెక్చరర్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద ఉధృతితో జంట జలాశయాల గేట్లు ఎత్తివేత





- 6203 క్యూసెక్కుల వరదనీరు విడుదల

**రాజేంద్రనగర్,అక్టోబర్ 29 (జనం సాక్షి) :** మొంథా తుఫాను ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురవడంతో, మోమిన్పేట్, వికారాబాద్, తాండూర్ ప్రాంతాల నుండి భారీగా వరద ప్రవాహం జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, గండిపేట (ఉస్మాన్ సాగర్)లకు చేరింది. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు బుధవారం రెండు జలాశయాల గేట్లు ఎత్తివేసి మొత్తం 6203 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదిలారు. హిమాయత్ సాగర్ పూర్తి నీటిమట్టం 1763.50 అడుగులు వద్ద ఉండగా, ఇన్‌ఫ్లో 5600 క్యూసెక్కుల వరద నీరు చేరడంతో అధికారులు 4 గేట్లు ఎత్తి 3963 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.గండిపేట జలాశయం (ఉస్మాన్ సాగర్) వద్ద నీటిమట్టం 1790 అడుగులకు చేరగా, ఇన్‌ఫ్లో 3400 క్యూసెక్కుల వరద రావడంతో 3 గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి 2240 క్యూసెక్కుల నీటిని వదిలారు.గండిపేట నుంచి నీరు విడుదల కావడంతో మంచిరేవుల బ్రిడ్జి, కిస్మత్పూర్ దర్గా ఖలీజా సర్వీస్ రోడ్డు బ్రిడ్జి పైగా వరద ప్రవహిస్తోంది. ఫలితంగా బ్రిడ్జి ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా రహదారిని మూసివేసి భద్రత చర్యలు చేపట్టారు.

### అధికారుల చర్యలు శూన్యం

అయితే, గత నాలుగు నెలలుగా జంట జలాశయాల గేట్లు ఎత్తివేయడం జరుగుతుండగా, ప్రతి సారి హిమాయత్ సాగర్, మంచిరేవుల ప్రాంతాల్లో వరద ఉధృతి పెరిగినా అధికారులు తక్షణ చర్యలు తీసుకోలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఔటర్ రింగ్ రోడ్ కిస్మత్పూర్ కాలేజ్-దర్గా ఖలీజా సర్వీస్ రోడ్డు వరద నీటితో మునిగిపోయి పూర్తిగా దెబ్బతింది. గతంలో కూడా ఇదే బ్రిడ్జి వరదతో ధ్వంసమై తిరిగి నిర్మించినా, ప్రత్యామ్నాయ మార్గం లేదా శాశ్వత పరిష్కారం లేకపోవడంతో మళ్లీ అదే సమస్య పునరావృత మైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటుతో పాటు శాశ్వత రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నాణ్యమైన విద్య కోసం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, నాణ్యమైన విద్యను అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి సూచించారు.బుధవారం అలంపూర్‌లోని అంగన్వాడీ కేంద్రం, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ను, అనంతరం గద్వాలలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటించి,అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి,ఆహార నాణ్యతపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పిల్లల విద్యా సామర్థ్యాలను వారిని చదివించటం ద్వారా తెలుసుకున్నారు.దేశ భవిష్యత్ పిల్లలపైనే ఆధారపడి ఉంటుందని, వారి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లల అభ్యాస పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత సృజనాత్మకంగా బోధించాలన్నారు. విద్యతో పాటు పిల్లలకు నైతిక విలువలు, సామాజిక అవగాహన, మరియు ఆత్మవిశ్వాసం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు అపర్ణ, ప్రేమలత అగర్వాల్, వందన, చందన, సరిత వచన్ కుమార్,అడిషనల్ కలెక్టర్ నర్సింగ్ రావు, జిల్లా సంక్షేమ అధికారి సునంద,ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్,డీసీపీఓ నరసింహ,సీడీపీఓ సుజాత,సీవీసీ చైర్మన్ సహదేవుడు,మెంబర్ శైలజ,తహసీల్దార్ మంజుల దేవి, ఎంఈఓ అశోక్,సూపర్వైజర్ నర్గీస్ తదితర అధికారులు పాల్గొన్నారు.


## శ్రీభవిత విద్యాలయం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

- పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** శ్రీ భవిత విద్యాలయం స్కూల్ గుర్తింపు రద్దు చేయాలనీ బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దానమ్మకి వినపత్రం అందజేసిన పివైఎల్ జిల్లా అధ్యక్షులు బీరెల్లి దానయ్య అన్నారు. బెడ్ రూమ్,కిచెన్, హాల్, ఉన్న ఇంటికి స్కూల్ పర్మిషన్ తీసుకొని,ఇంటిలో 140 మంది విద్యార్థులు, గురుకుల కోచింగ్,హాస్టల్ నడుపుతున్నారని ఆయన అన్నారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో ఉన్న శ్రీభవిత విద్యాలయం స్కూల్ పర్మిషన్ రద్దు చేయాలన్నారు. శ్రీ భవిత విద్యాలయం స్కూల్ యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ను కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మిచేడు కార్తీక్, జగ్గిరెడ్డిపల్లి భీమేష్, ఉప్పేర్ సాయి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక సహాయకుల సమస్యలు పరిష్కరించాలి



**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూలు జిల్లాలోని సాంకేతిక సహాయకుల సమస్యలపై జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి నాగర్ కర్నూల్ జిల్లా సాంకేతిక సహాయకులు బుధ వారం నాడు వినతి పత్రం సమర్పించారు. సాంకేతిక సహాయకులకు పని భారము ఎక్కువగా ఉందని అందువలన మండలాల కనుగుణంగా సాంకేతిక సహాయకుల సంఖ్యను పెంచే విధంగా చూడాలని, పనులకు సంబంధించిన రికార్డులను ఏ గ్రామ పంచాయతీకి సంబంధించినవి, ఆ గ్రామ పంచాయతీ చూసే విధంగా చూడాలని, సాంకేతికపరంగా చేయవలసిన పనులు ఎక్కువగా ఉన్నందున ప్రతి ఒక్కరికి ల్యాప్టాప్ లు వచ్చే విధంగా చూడాలని, సాంకేతిక అంశాలు మరియు సోషల్ ఆడిట్ కు సంబంధించి వర్క్ షాప్ నిర్వహించాలని మొదలైన సమస్యలపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చిన్న ఓబులేష్ కి వినతి పత్రం సమర్పించారు. ప్రతి నెల2 తారీకు లోపల జీతాలు వచ్చే విధంగా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు బాలయ్య, రాజేష్, శ్రీనివాస్, మహేందర్ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు సాంకేతికతపై అవగాహన అవసరం

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్

**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతికతపై అవగాహన పెంచుకొని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందేలా పాఠాలు బోధించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. బుధవారం గద్వాల బాలభవన్ లో విద్యాశాఖకు సంబంధించిన పలు యాప్‌లు, వివిధ పోర్టల్‌ల గురించి జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ,ఇతర టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ పనితీరు మెరుగుపడేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఉపాధ్యాయులు అందుకు అనుగుణంగా తమ విధులు నిర్వహించాలన్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ప్రయోగపూర్వకంగా, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు.పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మన జిల్లా మెరుగైన స్థానాన్ని పొందేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించినందున, దాని ప్రకారం ముందుకెళ్లాలని ఆదేశించారు. తాను తరచు జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యా సంస్థలను సందర్శిస్తున్నానని, విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు.చాలామంది విద్యార్థులు సరిగ్గా చదవలేక పోతున్నారని, వారికి అర్థమయ్యే రీతిలో బోధించాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కెరీర్ కు ఉపయోగపడేలా పాఠ్యాంశాలు బోధించాలని,ఫలితంగా వారిలో నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. మన రాష్ట్రం విద్యారంగంలో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించేందుకు అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యా వ్యవస్థ ఏ విధంగా ఉందో పరిశీలించేందుకు ప్రతి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి త్వరలోనే విదేశాలకు పంపుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడమే కాక వివిధ విద్యా శాఖ కార్యక్రమాలతో ఉపాధ్యాయులకు బాధ్యతలు ఎక్కువగా ఉన్నప్పటికీ అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాపరంగా జోగులాంబ గద్వాల జిల్లా మెరుగైన స్థానంలో ఉండాలంటే ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా విధులు



నిర్వహించాలన్నారు. అలసత్వం వహించే వారిని ఉపేక్షించేది లేదని, శాఖా పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన ప్రధానోపాధ్యాయుల హ్యాండ్బుకును కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు శాంతిరాజు, హంపయ్య, ఎంఈఓ లు,తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ నగరం జలమయం

- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీరు
- అప్రమత్తంగా ఉన్న అధికార యంత్రాంగం
- సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వరంగల్, హనుమకొండ జిల్లాలను రెడ్ అలర్ట్ గా ప్రకటించిన వాతావరణ శాఖ







**వరంగల్ బ్యూరో అక్టోబర్ 29 (జనం సాక్షి) :** మొంతతుఫాన్ ప్రభావంతో వరంగల్ నగరంలో భారీగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లన్నీ నీళ్లతో నిండడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాతావరణ శాఖ వరంగల్ హనుమకొండ జిల్లాలను రెడ్ అలర్ట్‌గా ప్రకటించింది. ముఖ్యంగా వరంగల్ నగరంలోని అండర్ బ్రిడ్జ్, హంటర్ రోడ్, సంతోషిమాత కాలనీ, బిఆర్ నగర్, ఆర్ఎస్ నగర్, ఎన్టీఆర్ నగర్, శివనగర్, నాగేంద్ర నగర్, బీరన్న కుంట, కొత్తవాడ కిల వరంగల్, డీకే నగర్, రంగసాయిపేట ప్రాంతాలతో పాటు హనుమకొండ, కాజీపేట లోని పలు లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు తమ ఇండ్లలోకి నీరు చేరడంతో అయోమయానికి గురయ్యారు. వరంగల్ నగరమే కాకుండా ఉమ్మడి జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాలలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వరద నీటి కారణంగా పలు కాలనీలో ఇండ్లలోకి నీరు చేరి గృహవాసులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు, రైతులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి ప్రభుత్వం సూచిస్తుంది. అవసరమైతే తప్ప ప్రజలు బయటికి రావద్దని జిల్లా కలెక్టర్ సత్య శారద సూచించారు. అత్యవసర సహాయార్థం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424 జిడబ్ల్యూ ఎంసీ లో 1800 425 1980, 9701999676 నెంబర్ల ఏర్పాటు చేశారు. టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులను వరంగల్ జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేస్తున్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సూచించారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భారీ వర్షానికి సంబంధించిన సమాచారా న్ని తెలుసుకుంటూ తగిన సూచనలు ఇస్తున్నారు. అన్ని శాఖల అధికారులతో పాటు పోలీసు యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంది.

## భారీ వర్షాల నేపథ్యంలో 24/7 కంట్రోల్ రూమ్ సేవలు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 29 (జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజలకు అత్యవసర సేవల నిమిత్తం కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కంట్రోల్ రూమ్ ద్వారా సేవలను 24/7 పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ '7981975495' ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని సూచించారు. వరదల కారణంగా అత్యవసర సేవల నిమిత్తం అందుబాటులో తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలని ప్రజలను కోరారు.

## రైతు ప్రయోజనాల కోసం పని చేయాలి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సునీల్‌కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతు ప్రయోజనాల కోసం సమన్వయంతో పని చేయాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్‌కుమార్ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఉద్యాన, వ్యవసాయ, సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్‌కుమార్, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, జిల్లా వ్యవసాయాధికారి జాడి బాపురావు పాల్గొన్నారు. ఉద్యాన శాఖ అధికారి ఏ. సునీల్‌కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో ఉద్యాన శాఖ తరపున అమలవుతున్న వివిధ పథకాల ప్రయోజనాలు, భౌతిక లక్ష్యాలు, రైతులకు చేరే మద్దతు, అలాగే శాఖల సమన్వయం ద్వారా అమలులో వేగం పెరగాలని సూచించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి వాలియా నాయక్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కు ఏపీసీ నిర్దేశించిన విధంగా 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని, మండలాల వారీగా రైతుల అవగాహన సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారులు పథకాల లక్ష్యాలు, రాయితీలు, ప్రయోజనాలు, రైతులకు అందే లబ్ది గురించి ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు, సహకార సంఘాల సీఈఓలు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉపయోగకరంగా ఉద్యాన దర్శిని పుస్తకాలు

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో ఉద్యాన పంటలపై అవగాహనను మరింత పెంచి, రైతులకు సాంకేతిక సమాచారం సమయానుకూలంగా చేరేలా చేసేందుకు ఉద్యాన దర్శిని పుస్తకాలు ఉపయోగపడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధి కారులు, మండల వ్యవసాయ అధికారులకు ఉద్యాన దర్శిని పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు ఆధునిక పద్ధతులు, పంట సంరక్షణ, మార్కెట్ సదుపాయాలు, రాయితీల వివరాలు క్షేత్ర స్థాయిలో విస్తరణాధికారులు రైతులకు తెలియచేయాలని తెలిపారు. ఉద్యాన దర్శిని పుస్తకంలోని సమాచారాన్ని గ్రామస్థాయికి చేర్చి ప్రతి రైతును ప్రయోజనవంతులను చేయాలని సూచించారు. జిల్లాలో ఉద్యాన పంటల విస్తరణకు ప్రభుత్వం తీసుకొస్తున్న పథకాల వివరాలు రైతులకు అర్థమయ్యేలా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖాధికారి సునీల్ కుమార్, జిల్లా వ్యవసాయాధికారి జాడి బాపురావు, సహకార అధికారి వాలియా నాయక్, డిఆర్డీఓ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వరి కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్29 (జనంసాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం లోకేశ్వరం మండలంలోని హవర్గా గ్రామంలో పీఏసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కేంద్రంలో నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్ ఫ్రీ నంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. టెంట్, త్రాగునీటి వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు, వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి, పంట రుసుము సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పంటకు మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని శుభ్రపరిచి, తగిన తేమ శాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, టోల్ ఫ్రీ నంబర్ 9182958858 ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డి సి ఓ నర్సయ్య, జిల్లా పౌర సరఫరా అధికారి రాజేందర్, పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, తహసీల్దార్ భోజన్న, ఎం పి డి ఓ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- రోడ్డు పనులపై కలెక్టర్ స్వయంగా పరిశీలన



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లాలో జరుగుతున్న రోడ్డు పనులను బుధవారం జిల్లా కలెక్టర్ వెళ్లి స్వయంగా పరిశీలించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. బుధవారం భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామంలో పీఎం–జన్మన్ పథకం ద్వారా మంజూరైన రహదారి పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులు తక్షణమే ప్రారంభించి, నిర్ణీత గడువులో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌తో పాటు పంచాయతీ రాజ్ విభాగం ఈఈ శివరాంను ఆదేశించారు. గ్రామీణ రహదారులు పూర్తి అయితే ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తాగునీటి సరఫరా లోపం గురించి తెలియజేయగా, కలెక్టర్ వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భీంపూర్ మండలం జెడ్పీ రోడ్డునుంచి గొల్లఘాట్ వరకు 5 కిలోమీటర్ల రహదారి పనికి రూ. 448.00 లక్షలు, అదేవిధంగా ఆదిలాబాద్ రూరల్ మండలం జెడ్పీ రోడ్డునుంచి బుర్కి వరకు 7 కిలోమీటర్ల రహదారి పనికి రూ. 614.00 లక్షలు అంచనా వ్యయంతో పీఎం–జన్మన్ నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, శానిటేషన్ కార్యక్రమాలు, ప్రజా సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సతీష్ సంబంధిత వివరాలను అందించారు. గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచిస్తూ, విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. భోజన స్టాక్, విద్యార్థుల హాజరును పరిశీలించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాల ప్రయోజనం ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆదిలాబాదు గ్రామీణ మండలం అశోదబుర్కీ గ్రామానికి పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపడుతున్న పీఎం జన్మన్ రోడ్డు పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, తహసీల్దార్ నలంద ప్రియ, ఉపాధ్యాయుడు లక్ష్మీకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల వద్ద అలర్ట్‌గా ఉండాలి

- వర్షపు నీరు ఆగకుండా వెంటనే చర్యలు
- రవాణా పరం గా ఇబ్బందులు రావద్దు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో... ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తం గా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలోని పలు ప్రాంతాలను బుధవారం కలెక్టర్ క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. హన్మకొండ – హైదరాబాద్ హైవే మార్గంలోని రఘునాథ్ పల్లి బ్రిడ్జి వద్ద వర్షపు నీరు ను పరిశీలించి.... వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని.. ఆగకుండా తగు చర్యలు తీసుకోని... రవాణా పరం గా ఇబ్బంది కలగకుండా చూడాలని.. పోలీస్, రెవిన్యూ, ఆర్ అండ్ బి తదితర శాఖ ల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగె జనగాం పట్టణం లో ఎక్కడ కుడా వర్షపు నీరు ఆగకుండా... ట్రాఫిక్ సమస్య తలెత్త కుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో ఒక్కటైన భార్య భర్తలు

- జడ్జి చొరవతో రాజీపడిన దంపతులు
- కుటుంబాన్ని కలిపిన జడ్జికి కృతజ్ఞతలు తెలిపిన జంట




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ చొరవతో గత మూడు సంవత్సరాలుగా విడిగా జీవిస్తున్న భార్య భర్తలు తమ కేసుల్లో రాజి చేసుకొని కలిసి బతకడానికి నిర్ణయించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జిల్లాకు చెందిన దంపతులు గొడవ పడి పోలీస్ స్టేషన్ ను సంప్రదించారు. చివరగా కోర్టు ను ఆశ్రయించారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2023 నుండి పెండింగులో వున్నా వీరి కేసును జడ్జి మధ్యవర్తిత్వానికి సిఫారసు చేశారు. న్యాయవాది పి.ఆనందరావుని మీడియేటర్ గా నియమించారు. జడ్జి పర్యవేక్షణలో భార్య భర్తలకు కౌన్సిలింగ్ నిర్వహించిన ఆనందరావు వారిని కలిసి జీవించే విధంగా ప్రోత్సహించారు. జీవితం విలువను గుర్తించిన దంపతులు వారికి గతంలో జరిగిన అన్ని గొడవలను మర్చిపోయి కేసులను విరమించుకొని కలిసి బతకడానికి నిర్ణయించుకున్నారు. తమ కుటుంబ జీవితాన్ని నిలబెట్టిన జడ్జి బుధవారం కలిసి వారు కృతజ్ఞతలు తెలిపారు. భార్యాభర్తలు చిన్న చిన్న మనస్పర్థాలను పెద్ద గొడవలుగా మార్చుకొని వివాదాల్లో చిక్కితే జీవితంలో మనశాంతిని, విలువైన సమయం, డబ్బులు కోల్పోతారని, సమాజంలో గౌరవం లేకుండా పోతుందని ఈ సందర్భంగా జడ్జి సూచించారు. దేశానికి మూలమైన కుటుంబ వ్యవస్థ బాగుండాలంటే కుటుంబ తగాదాలకు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు.



## కూలర్ వైరు తగిలి చిన్నారి మృతి

**రేగొండ, అక్టోబర్ 29(జనం సాక్షి):** మండలంలోని ఆర్జీ తండా గ్రామంలో ఇంట్లో ఉన్న ఎయిర్ కూలర్ వైరు తగిలి బుధవారం ఓ చిన్నారి మృతి చెందింది. గ్రామానికి చెందిన బానోతు వీరు ప్రియాంకల కూతురు అంజలి (3) ఇంట్లో ఉన్న కూలర్ వైరు ఒకటి కరెంటు బోర్డులో ఒకటి కిందపడి ఉండడంతో ఆడుకుంటూ వెళ్లి ముట్టుకుంది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో చిన్నారి విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మధ్యాహ్న భోజన సాంబార్‌లో బల్లి

- ప్రమాదమేమీ లేదని చెప్పిన వైద్యులు



**బచ్చన్నపేట అక్టోబర్ 29 (జనంసాక్షి) :** బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో పిల్లలంతా మధ్యాహ్న భోజనం చేశారు. మద్యాహ్నం వంట చేసే వాళ్ళు సాంబర్ పాత్రాను తోమడాని తీసుకెళ్లగా వంట పాత్ర అడుగుభాగాన బల్లి కాలు కనబడడంతో సాంబారు పాత్రల్లో బల్లి ఉన్నదని పాఠశాల హెడ్మాస్టర్ కు చెప్పడంతో హెడ్మాస్టర్ ఎంఈవోకి పోన్ చేశారు. ఎంఈవో కలెక్టర్‌కు సమాచారం ఇవ్వగా స్పందించిన కలెక్టర్ వెంటనే పాఠశాలకు వైద్యశాఖను రెవెన్యూ శాఖను పంచాయతీరాజ్ శాఖ ను విద్యాశాఖ అధికారులను పాఠశాలకు వెళ్ళమని ఆదేశించడంతో జిల్లా వైద్య అధికారి. బచ్చన్నపేట దావకాన సూపర్డెంట్ . స్థానిక ఎమ్మార్వో ఏఎన్ఎంలు. ఆశాలు పాఠశాలకు వెళ్లి విద్యార్థిని విద్యార్థులకు వైద్యం నిర్వహించారు సింటమ్స్ కనబడ్డన విద్యార్థులకు ట్రీట్మెంట్ అందించి మెడిసిన్ ఇచ్చారు ఎవరికీ ఏ సమస్యా లేదని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తపరిచారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 అక్టోబర్ 2025

## నేలమర్రికి నిలిచిపోయిన రాకపోకలు



**మునగాల, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** మోంథా తుఫాను కారణంగా మంగళవారం మధ్యాహ్నం నుండి మండల పరిధిలోని నేలమర్రికి పూర్తిగా రాకపోకలు స్తంభించిపోయాయి. భారీ వర్షం కారణంగా నేలమర్రికి చుట్టూ ఉన్న వాగులు పొంగి ప్రవహించటంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా వీస్తున్న గాలులకు కొన్నిచోట్ల చెట్లు పడిపోవటం, కరెంటు స్తంభాలు వంగిపోవడంతో మంగళవారం కరెంటు కూడా వస్తూపోతుండడంతో ప్రజలు కాస్త ఇబ్బంది పడ్డారు.

## మోంథా తుఫానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**చౌటుప్పల్, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** మొంథా తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. పట్టణం కేంద్రంలోని ఊర చెరువును బుధవారం సందర్శించారు. చెరువు ప్రస్తుత నీటి మట్టాన్ని, అలుగు పరిస్థితిని పరిశీలించారు. అనంతరం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నాయకులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ గుత్తా వెంకటరాంరెడ్డి, ఇరిగేషన్ ఈఈ మనోహర్, డీఈ రాజవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ మీరా బాయి,మాజీ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగుదాల రమేష్ గౌడ్,సీఐ మన్మథ కుమార్, ఆర్ఐలు బాణాల రాము రెడ్డి,సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి ముందు చూపు..

- గతంలోనే తేల్చి చెప్పిన జనం సాక్షి
- విద్యార్థులకు రక్షణేది..?
- ప్రహరీ లేని గురుకుల పాఠశాల..అనే కథనం ప్రచురించిన జనం సాక్షి..

**దేవరకొండ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** భవిష్యత్తులో జరగబోయే పరిణామాలను ఊహించి, వాటిని విశ్లేషించి జనం సాక్షి ముందుగానే కథనం ప్రచురించింది. నల్గొండ జిల్లా దేవరకొండ మండలం కొమ్మే పల్లి గురుకుల పాఠశాలకు ప్రహరి గోడ లేకపోవడం విద్యార్థులకు ఇది ఎప్పటికీ ప్రమాదమే అని, విద్యార్థుల సౌలభ్యం కొరకు వెంటనే ప్రహరీ కూడా నిర్మించాలని కోరుతూ విద్యార్థులకు రక్షణేది శీర్షికతో జులై 20,2024 నాడు జనం సాక్షి వార్త ప్రచురించింది. తాజాగా బుధవారం మొంథా తుఫాన్ కారణంగా కొమ్మేపల్లి గ్రామంలో ఎస్టి బాలుర గురుకుల పాఠశాలలో నీరు చేరి 500 మంది విద్యార్థులు అవస్థలు పడడం, విషయం తెలుసుకున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పీ శరత్చంద్ర, స్థానిక ఏఎస్పీ మౌనిక, అధికార యంత్రాంగంతో వెంటనే



ప్రత్యక్షంగా ఘటన స్థలానికి చేరుకొని రెస్క్యు చేసి తాడు సాయంతో విద్యార్థులను సురక్షితంగా, ప్రత్యేక వాహనాల్లో దగ్గర్లో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్ కు తరలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కొమ్మేపల్లి ఎస్టి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, లోతట్టు ప్రాంతంలో ఉండడం వంటి కారణాల వల్ల హాస్టల్లోకి నీరు ప్రవేశించిందని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ప్రహరీ


జనంసాక్షి
విద్యార్థులకు రక్షణేది..?
ప్రహరీ లేని గురుకుల పాఠశాల
లోపలికి వచ్చేస్తున్న మూగజీవాలు
విద్యార్థుల చదువుకు ఆటంకం



గోడ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** దేవరకొండ డివిజన్‌లో భారీ వర్షాలతో డివిజన్ మొత్తంలో 12 సెంటీమీటర్ల వర్షం కురవడం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక అధికారులను అప్రమత్తం చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం దేవరకొండ డివిజన్‌లో లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బైపాస్ వద్ద ప్రధాన రహదారిపై నుండి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వర్షపు నీరు ఉధృతాన్ని గమనించి స్థానిక అధికారులతో కలిసి జెసీబి సహాయంతో నీళ్ల ఉధృతి రోడ్డు మీకు రాకుండా పక్కనుండి నీళ్లు వెళ్లిపోయేటట్లు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తక్షణమే వర్షపు నీటిని మళ్లించి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డిఓ రమణారెడ్డి, తహసిల్దార్ నరేందర్, ఎంపిడిఓ సుధీర్ కుమార్, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, ఆర్ఐ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

## క"నీటి"లో కస్తూర్బా గాంధీ విద్యాలయం..!



**పి.ఏ.పల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం మెంథా తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షానికి పాఠశాల క్రీడా ప్రాంగణం పూర్తిగా నీటిలో మునిగిపోయింది.దీంతో పాఠశాల విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.స్థానిక నాయకులు ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోగా పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు చొరవ తీసుకొని జేసీబీ సహాయంతో కొంత పహరీ గోడను కూలగొట్టి వర్షపు నీటిని కొంత బయటకు పంపే ప్రయత్నం చేశారు. అదేవిధంగా డ్రైనేజీ సౌకర్యం కల్పించి శాశ్వత పరిష్కారం చూపాలని ఉపాధ్యాయులు, విద్యార్థినిలు కోరుతున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి,తహసిల్దార్ జయశ్రీ,నాయబ్ తహసిల్దార్ రవిశంకర్,జూనియర్ అసిస్టెంట్ రమేష్, పోలీస్ శాఖ సిబ్బంది లింగయ్య,జయేందర్ రెడ్డి,కేజీబీవీ సిబ్బంది,స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

# నిండుకుండలా దేవరకొండ కోర్టు

- అవస్థలు పడుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది
- వెంటనే నూతన భవన నిర్మాణం చేపట్టాలి



**దేవరకొండ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** దేవరకొండ ప్రజలకు న్యాయ సేవలందించే న్యాయస్థాన భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మొన్థా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బుధవారం కోర్టు ఆవరణలో భారీగా వర్షంపు నీరు నిలిచి రహదారులన్నీ నీట మునిగాయి. తాజాగా కురుస్తున్న వర్షాలకు కోర్టు హాల్లో నీరు కారి ముఖ్యమైన పత్రాలు అన్ని తడిసి ముద్దవుతున్నాయి. ముఖ్యమైన పత్రాలు ఎక్కడ తడుస్తాయో అని కోర్టు సిబ్బంది విధులు నిర్వహించాలంటే భయపడుతున్నారు. బుధవారం భారీ వరద సమయంలో కోర్టు నిండుకుండలా మారిన కూడా సీనియర్ సివిల్ జడ్జ్, మండల న్యాయ సేవా అధికారి సంస్థ ఛైర్మన్ కే. అనిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కెవిఎస్ హరీష్ బాబు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది విధులకు హాజరయ్యారు. నిత్యం చిన్నపాటి గదులలో కోర్టు హాల్ ఏర్పరచుకొని కోర్టు సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా భవనం శిథిలావస్థ చేరడంతో పెచ్చులు ఊడడం, వర్షపు నీరు గదులలోకి రావడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. వర్షపు నీరు హాల్లోకి రావడం, ఇరుకైన గదులలో మూడు న్యాయస్థానాలు ఉండడంతో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కార్యాలయంలో పని చేసే సిబ్బంది, కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోర్ట్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, నూతన భవన నిర్మాణం చేపట్టి సమస్యలను పరిష్కరించాలని న్యాయవాదులు, సిబ్బంది కోరుతున్నారు.

# విరాహత్ అలీపై అసత్య ప్రచారం మానుకోవాలి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతున్న టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మీద కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అట్టి దుష్ప్రచారాన్ని వెంటనే మానుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు సీనియర్ పాత్రికేయులు కొండ కింది మాధవరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడే విరాహత్ అలీ పట్ల అసత్య ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఇటీవల జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడిన సందర్భంలో పరుశ పదాజాలం లేకున్నా కొందరు కావాలని పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని వారు మండిపడ్డారు.జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడే సీనియర్ జర్నలిస్ట్ విరాహత్ అలీపై దుష్ప్రచారం, తప్పుడు విమర్శలు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా విరాహత్ అలీ ఎంతో మంది జర్నలిస్టులకు అండగా నిలిచి దశబ్దాల కాలంగా కలం యోధుల సంక్షేమం కోసం పోరాడుతుంటే కొంత మంది ఉద్దేశ్య పూర్వకంగా అసత్య ప్రచారం చేయటం మంచి పద్ధతి కాదని అన్నారు.జర్నలిస్టుల సమస్యలతో పాటు అనేక ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిబద్ధతతో పని చేస్తున్న విరాహత్ అలీపై ఇప్పటికైనా దుష్ప్రచారం చేయడం మానుకోవాలని వారు సూచించారు.

## రైతులను నిండా ముంచిన ముంథా తుఫాను

- నీట మునిగిన పత్తి



**చంద్రుగొండ, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** అటు తిరిగి ఇటు తిరిగి మంతా తుఫాను తెలంగాణ వైపు తన దిశను మార్చుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైపు రావడంతో చంద్రుగొండ మండలంలో గత రాత్రి నుండి ఎడతెరిపి వాన కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. చేతికొచ్చే పత్తి కాస్త నీట మునిగింది. నేడో రేపో పత్తి తీత తీసి అమ్ముకుందామనుకున్న రైతులకు మెంత తుఫాను ప్రభావం మండలం పై చూపింది అది కాస్త పత్తి రైతులను నిండా ముంచింది. పత్తి చేలలో నీరు పాడుతుండగా పత్తి కాస్త తడిసి రైతులకు తీరని నష్టం వాటిల్ల చేసింది. నెలపొడుపున వర్షాలతో రైతన్నలకు కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్న వర్షాలు మెంతా తుఫాన్ తో మరింతగా దిగాలకు గురయ్యారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

## మెంథా తుఫాన్ ప్రభావంతో రైతన్నలు విలవిల



**హుజూర్‌నగర్, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** మెంథా తుఫాన్ ప్రభావంతో పంట చేతికొచ్చే సమయానికి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు హుజూర్‌నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా అనేక మండలాల్లో వందల ఎకరాల్లో వరిపైరు నేలకొరిగి పంట నీట మునిగింది. వరి పొట్ట దశలో ధాన్యం తయారు కాబోతున్న తరుణంలో ఈ వర్షాలతో వరి పంట నేల కొరిగి నీట మునిగిందని పలువురు రైతులు వాపోతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గల చెరువులు, బావులు, వాగులు, వంకలు అన్ని నీటితో నిండి ఏ క్షణాన్నైనా కట్టలు తెంచుకునే ప్రమాదాన్ని పొంచి ఉన్నాయి. దీంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో పెరిగిన గాలుల తీవ్రత పెరిగింది. ఈ భారీ వర్షాలతో వరి పంటలు నేలకొరిగి నీట మునగడంతో రైతులకు అపార నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని రైతులు వేడుకుంటున్నారు.

## ఎస్ఐ అజ్మీరా రమేష్ ధైర్యసాహసాలకు సెల్యూట్



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** పోలీసులు అంటేనే కొంతమంది అదో విధంగా భావిస్తారు కానీ శాంతి భద్రతల పర్యవేక్షణలో బిజీ జీవితాలను గడుపుతూ సమాజంలో పోలీసులు పాత్ర చాలా ముఖ్యమైనది ఒకవైపు తమ కుటుంబాన్ని చూసుకుంటూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారు. అక్రమాలపై ఉక్కుపాదం మోపుతూ రాత్రి పగలు అనక సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టి శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. ఖాకీలంటే కఠినమైన మనసే కాదు, మంచి మనస్సు కూడా కలిగిన వారమని నిరూపించిన కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీర రమేష్. కొండమల్లేపల్లి మండలంలో భారీ వర్షాలు సైతం లెక్కచేయకుండా ప్రజల శ్రేయస్సు కోసం గత రెండు రోజుల నుండి గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారులతో పాటు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొండమల్లేపల్లి పట్టణంతో పాటు, గౌరుకుంట తండా, బాపూజీ నగర్, ఉప్పవాగు, దోనియాల, చిన్న అడిశర్లపల్లి తదితర గ్రామాలలో భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజలకు మూగ జీవాలకు ఇబ్బందులు తలెత్తకుండా తన సాహసోపేత నిర్ణయాలతో ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఇబ్బందులు రాకుండా భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను తాను తడుస్తూ దగ్గర ఉండి తగు సూచనలు చేస్తూ భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను దోనియాల చెరువులోకి మళ్ళించి భారీ ప్రమాదం నుండి ప్రజలను కాపాడారు. ఇలాంటి ముందుచూపు ప్రజల భద్రతపై ప్రత్యేక చొరవ చూపిన రియల్ హీరోగా ఎస్ఐ అజ్మీరా రమేష్‌ను ప్రజలు కీర్తిస్తున్నారు.

## బైపాస్ రోడ్ రాపర్తి సెంటర్ వరదను అరికట్టండి



ఖమ్మం, అక్టోబర్ 29 (జనం సాక్షి) : ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం, రమణగుట్ట తదితర ఏరియాల నుంచి వరద నీళ్ళు వచ్చి బైపాస్ రోడ్ రాపర్తి సెంటర్ చెరువుగా మారుతుంది అని వెంటనే నిధులు కేటాయించి భారీ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి మున్నేరులోకి ఆ వరద ప్రవాహాన్ని పంపాలని సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై విక్రమ్ డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం భారీ చెరువు లెక్క వున్న బైపాస్ రోడ్ రాపర్తి ప్రాంతాన్ని బృందం పరశీలన చేసింది. ఈ సందర్భంగా డివిజన్ సెక్రటరీ వై విక్రమ్ మాట్లాడుతూ నగరం బైపాస్ రోడ్ ఇరువైపులా వ్యాపార రంగం పెరగటం, నివాసాలు పెరుగుతున్నా వాటికి తగ్గట్టుగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు అని విమర్శించారు. నగరానికి పై భాగంలో శ్రీ శ్రీ విగ్రహం ఏరియా వుండటం వరద వెంటనే పైనుంచి వచ్చి దిగువ భాగాన వున్న బైపాస్ రోడ్ రాపర్తి ప్రాంతానికి వరద నీళ్ళు వచ్చి చెరువులా తయారు అయిందని పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా బూరహన్ పురం ప్రాంతం అంతా చిన్న వర్షానికే జలమయం అవుతుంది అని ఆరోపించారు. కమిషనర్, మేయర్ ఈ సమస్యపై శాస్త్రీయంగా పరిశీలన చేసి తగన నిధులు కేటాయించి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం అంతా ప్రజలు తీవ్ర ఆందోళన పడుతుంటారు అని సమస్య కు పరిష్కారం చేయకపోతే బైపాస్ రోడ్ దిగ్బంధం చేస్తాం అని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జబ్బర్, మీరా సాహిబ్, బోడపట్ల సుదర్శన్, జె వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

## డీసీఎం వ్యాన్ అంజనాపురం వద్ద నిమ్మవాగులో గల్లంతు



**అశ్వరావుపేట, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పరిధిలోని అంజనాపురం గ్రామం సమీపంలో మంగళవారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, పల్లిపాడు గ్రామం నుండి ఏనుకూరు వైపు వెళ్తున్న ఖాళీ డీసీఎం వాహనం అంజనాపురం వద్ద ఉన్న నిమ్మవాగు దాటే ప్రయత్నంలో వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

## కన్నీరు మిగిల్చిన మొంథా తుఫాన్



**మేళ్లచెరువు, అక్టోబర్ 29 (జనం సాక్షి) :** హుజూర్నగర్ నియోజకవర్గ వ్యాప్తంగా మేళ్లచెరువు చింతలపాలెం, మఠంపల్లి, మండలాలలోమొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షానికి, భారీగా వరిపంట పత్తి మిరప నేలపాలు కావడం జరిగింది పొలాలు మొత్తం పంటలు నేలకొరిగినాయి. ఆరుకాలలపాటు కష్టపడి పండించిన పంట తీర చేతికి వచ్చే సమయానికి,ఇలా నేలపాలు కావడంతో, రైతులుకన్నీరుపెట్టుకుంటున్నారుతమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు కోరుకుంటున్నారు.

# జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** మొంథా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో కురుస్తున్న వర్షాలపై ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున బుధవారం జిల్లాలోని పాఠశాలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని చెప్పారు. జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తే తాత్కాలికంగా వాహనాల రాకపోకలు మూసివేయడం జరిగిందని అన్నారునదులు, చెరువులు, కాలువల వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు,రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అటువైపు వెళ్ళకుండా చూడడం జరుగుతుందని తెలిపారు.ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ సిబ్బందితో ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వారిని అప్రమత్తం చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల సహాయార్థం కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అక్కడ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజల నుండి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి తక్షణమే సహాయక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌లో




అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎస్డిఆర్ఎఫ్ బృందం అందుబాటులో ఉందని అత్యవసర సమయంలో వెంటనే స్పందించుటకు జిల్లా అధికార యంత్రాంగం సిద్దంగా ఉందని తెలిపారు.




# ఏడాది పాటు 'చాట్‌జీపీటీ గో' ఉచితం




**న్యూఢిల్లీ:**క్వెరీలు, ఇమేజ్ జనరేషన్ పరిమితులు కొంత తక్కువగా ఉండే 'చాట్‌జీపీటీ గో'ను భారత్‌లోని యూజర్లకు ఏడాదిపాటు ఉచితంగా అందించనున్నట్లు ఓపెన్‌ఏఐ ప్రకటించింది. నవంబర్ 4 నుంచి పరిమితం కాలం పాటు నిర్వహించే ప్రమోషనల్ క్యాంపెయిన్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఈ ఆఫర్‌ను పొందవచ్చని పేర్కొంది.భారత్‌లో తొలిసారిగా బెంగళూరులో నవంబర్ 4న డెవ్‌డే ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఈ సందర్భంగానే ఉచిత ఆఫర్‌ను అందిస్తున్నామని కంపెనీ తెలిపింది. ప్రస్తుతమున్న సబ్‌స్క్రైబర్స్ అందరికీ కూడా ఏడాది ఉచిత ఆఫర్ వర్తిస్తుందని పేర్కొంది. కాస్త అందుబాటు స్థాయి చార్జీలతో అడ్వాన్స్‌డ్ ఫీచర్లను అందించాలన్న యూజర్ల డిమాండ్ మేరకు చాట్‌జీపీటీ గోని ఓపెన్‌ఏఐ ఈ ఏడాది ఆగస్టులో భారత్‌లో ఆవిష్కరించింది.

# మెటల్ షేర్ల మెరుపులు..

## లాభాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలతో సూచీలు రాణించాయి. భారత్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం ఖరారు కానుందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలూ పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమయ్యాయి. ముఖ్యంగా మెటల్, ప్రైవేట్ బ్యాంకింగ్, ఎనర్జీ, ఫార్మా రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ ఇంట్రాడేలో 85 వేల మార్కు దాటగా.. నిఫ్టీ 26 వేల ఎగువన ముగిసింది.సెన్సెక్స్ ఉదయం 84,663.68 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,628.16) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 85,105.83 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 368.97 పాయింట్ల లాభంతో 84,997.13 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117.70 పాయింట్ల లాభంతో 26,053..90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.21గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్ ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, ఎటెర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64.48 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు మళ్లీ 4 వేల డాలర్ల ఎగువకు చేరింది. ప్రస్తుతం 4027 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 5.70
వరంగల్ ₹ 5.72

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్
₹ 1,12,200 (22 క్యారెట్లు)
₹ 1,22,400 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్
₹ 1,66,000

# తీర ప్రాంత వాణిజ్యానికి 'మొంథా'తో ముప్పే

**మొంథా ధాటికి తీరప్రాంతంలో లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. బలమైన గాలులు, వర్షాల కారణంగా రోడ్డు, రైలు మార్గాలు దెబ్బతినడం, వంతెనలు కొట్టుకుపోవడం వంటివి జరిగి రవాణా వ్యవస్థ స్తంభిస్తుంది. ముఖ్యంగా ఓడరేవుల కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోవడం వల్ల సరుకుల రవాణాకు (లాజిస్టిక్స్) తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.**



**అమరావతి:**మొంథా తుపాను కారణంగా విశాఖపట్నం (వైజాగ్) పోర్ట్, మచిలీపట్నం, కాకినాడ పోర్ట్‌ల్లో షిప్పింగ్, లాజిస్టిక్స్ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ ప్రభావం చాలా స్పష్టంగా ఉంటుంది. తుపాను తీవ్రతను బట్టి పోర్ట్ కార్యకలాపాలు మూడు ప్రధాన అంశాలలో ప్రభావితమవుతాయి.

**పోర్ట్ కార్యకలాపాల నిలిపివేత**

తీవ్ర తుపాను హెచ్చరికల నేపథ్యంలో నష్టం జరగకుండా పోర్ట్ అధికారులు తక్షణమే అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తారు. బంగాళాఖాతంలో అలలు తీవ్రంగా ఎగసిపడుతుండటం (2 మీటర్ల ఎత్తు), బలమైన గాలుల కారణంగా నౌకల రాకపోకలు పూర్తిగా రద్దు చేస్తారు. పోర్టులో ఉన్న నౌకలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం లేదా లంగరు వేసి నిలిపేస్తారు.

**కార్గో నిలిపివేత:**కంటైనర్లు, బల్క్ కార్గో, ఇతర సరుకులను ఎగుమతి/దిగుమతి చేసే ప్రక్రియలు పూర్తిగా నిలిచి పోతాయి. కాకినాడ పోర్ట్ ఎక్కువగా బల్క్ కార్గో (ముడిసరుకు, వ్యవసాయ ఉత్పత్తులు)ను హ్యాండిల్ చేస్తుంది కాబట్టి, సరుకు పాడయ్యే ప్రమాదం ఉంది.పోర్టులలోని భారీ క్రేన్‌లు, కన్వేయర్ బెల్ట్‌లు, ఇతర కార్గో హ్యాండ్లింగ్ పరికరాలు తీవ్రమైన గాలులు, ఉప్పెన వల్ల దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

**సప్లై-చెయిన్ అంతరాయం:**పోర్ట్ గేట్లు మూసివేయడం, రోడ్డు రవాణా దెబ్బతినడం వల్ల పూర్తి లాజిస్టిక్స్ సరఫరా గొలుసు దెబ్బతింటుంది. తుపాను ప్రభావంతో రోడ్లు, రైలు మార్గాలు దెబ్బతినడం లేదా వరదలకు గురికావడం వల్ల పోర్ట్ నుంచి లోతట్టు ప్రాంతాలకు, లోతట్టు ప్రాంతాల నుంచి పోర్ట్‌లకు సరుకుల రవాణా పూర్తిగా ఆగిపోతుంది. దీనివల్ల ఎగుమతి చేసేందుకు సరుకు పోర్టుకు చేరదు, దిగుమతి సరుకు బయటకు వెళ్లదు.

**స్టోరేజ్ సమస్యలు:**

పోర్ట్ టెర్మినల్స్‌లో లేదా చుట్టుపక్కల నిల్వ ఉన్న కంటైనర్లు, వ్యవసాయ ఉత్పత్తులు (మచిలీపట్నం, కాకినాడ పోర్ట్‌లలో) నీటిలో మునిగి లేదా గాలులకు పడిపోయి నష్టపోతాయి. దీనివల్ల సరుకు యజమానులకు భారీ నష్టం వాటిల్లుతుంది. పోర్ట్ కార్యకలాపాలు సాధారణ స్థితికి రావడానికి, రవాణా మార్గాలను పునరుద్ధరించడానికి కొన్ని రోజులు పట్టవచ్చు. దీనివల్ల సరఫరా గొలుసులో ఆలస్యం ఏర్పడి, పరిశ్రమలకు ముడిసరుకు కొరత ఏర్పడవచ్చు.

**ఆర్థిక, దీర్ఘకాలిక ప్రభావాలు**

పోర్ట్ కార్యకలాపాల నిలిపివేత వల్ల ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావాలు ఉంటాయి. ప్రతి పోర్ట్‌లో రోజువారీ కార్యకలాపాల విలువ కోట్లాది రూపాయల్లో ఉంటుంది. ఈ కార్యకలాపాలు నిలిచిపోవడం వల్ల ఆయా పోర్ట్‌లకు, కస్టమ్స్ రెవెన్యూకు భారీ నష్టం వాటిల్లుతుంది. తుపాను వల్ల దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను (డాక్స్, జెట్టీలు, రోడ్లు), క్రేన్‌లను మరమ్మతు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుంది. పోర్ట్ టెర్మినల్స్, నౌకలు, సరుకుపై (కార్గో) నష్ట పరిహారం కోసం భారీగా బీమా క్లెయిమ్‌లు పెరుగుతాయి.

**మౌలిక సదుపాయాలు:**

మొంథా తుపాను వల్ల భారీ గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, టవర్లు, టెలిఫోన్ లైన్లు కూలిపోయి కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతింటుంది. తాగునీటి సరఫరా వ్యవస్థలు కలుషితం కావచ్చు. పారిశ్రామిక భవనాలు, గిడ్డంగులకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వీటితోపాటు తీర ప్రాంతంలోని వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ద్వారా రాకపోకలు సాగిస్తున్న అంతర్జాతీయ, దేశీయ విమాన ప్రయాణాల్లో ఇబ్బందులు ఎదురవ్వొచ్చు. కోస్తా జిల్లాల్లోని మత్స్య పరిశ్రమ, నౌకాశ్రయ ఆధారిత పరిశ్రమలు, వ్యవసాయ రంగం భారీ నష్టంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేని పరిస్థితి వల్ల ఉపాధి కోల్పోతారు.

**గత తుపానుల ప్రభావం ఇలా..:**గతంలో వచ్చిన తిత్లీ వంటి తీవ్ర తుపానులు తీర ప్రాంతంలో పెను విధ్వంసం సృష్టించాయి. ఆ సమయంలో ఇళ్లు, పశువులు, పెంపుడు జంతువులు, పంటలకు భారీగా నష్టం జరిగింది. సముద్రపు నీరు లోతట్టు ప్రాంతాల్లోకి రావడం వల్ల వ్యవసాయ భూములు దీర్ఘకాలికంగా పంటలు పండించడానికి పనికిరాకుండా పోయాయి. కొన్ని రోజుల పాటు విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా నిలిచిపోయాయి.

**తుపాను నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలు**

ప్రస్తుత మొంథా తుపాను తీవ్రతను తగ్గించడానికి ప్రభుత్వం తక్షణ సహాయ చర్యలు చేపట్టాలి. తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలి. నిత్యావసర సరుకులు, తాగునీరు, మందులు సిద్ధంగా ఉంచాలి. వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు రియల్‌టైమ్‌లో తెలియజేయాలి. విద్యుత్ అంతరాయం కలగకుండా మొబైల్ టవర్ల వద్ద పవర్ బ్యాకప్(జనరేటర్లు) ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి. రైతుల కోసం టార్పాలిన్లు సిద్ధం చేయాలి.

**తక్షణ, సహాయ చర్యలు:**విద్యుత్ సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. బృందాలను రంగంలోకి దించి సహాయక చర్యలను వేగవంతం చేయాలి.

# 'కోట్లు కుమ్మరించినా చుక్కా వర్షం కురవలేదు'

## ఢిల్లీలో క్లౌడ్‌సీడింగ్ విఫలం



**ఢిల్లీ:** ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్‌కు బ్రేక్ పడింది. కాలుష్య రాజధానిగా మారిన ఢిల్లీలో వాయు కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలని రేఖా గుప్తా సారథ్యంలోని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ఫెయిల్ అయ్యింది.మేఘాలను చల్లబరిచి వర్షింపజేసే రసాయనాలను చల్లే విమానాలను రంగంలోకి దింపింది. ఐఐటీ-కాన్పూర్ సహకారం, సమన్వయంతో మంగళవారం రాజధానిలో మేఘావృత గగనతలంలో మేఘమథన క్రతువుకు శ్రీకారం చుట్టింది. మరికొన్ని రోజుల పాటు ఈ విమానాలు రసాయనాలను వెదజల్లే ప్రక్రియ కొనసాగుతుందని కూడా ప్రభుత్వం వెల్లడించింది. అయితే, మేఘాల్లో తగినంత తేమ లేకపోవడంతో వర్షం కురవలేదు. దీంతో ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది.ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. వర్షించని మేఘాల నుంచి చినుకులు కురిసేలా చేసే ఈ ప్రక్రియను సాధారణంగా క్లౌడ్-సీడింగ్ అంటారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.3.21 కోట్లు కేటాయించింది. అయితే, ఇది వాయు కాలుష్యానికి తాత్కాలిక ఉపశమనంగా పనిచేస్తుందని, ఖరీదైన ఈ ప్రక్రియను శాశ్వత పరిష్కారంగా భావించకూడదని పలువురు పర్యావరణవేత్తలు అంటున్నారు.ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మనీంద్ర అగర్వాల్ ఇవాళ(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. క్లౌడ్ సీడింగ్ ప్రయోగం ద్వారా కృత్రిమ వర్షం రాలేదు కానీ భవిష్యత్తు ప్రయత్నాలకు ముఖ్యమైన సమాచారం లభించిందని తెలిపారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన 15 మానిటరింగ్ స్టేషన్ల ద్వారా సేకరించిన డేటా ప్రకారం, 10 మలినాల స్థాయిల్లో 6-10 శాతం తగ్గుదల కనిపించిందని ఆయన చెప్పారు.కాగా, ఢిల్లీ స్థానిక ప్రాంతాలను కృత్రిమ వర్షాలతో తడిసి ముద్దచేసేందుకు ప్రత్యేక విమానాలు మంగళవారం(అక్టోబర్ 28) కాన్పూర్ నుంచి బయల్దేరాయి. ఢిల్లీలోని బురారీ, నార్త్ కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాల మీది మేఘాలపై ఈ విమానాలు సిల్వర్ అయో డైడ్, సోడియం క్లోరైడ్ మిశ్రమాలను చల్లాయి. దాదాపు 20 శాతం తేమ ఉన్న మేఘాలను కృత్రిమ వర్షాల కోసం ఎంపిక చేశారు. సెస్నా రకం విమానం ఒక్కోటి 2-2.5 కేజీల బరువైన రసాయన మిశ్రమాన్ని వేర్వేరు చోట్ల వెదజల్లింది. దాదాపు 8 ప్రాంతాల్లో క్లౌడ్-సీడింగ్‌ను చేపట్టారు.




# మరింత మంది మావోయిస్టులు లొంగుబాటు

**సుక్మా(బీజాపూర్):** మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. వరుస లొంగుబాటు చర్యల్లో భాగంగా తాజాగా భారీ సంఖ్యలో మావోయిస్టులు బుధవారం లొంగిపోయారు.బీజాపూర్ జిల్లాలో 51 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో 9 మంది మహిళలు కూడా ఉన్నారు. అయితే కాంకేర్ జిల్లాలో 21 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దాంతో ఈరోజు 72 మంది మావోయిస్టులు లొంగిపోయారు.గత కొన్నిరోజులుగా మావోయిస్టుల లొంగుబాటు పరంపర కొనసాగుతోంది. మావోయిస్టు కీలక నేతల దగ్గర్నుంచీ కింది స్థాయిలో పని చేసే వరకూ చూస్తూ ప్రతీ రోజూ లొంగిపోతూనే ఉన్నారు. నిన్న( మంగళవారం, అక్టోబర్ 28వ తేదీ) పుల్లూరు ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న, బండి ప్రకాష్‌లు లొంగిపోయారు. తెలంగాణ ఎస్ఐబీ (ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో) చేపట్టిన కీలక ఆపరేషన్‌లో ఈ ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు.ఆ పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్, తక్కళ్ళపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్నలు కొన్ని రోజుల క్రితం లొంగిపోయారు. మావోయిస్టు పార్టీలో కీలక నేతలుగా ఉన్న వీరు లొంగిపోయిన తర్వాత వందల సంఖ్యలో మావోయిస్టులు సైతం వారి వారిప్రాంతాల్లో పోలీసుల ఎదుట లొంగిపోతూ వస్తున్నారు. కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్ సక్సెస్ కావడంతో మావోయిస్టులు తమ ఆయుధాల్ని వీడి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారు.కాగా, దండకారణ్యంలో పరిస్థితులు తమకు అనుకూలంగా మారాయనే నమ్మకం రాగానే 2024 జనవరిలో ఆపరేషన్ కగార్ మొదలైంది. దళాల కదలికలపై మానవ, సాంకేతిక నిఘాతో కచ్చితమైన దాడులు చేయడం మొదలైంది. అప్పటి నుంచి ప్రతీ ఎన్‌కౌంటర్ మావోయిస్టులకు భారీ నష్టం చేస్తూ వచ్చింది. చివరకు ఆ పార్టీలో ఓ వర్గం సాయుధ పోరాటానికి సెలవు ప్రకటించి లొంగుబాటుకు సిద్ధం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలన్నీ మావోయిస్టులకు అనుకూలంగా లేకపోవడంతో వారు లొంగిపోక తప్పడం లేదనేది అంగీకరించాల్సిన విషయం.

# కుమారుడిని చంపి ఆత్మహత్య చేసుకున్న ఆడిటర్

**చెన్నై:** ఆడిటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి స్టాక్ మార్కెట్లో తీవ్ర నష్టాలు చవిచూడటంతో మనస్తాపం చెంది భార్య గొంతుకోసి, కుమారుని గొంతు నులిమి ఆ తర్వాత రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.భార్య పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడుకు చెందిన నవీనఖన్నా (42) అన్నానగర్ లోని ఓ ఫ్లాట్లో ఉంటున్నాడు. తేనాంపేటలోని సెంట్రల్ కంప్ట్రోల్టర్, ఆడిటర్ జనరల్ కార్యాలయంలో ఆడిటర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు తల్లి భువనేశ్వరి, భార్య నివేదిత (30), కుమారుడు లావిన్ కన్నన్ (7) ఉన్నారు.నివేదిత పెరంబూరులోని లోకో ఆఫీసులో సూపర్వైజర్ పనిచేస్తున్నారు. సోమవారం నవీన్ బయటకు వెళ్లిన అనంతరం తల్లి భువనేశ్వరికి ఫోన్ చేసి భార్య, కుమారుడు చాలాసేపు నిద్రపోతారని, రాత్రి 11 గంటల వరకు ఇబ్బంది పెట్టొద్దని చెప్పి, ఫోన్ కట్ చేశాడు. అనుమానం వచ్చిన తల్లి బెడ్రూమ్ తలుపు తట్టినా తెరవకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా, లావిన్ కన్నన్ చనిపోయి ఉన్నాడు. మెడ తెగిపోయిన నివేదితకు తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో కీల్పాకం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది.ఈక్రమంలోనే నవీన్ చెన్నైలోని విల్లివాక్కం రైల్వేస్టేషన్ సమీపంలో ఎక్స్ ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. అయితే తాను పనిచేసే కార్యాలయంలో మాజీ సైనికోద్యోగులకు ఇవ్వాల్సిన కోట్లాది రూపాయల సొమ్మును దుర్వినియోగం చేసి, ఆ డబ్బును షేర్ మార్కెట్లో పెట్టినట్టు విచారణలో వెల్లడైంది. నష్టాలు రావడంతో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. మొదట తన బిడ్డ గొంతు నులిమి చంపి, ఆపై కత్తితో భార్య గొంతు కోసినట్టు పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సంరక్షణ.. సమస్యగా మారిన వేళ




**న్యూఢిల్లీ:**భూ అయస్కాంత క్షేత్రం. రోదసీ నుంచి వేల కిలోమీటర్ల వేగంతో మనవైపు దూసుకొచ్చే సూక్ష్మస్థాయి గ్రహశకలాలను మరింత వేగంగా లాగేసుకుని భూ వాతావరణంలో మండిపోయేలా చేసి వాటిని నాశనంచేసే అత్యంత శక్తివంతమైన వ్యవస్థగా భూ అయాస్కాంత క్షేత్రానికి పేరుంది.అంతరిక్ష ప్రమాదాల నుంచి భూమిని, పరోక్షంగా మానవాళిని కాపాడుతున్న రక్షణ ఛత్రమది. వాస్తవానికి ఈ అయస్కాంత క్షేత్రం మన కంటికి కనిపించదు.అదృశ్యంగా ఉంటూ అందర్నీ కాపాడే ఇదే అయస్కాంత క్షేత్రం ఇప్పుడు చాలా చాలా నెమ్మదిగా ప్రమాదకారిగా పరిణమిస్తోందని భౌతికశాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. యురోపియన్ స్పేస్ ఏజెన్సీ వారి 'స్వార్మ్'కృత్రిమ ఉపగ్రహ కూటమి సేకరించిన డేటాను శాస్త్రవేత్తలు సమగ్రస్థాయిలో పరిశీలించారు. దీంతో భూ అయస్కాంత క్షేత్రం దక్షిణ అట్లాంటిక్ సముద్రంపై బలహీనపడుతోందని స్పష్టమైంది. 2014 ఏడాది నుంచి చూస్తే గత 11 ఏళ్లలో అక్కడ ఏకంగా యురప్ ఖండమంత పరిమాణంలో అయస్కాంత క్షేత్రం బలహీనపడిందని తేలింది.అంటే కృత్రిమ ఉపగ్రహాలు తమ కక్షలో తిరుగుతూనే ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించినప్పుడు వాటికి అయాస్కాంత క్షేత్ర రక్షణ బాగా తగ్గిపోతుంది. అంటే అంతరిక్ష నుంచి వెలువడే రేడియోధార్మికత అనేది నేరుగా ఉపగ్రహాలపై పడుతుంది. దాంతో శాటిలైట్‌లోని భాగాలు వేడెక్కి, బాగా దెబ్బతింటాయి. వాటి సామర్థ్యం సైతం క్షీణిస్తుంది. అప్పటికే అవి సేకరించిన డేటా సైతం నాశనంకావచ్చు. శాటిలైట్లు పనికిరాకుండా పోయే ప్రమాదముంది. దీంతో శాటిలైట్లతో భూమికి అనుసంధానం తెగిపోవచ్చు. విశాలమైన రహదారి కింద పేద్ద డ్రైనేజీ కాలువ, అందులో వేగంగా మురుకు ప్రవహిస్తోందనకుందాం. ఆ మురుగు మనకు కనిపించకపోయినా కొన్ని మ్యాన్‌హోల్‌ల వద్ద వాసన ముక్కుపుటాలను అదరగొడుతుంది. అచ్చం అలాగే మన భూమిలోపల అంటే 3,000 కిలోమీటర్ల లోతులో మొత్తం భూమి అంతటా ద్రవరూప ఇనుము ప్రవహిస్తోంది. అయస్కాంతానికి ఇనుము అతుక్కున్నట్లే భూమి లోపలి ఈ ఇనుముకు సంబంధించిన అయాస్కాంత క్షేత్రం బయట గాలి ఆవరణలో పరుచుకుంది. ఈ అయస్కాంత క్షేత్రం దక్షిణ అట్లాంటిక్ సముద్ర ప్రాంతంలో క్షీణిస్తోంది. దీనినే సౌత్ అట్లాంటిక్ అనామలీ(ఎస్ఏఏ)గా పేర్కొంటారు.19వ శతాబ్దంలో దక్షిణ అమెరికాలోని ఆగ్నేయ దిశలో దీనిని తొలిసారిగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ఆఫ్రికా ఖండం దిశగా క్షీణిస్తూ వస్తోంది. భూమి ద్రవరూప బయటి పొరకు, శిలాద్రవం ఉన్న పొరకు మధ్య వైవిధ్యాల కారణంగా అయస్కాంత క్షేత్రం ఈ ప్రాంతంలో క్షీణిస్తోందని స్పష్టమైంది. సైబీరియా వద్ద అయస్కాంత క్షేత్రం బలంగా, కెనడా సమీపంలో బలహీనంగా మారుతోంది. ఉత్తర ధృవ అయస్కాంత క్షేత్ర నాభి నెమ్మదిగా సైబీరియా వైపునకు మారుతుండటమే ఈ మార్పులకు కారణం. రక్షణాత్మక క్షేత్రానికి ఏ స్థాయిలో బీటలు పడుతున్నాయని ఎప్పటికప్పుడు విశ్లేషించడం ద్వారా కృత్రిమ ఉపగ్రహాలను, వాటిపై ఆధారపడిన పౌర, సైనిక సేవల పునరుద్ధరణ చర్యలను చేపట్టవచ్చు.

# కాల్పుల విరమణ ఉల్లంఘన

సదుపాయాలు ధ్వంసమయ్యాయి.అయితే, గాజాలో ఇజ్రాయెల్ సైనికుడి మరణానికి తాము కారణం కాదని హమాస్ స్పష్టం చేసింది. కాల్పుల విరమణకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడులు కాల్పుల విరమణ ఉల్లంఘనేనని స్పష్టం చేసింది. దీనిపై ఇజ్రాయెల్ దీటుగా స్పందించింది. తమ సైనికుల వైపు వేలెత్తి చూపుతే చెయ్యి తీసేస్తామని హెచ్చరించింది. అయితే, కాల్పుల విరమణ మళ్లీ అమల్లోకి వచ్చినట్లు తాజాగా తెలిపింది. ఈ వ్యవహారంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచారు. సైన్యంపై దాడులు చేస్తే ఎదురుదాడి చేయొచ్చని అన్నారు. అయినప్పటికీ గాజాలో శాంతిని ఎవరూ అస్థిరపర్చలేరని చెప్పారు. ఇజ్రాయెల్ చేపట్టిన తాజా దాడుల్లో 104 మంది ప్రాణాలు కోల్పోగా, వీరిలో అనేక మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. మరో 250 మంది గాయపడినట్లు అంచనా. అయితే, కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో ఇప్పటివరకు పలువురు పాలస్తీనీయన్లు చనిపోయారని, సుమారు 600 మంది గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ ఆరోపించింది. మొత్తంగా ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన వారిసంఖ్య 68,643కు చేరుకుందని, లక్షా 70 మంది గాయపడినట్లు వెల్లడించింది.

# ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలి

**లేకపోతే మాఉద్యమాలతో రాష్ట్రాన్ని రణరంగంగా మార్చుతాం**

**మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్ లో పోలీసుల నిర్బంధాల మధ్య బిఆర్ఎస్వీ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడికి భారీగా విద్యార్థులు తరలి వచ్చారు. సుమారు 2000 మంది విద్యార్థులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ముందు విద్యార్థులు వారికి రావలసిన పెండింగ్ లో ఉన్న ఫీస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ గర్జించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ గ్రంథాలయం సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...విద్యార్థులకు రావలసిన పెండింగ్ లో ఉన్న ఫీస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక తుగ్లక్ పాలన నడుస్తుందని విద్యాశాఖని సీఎం తన దగ్గరనే పెట్టుకుని ఎలాంటి రివ్యూ లు లేకుండా ఎవరు ఏది ప్రశ్నించినా స్పందించకుండా నియంత పాలన కొనసాగిస్తున్నాడని తెలంగాణ రాష్ట్రం లోని విద్యార్థులు పట్ల ఈ ప్రభుత్వం మొండి వైఖరి నశించాలన్నారు. సీఎం ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థుల కొరకై పోరాటంలో బిఆర్ఎస్వి ముందుండి అన్ని విద్యార్థి సంఘాలను కలుపుకుని సీఎం కన్ను తెరిచి బుద్ధి తెచ్చుకునే వరకు రాష్ట్రాన్ని రణరంగం చేసి వెంబడిస్తామని హెచ్చరించారు. కరీంనగర్ లో ఎక్కడా లేని విధానంగా పోలీస్లు విద్యార్థులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారని, కళాశాలల యాజమాన్యాలను బెదిరించారని కానీ నిర్బంధాలనన్నింటినీ తెంచుకుని ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. పోలీసుల లాటిలు, తూటాలు విద్యార్తుల ఉద్యమాలకు అడ్డు కాలేవని నిరూపించారని తెలిపారు. ఇది ఆరంభం మాత్రమే అని ఇక నుండి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం బాగుపడలేదని ఇప్పుడు ఈ ప్రభుత్వం విద్యార్థుల ఆర్తనాదాలతో చెలగాటం ఆడుతోందని వారి ఉద్యమ పోరాటం ఒక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందని ఇప్పుడు ప్రభుత్వం స్పందించక పోతే ఈ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పిటిసి కి తరలించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, బిఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ ధ్యావ మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, బండారపు అజయ్ కుమార్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ ఇంచార్జ్ చుక్కా శ్రీనివాస్, నగర అధ్యక్షులు బొంకూరి మోహన్, శాతవాహన జాక్ నేత చెన్నమల్ల చైతన్య, ఆరే రవి గౌడ్, నియోజక వర్గ యూత్ అధ్యక్షులు గంగాధర చందు, నారదాసు వసంత్, వడ్లకొండ పరుశురామ్, జిల్లాలోని బిఆర్ ఎస్వీ, బిఆర్ఎస్వై నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డువరికి దోమపోటు.. రైతన్న అలర్ట్

- సన్నవరకే కాదు దొడ్డువరికి దోమపోటు వ్యాపించడంతో రైతన్నల్లో ఆందోళన..
- పంట పొలాలను నిత్యం పరిశీలించాలంటున్న ఆదర్శ రైతులు
- దిగుబడిపై ప్రభావం రైతన్న దిగాలు



చిగురుమామిడి అక్టోబర్29 (జనంసాక్షి): మొంథా తుఫాన్ అన్నదాతను అతలాకుతలం చేస్తుంటే, దోమపోటు రైతన్నను ఆందోళనకు గురిచేస్తుంది. చేతికి వచ్చింది అనుకున్న వరి పంటకు వాతా వరణం చల్లగా ఉండడంతో ఊహించని విధంగా వారికి దోమపోటు వ్యాప్తిస్తుంది. గతంలో సన్నవరకే దోమపోటు వచ్చే పరిస్థితులు ఉన్నప్పటికీ తాజాగా దొడ్డు వరిలో సైతం దోమపోటు విజృంభి స్తుంది. వరుస వర్షాలతో కోయాల్సిన వరి పంట పొలాల్లో నీళ్లు ఉండడంతో, పొలాలు పచ్చిగా ఉండడంతో రైతులు కాస్త వెనక్కి తగ్గారు. అయితే పంట పొలాల్లోకి వెళ్లిన రైతులకు దోమపోటు వచ్చిన గమనించిన గంటలలోపే చేనంత వ్యాప్తిస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సుడిదోమ విషయంలో రైతులు అజాగ్రత్తగా ఉంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆదర్శ రైతులు చెబుతున్నారు. చూస్తుండగానే వరిగింజలు నల్లబడిపోయి పొలంమంత ఎండిపోయినట్లు, నేలకు పడిపోయి కనిపిస్తుంది. వర్షాలు విపరీతంగా కొట్టడం, వాతావరణం చల్లగా ఉండటం వల్ల, కోతకు వచ్చిన పొలంలో నీరు ఎక్కువగా ఉండటం, యూరియాను ఎక్కువగా వినియోగించడం వల్ల, పంటకు గాలి సోకకపోవడం వల్ల సుడి దోమ విజృంభిస్తుందని రైతులు చెబుతున్నారు. రైతులు అజాగ్రత్తగా ఉండకుండా ప్రతిరోజు పొలాల చుట్టూ తిరిగి పంటను పరిశీలించుకోవాలని, దోమపోటు ఉన్నట్లయితే వరిలో పాయలు తీస్తే దోమపూటను నివారించవచ్చని రైతులు చెబుతున్నారు.

# అధికారం కోసం ఎన్నేళ్లైనా ఆశ చూపతనే ఉంటరు?

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- కాంగ్రెస్ పార్టీ నుంచి బిఆర్ఎస్‌లోకి చేరికలు



మంథని, (జనంసాక్షి) : ప్రజలకు హామీల ఆశలు చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పాలకులు ఇంకా ఎన్నేళ్లయినా గవే ఆశలు చూపుతారే తప్ప ఏ ఒక్కటి నెరవేర్చరని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని పట్టణంలోని రాజగృహాలో బుధవారం మల్హర్ మండలం అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసర్ల రాజయ్య, మాజీ సైనికుడు భనోత్ రాజు కుమార్ (డిల్లీ రాజు), లావుడ్య రాణా సింగ్, ఇంజపూరి కుమార్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ ధరంసోత్ లక్ష్మణ్ నాయక్, నాంసాని కుమార్ యాదవ్, లావుడ్య రాజు, తోట్ల సమ్మయ్య, జంగ పెద్ద అయిలయ్య, తోట్ల ఓదెలు, భనోత్ సింగనాయక్, లావుడ్య తిరుపతి, గుగులోత్ చిన్న రాజు, లావుడ్య రవీందర్, గుగులోత్ రాజేష్, లావుడ్య శ్రీధర్, లావుడ్య తరుణ్, భూక్య రాజేష్, లావుడ్య సతీష్, లావుడ్య నరేష్, తొట్ల కుమార్ యాదవ్, బానోత్ తిరుపతి, లావుడ్య శ్రీనివాస్, సజ్జల శ్రీకాంత్, సజ్జల గణేష్, బూడిది రమేష్, అజ్మీరా శివాజీ, గుగులోతు ప్రశాంత్, భూక్యా శ్రీనివాస్, గుగులోత్ దేవేందర్ తో పాటు పెద్ద ఎత్తున సుమారు వంద మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన గ్రామశాఖ, యూత్ కాంగ్రెస్, సీనియర్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**రొంపికుంట పంచాయతీ కార్యదర్శి ను విధుల నుంచి తొలగింపు**

**మంథని, (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సంబంధించి ఎటువంటి అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. బుధవారం కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామం జూనియర్ పంచాయతీ కార్యదర్శి ఎం. తిరుపతి విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. వారధి సొసైటీ ఔట్ సోర్సింగ్ విధానం ద్వారా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామానికి జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎం.తిరుపతి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదా రుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల పై విచారణ చేసిన కలెక్టర్, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో వెంటనే సంబంధిత ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సేవలను టర్మినేట్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తుందని, ఈ పథకం అమలులో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా అత్యంత కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు.



## ముదిరాజ్ మహాసభ కమిటీ సభ్యులతో ఈటెల రాజేందర్ భేటీ..

**ముదిరాజుల రాజకీయ చైతన్యం కోసం కృషి చెయలని పిలుపు**

**గీకురు రవీందర్ ను అభినందించిన ఈటెల**

**చిగురుమామిడి/అక్టోబర్ 29(జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా తెలంగాణ ముదిరాజ్ మహాసభ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు బుధవారం మాజీ మంత్రివర్యులు, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ ముది రాజు మహాసభ జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్ తో పాటు కార్యవర్గ సభ్యులందరికి శాలువా సన్మానం చేసి వారికి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ముదిరాజ్ సమాజం తెలంగాణ ఉద్యమంలో తమ తెగువను చూపారని, రాష్ట్ర సామాజికాభివృద్ధిలోనూ విశేష పాత్ర పోషించించారని పేర్కొన్నారు. అధిక జనాభ ఉండి కూడా తగిన రాజకీయ ప్రాతినిద్యం లేకపోవడం బాధాకరమని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ నాయకులు సమిష్టిగా, సమన్వయముతో పనిచేయాలని తెలంగాణ సమాజానికి ప్రాతి నిధ్యం వహించాలని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే పూర్తిస్థాయి జిల్లా మరియు మండల కమిటీని ప్రకటిస్తామని జిల్లా అధ్యక్షుడు గీకురు రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ఈ బేటీలో జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు గీకురు రవీందర్ ముదిరాజ్‌తో పాటు ప్రధాన కార్యదర్శి పండుగ నాగరాజు ముదిరాజ్, గౌరవాధ్యక్షుడు కోలకాని నరసయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు బండారి నరేందర్ ముదిరాజ్, జెట్టి బాలయ్య ముదిరాజ్, అధ్యయన వేదిక కమిటీ అధ్యక్షుడు బండారి భూమేష్ ముదిరాజ్, యువత అధ్యక్షుడు రెడ్డి సురేష్ ముదిరాజ్, కోశాధికారి గుంటుక శంకర్ ముదిరాజ్, జిల్లా కార్యదర్శి కుంభ మల్లయ్య, ముద్రవేణి కుమార స్వామి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# కుట్టు శిక్షణ .. భవితకు నిచ్చనా..

**ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికేట్ల ను ప్రదానం చేసిన హెల్త్ ఫౌండేషన్ చైర్మన్**

**హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.నరేందర్ రావు**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** బుదవారం రోజు డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళల కోసం నిర్వహించిన ఉచిత "కుట్టు శిక్షణా కార్యక్రమం" విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన రెండు బ్యాచ్‌లలో మొత్తం 38 మంది మహిళలకు సర్టిఫికేట్ల ప్రదాన కార్యక్రమం కరీంనగర్ ఎన్ఎసి సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డా.బి.ఎన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.బి. నరేందర్ రావు, ఎన్ఎసి జి. రమేష్ అసిస్టెంట్ డైరెక్టర్ తో కలిసి మాట్లాడుతూ... ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళా శక్తిని మరింత ప్రోత్సహించడం మా ప్రధాన లక్ష్యం అని భవిష్యత్తులో ఎన్ఎసి సంస్థతో కలిసి మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్ఎసి అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ... ఈ శిక్షణ ద్వారా మహిళలు సొంతంగా ఉపాధి అవకాశాలు పొందగలగడం ఒక గొప్ప ముందడుగు అని, డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న ఆర్థిక సహకారం ఎంతో ప్రశంసనీయమని ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ ఝాన్సీ, డా. శ్రీనాథ్ చట్ల, డా.ఎం.డి. అలీమ్, గంగ, జి. రమేష్ అసిస్టెంట్ డైరెక్టర్, ఎన్ఎసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "ఒకే ఇంట్లో 2సార్లు దొంగతనం చేసి"

# దొరికిపోయిన దొంగ

- ఆ వ్యక్తి నుండి సుమారు 12 లక్షల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు
- కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్ కుమార్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి రెవెన్యూ కాలనీలో 2025 ఫిబ్రవరి, జూన్ నెలలలో ఒకే ఇంటిలో రెండు సార్లు దొంగతనం జరగగా కరీంనగర్ రూరల్ పిఎస్‌లో కేసు నమోదయింది. కరీం నగర్ సిపి గౌష్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్‌కుమార్ అట్టి దొంగతనంలను చేదించుటకై కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి, సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్‌లకు అప్ప గించగా వారు ఈ కేసును ఛేదించారు. తీగలగుట్టపల్లి లోని రెవెన్యూ కాలనీకి చెందిన మహమ్మద్ ముస్తాక్ తండ్రి అక్బర్ ఇదే సంవత్సరం ఫిబ్రవరి, జూన్‌నెలలో తాళం వేసి ఉన్న ఇండ్లను గుర్తించి తీగల గుట్టపల్లిలోని ఒకే ఇంట్లో రెండుసార్లు కిటికీ గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడి బంగారం, నగదును దొంగతనం చేసినాడు. జూబ్లీ నగర్ లోని దర్గా సమీపంలో గల ఒక ఇంట్లోకి చొరబడి టీవీని దొంగలించి నాడు. బంగారం ఇక్కడ ఎవరూ కొనక పోవడంతో కోదాడ వెళ్లి అక్కడ అమ్మడానికి ప్రయత్నించాడు అక్కడ కూడా ఎవరూ కొననందున తిరిగి తీగలు గుట్టపల్లికి వచ్చి కరీంనగర్‌లో గాని వరంగల్‌లో గాని మంచిర్యాలలో గాని అమ్ముదామని నిర్ణయించుకొని బుధ వారం రోజున తీగల గుట్టపల్లిలోని రైల్వే స్టేషన్ కు వచ్చి బయట నిలబడి ఉండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించు చుండగా కరీంనగర్ రూరల్ సీఐ ఎ. నిరంజన్ రెడ్డి, సిబ్బంది పట్టు కొని అతని వద్ద దొంగలించబడిన సొమ్ము సుమారు 91 గ్రాముల బంగారం, 5 వేల రూపాయల నగదు, ఒక సెల్ ఫోను పోలీసులు స్వాధీనపరచుకొని పిఎస్‌కు తిరిగి వచ్చి తదుపరి చర్య నిమిత్తం రిమాండ్‌కు తరలించారు. ఇట్టి దొంగతనంలో కేసుల్లోని నేరస్తుడైన మహమ్మద్ ముస్తాక్‌ను పట్టుకున్న కరీంనగర్ రూరల్ సీఐ ఎ.నిరంజన్ రెడ్డి, సిసిఎస్ సిఐ ప్రకాష్ గౌడ్‌ను, ఎస్సై లక్ష్మారెడ్డి, సిసిఎస్ హెచ్‌సి ఎండి హసనోద్దీన్ పిసి, ఎన్.శేఖర్ పిసి, ఎండి ఖలీ ఫా, రూరల్ హెచ్సి శ్రీరాములు పిసి, సల్మాన్‌లను సిపి గౌష్ ఆలం, ఏసిపి విజయ్ కుమార్‌లు అభినందించి సిబ్బందికి నగదు రివార్డును అందజేశారు.

## 40మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

**చిగురుమామిడి అక్టోబర్29 (జనంసాక్షి):** పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రైతు వేదికలో తహశీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన కల్యాణ లక్ష్మి పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంత రం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహశీల్దార్ తాడ స్వరూప రాణి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓరుగంటి భారతి దేవి, నాయకులు చిట్టుమల్ల రవీందర్, ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, బోయిని వేణుగోపాల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్, పూదరి వేణుగోపాల్ గౌడ్, ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, తేలు వెంకన్న, వంగ కనకయ్య, మండల ప్రధాన కార్యదర్శి పూల లచ్చిరెడ్డి, గోగురి మురారి రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీ మూర్తి రమేష్, సీనియర్ నాయకుడు గజ్జెల రాములు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి : జిల్లా కలెక్టర్






**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 29 (జనం సాక్షి) :** ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ హిందూస్తాన్ యూనిలివర్ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యం లో వ్యవసాయ ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులకు ఆయిల్ పామ్ సాగు పై అవగాహన సదస్సు ను బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎపిసి ఆదేశాల మేరకు ప్రతి వ్యవసాయ ప్రాథమిక సంఘానికి 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం ఇవ్వడం జరిగిందని, ఆయిల్ పామ్ పంట సాగు, నాటడం, చీడపీడల నివారణ చర్యలు, మార్కెటింగ్ గురించి ప్రతీ ఒక్క అంశంపై అవగాహన కలిగి ఉండాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆన్నారు. ఆయిల్ పామ్ సాగు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా మారుతుందని, దీనిని శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టాలని సూచించారు.

అలాగే, ఈ రంగంలో ప్రభుత్వం, సహకార సంఘాలు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ పంట యొక్క ఆర్థిక ప్రాధాన్యత, సాగు పద్ధతులు, నీటి వినియోగం, వాతావరణ అనుకూలత, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, మార్కెట్ అవకాశాలపై సంబంధిత అధికారులు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ మోహన్ రెడ్డి, జిల్లా కోపరేటివ్ అధికారి రామ్మోహన్, పిఎసిఎస్ కార్యదర్శులు, వ్యవసాయ మరియు వ్యవసాయ విస్తరణ అధికా రులు, ఉద్యాన, విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ ప్రతినిధులు, డ్రిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి

# అధిక మొత్తంలో కేంద్ర నిధులు

- 15వేల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు.. అంగన్వాడీ టీచర్లకు ఉచితంగా ట్యాబ్స్
- పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు .. మంజూరైన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, దిశ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్.




**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో అత్యధికంగా కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గానికి కేంద్ర నిధులు తీసుకువ చ్చామని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, జిల్లా అభివృద్ధి, కోఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (దిశ) చైర్మన్ బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అభివృద్ధి, కోఆర్డినేషన్, మానిటరింగ్ కమిటీ (దిశ)సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ చైర్మన్, కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేయించి పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని తెలిపారు. రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని వెల్లడించారు. 851 కోట్ల రూపాయల ఎంపీ నిధులను కరీంనగర్ అభివృద్ధికి కేటాయించామని అన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఆధునిక సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో హుజురాబాద్, హుస్నాబాద్, జమ్మికుంట, సిరిసిల్ల ఆసుపత్రులకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయిస్తున్నామని, అందుకు తగిన విధంగా సిబ్బందిని వైద్యులను నియమించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు 15వేల సైకిళ్లు ఉచితంగా అందజేశామని మరో 5 వేల సైకిల్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ తగ్గాయని అన్నారు. పీఎం నిధులను ఇతర కార్యక్రమా లకు మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీ నిధుల ద్వారా మంజూరైన పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. గన్నేరువరం బ్రిడ్జి, కేంద్రం సేతు బంధన్ పథకం ద్వారా మంజూరు చేసిన కరీంనగర్ ఆర్ఓబి నిర్మాణం తదితర పనులన్నీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రానున్న నాలుగు సంవత్సరాల కాలానికి సరిపడా మందుల ఇండెంట్ తనకు సమర్పించాలని, నిధులు సమకూరుస్తానని వెల్లడించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలోని అంగన్వాడీ టీచర్లకు రోజువారి నివేదికల సమర్పించేందుకు ఉచితంగా ట్యాబ్ అందజేస్తామని తెలిపారు. సోలార్ పవర్ వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలను గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు.


ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ మల్కా కొమరయ్య మాట్లాడుతూ, పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. తన క్షేత్రస్థాయి పర్యటనలో అనేక పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని వెల్లడించారు.

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో కేంద్రం అనేక నిధులు వెచ్చించి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిరిసిల్ల ఇన్చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో రెండువర్గాల మధ్య వార్

## ఒకరిపై మరొకరు ఫిర్యాదులు

- కేసులు సైతం నమోదు
- కాల్ డేటా సీడీఆర్ తీస్తున్నారని ఆరోపణ
- జడ్చర్ల నియోజకవర్గంలో రచ్చకెక్కిన విభేదాలు




మహబూబ్ నగర్ (జనంసాక్షి) : సాక్షాత్తు ముఖ్యమంత్రి జిల్లా జడ్చర్ల నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు రచ్చకెక్కయి. ఏకంగా ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసుకోవడంతోపాటు కేసులు కూడా నమోదవుతున్నాయి. ఒక వర్గం పై మరో వర్గం మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మరి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుం టున్న దుస్థితి నెలకొంది. మహబూబ్ నగర్ జిల్లా నవాబ్ పేట మండలం పోమాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ధారా భాస్కర్ పై తాజాగా నవాబ్ పేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. శ్రీనివాసులు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ధారా భాస్కర్ అనే వ్యక్తి జనంపల్లి అనిరుద్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యేపై, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వారి పరువుకు భంగం కలిగించే విధంగా మాట్లాడాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే ధారా భాస్కర్ మాత్రం తెలంగాణ డిజిపికి ఫిర్యాదు చేశారు. తన ఫోన్ కాల్ డేటా, సిడిఆర్, అక్రమంగా తీసుకొని తనకు సంబంధించిన వ్యక్తిగత విషయాలు తెలుసుకుంటున్నారని, తన హక్కుకు భంగం కలిగిస్తున్నారని, తనకు అనుమానంగా ఉందని ఫిర్యాదు చేశారు.

**ప్లాట్లు, భూముల విషయంలో జోక్యం**

జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సొంత అన్న దుశాంత్ రెడ్డి నవాబ్ పేట మండలంలో ప్లాట్లు భూముల విషయంలో జోక్యం చేసుకొని రైతులకు అన్యాయం చేస్తున్నాడని ధారా భాస్కర్ ఆరోపించారు. రైతులు తనను ఆశ్రయించడంతో రైతుల తరఫున రైతులకు న్యాయం చేయడం కోసం వారికి అండగా ఉన్నానని, దాన్ని దృష్టిలో పెట్టుకొని తనతో పాటు మరికొందరు కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని పేర్కొన్నాడు. దీనిపై న్యాయపరంగా పోరాడడంతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి అక్రమ కేసుల గురించి తీసుకెళ్తానని తెలిపారు. ఈ మధ్యకాలంలోనే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్న దుశాంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం గమనార్హం.

# మొంథా తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తుఫాన్ ప్రభావంపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్



మర్రిగూడ, అక్టోబర్ 28 (జనం సాక్షి) : మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ వారి వారి కార్య స్థానాల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశిం చారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బుధవారం ఆమె మొంథా తుఫాన్ ప్రభావంపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు .ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎవరు సాధ్యమైనంత వరకు ఇళ్లనుండి బయటకు రావద్దని అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని చెప్పారు.రైతులు పొలం పనుల నిమిత్తం పోలాలకు వెళ్ళవద్దని అలాగే పంట కోతలు చేయవద్దని, పొలాలకు వెళ్లిన సమయంలో వాన నీటిలో పాముకాటు గురయ్యే అవకా శం ఉందని అలాగే పిడుగుపాటు ఇతర ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటన్నిటి నుండి సురక్షితంగా ఉండేందుకు ఇళ్లలో ఉండాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వర్షం వల్ల తడిసి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండకుండా మున్సి పల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అలాంటి ఇండ్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.వర్షాల నేపథ్యంలో పాఠశాలలకు, అంగన్వాడీలకు సెలవు ప్రకటించడం జరిగిందని, అయినప్పటికీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు,, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కడగకుండా సంబంధిత ఆర్సివోలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా పాఠశాలల్లో పారిశుధ్య,ఆరోగ్య సమస్యలు, విద్యుత్ ప్రమాదాలు,ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులు పశువులను పొలాల్లోకి వదల వద్దని, అలా వెళ్లడం వల్ల పిడుగు పాటుకు పశువులు చనిపోయే ఆస్కారం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలుప్రత్యేకించి యువత వాగులు, వంకలు, నదుల వద్దకు ఈత కొట్టేందుకు,బట్టలు ఉతికేందుకు, చేపలు పట్టేందుకు ఎవరు వెళ్ళ వద్దని, అలాగే లోతట్టు కాజ్ వేలు, పొంగి ప్రవహించే బ్రిడ్జిలు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని దాన్యం, పత్తి కోతలు చేయవద్దని రైతులను కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం ,పత్తి పంటలు తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని అన్నారు. ఎక్కడైనా రహదారులు దెబ్బ తిన్న ,కోతకు గురైన, తెగిపోయిన, గుంతలు పడిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఎక్కడైనా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడే వైర్లు ఉంటే సరిచేయాలని, ఎవరు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ డివిజన్లో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనందున ఈ ప్రాంతంలోని మారుమూల, గిరిజన తండాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడి క్షేత్రస్థాయి సిబ్బంది క్షేత్ర స్థాయిలోనే అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. మొంథ తుఫాన్ కారణంగా భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలు వర్షానికి సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 180042 51442కు తెలియజేయాలని ఆమె కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, భారీ వర్షాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

# పసిపాపల అక్రమ అమ్మకం.. ఏడుగురు అరెస్ట్




- మొదటి కేసు: 10 రోజుల బిడ్డకు రూ.2.30 లక్షలు
- రెండో కేసు: 21 రోజుల బాబుకు రూ.4.5 లక్షల ఒప్పందం
- పోలీసుల సత్వర ఆపరేషన్.. 24 గంటల్లోనే నిందితులు రిమాండ్
- ఎస్పీ హెచ్చరిక: చట్టవ్యతిరేక దత్తతలపై కఠిన చర్యలు

నల్గొండ, అక్టోబర్ 29 (జనంసాక్షి) : నల్గొండ జిల్లాలో మానవత్వాన్ని దిగ్భ్రాంతి పరిచే రెండు ఘోరాలు వెలుగులోకి వచ్చాయి. పసిపాపలను డబ్బు కోసం అక్రమంగా అమ్మడం, కొనడం, దత్తత పేరుతో చట్టాన్ని తుంగలో తొక్కిన ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఓ మహిళా వైద్యురాలు, ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఉండటం కలకలం రేపింది. 10 రోజుల పాప, 21 రోజుల బాబును సురక్షితంగా రక్షించి శిశు గృహానికి పంపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ (ఐపీఎస్) పర్యవేక్షణలో నల్గొండ వన్ టౌన్, టూ టౌన్ పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు సమన్వయంతో 24 గంటల వ్యవధిలోనే నిందితులను గుప్పెట్లో పడేశారు. మొదటి కేసు (క్రైం నం.313/2025, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్)లో సాగర్ మండలం ఎల్లాపురం కుర్ర బాబు (ఏ1) భార్య పార్వతికి పుంజుకున్న ఆడబిడ్డను పోషించడం కష్టమని భావించి హాలియా నిర్మల ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ శాంతిప్రియ (ఏ4)కు చెప్పాడు. ఆమె మధ్యవర్తిగా వ్యవహరించి ఏలూరు దంపతులు కదలి సాంబమూర్తి, రజిత (ఏ2, ఏ3)లకు రూ.2.30 లక్షలకు పాపను అక్రమ దత్తత ఇచ్చింది. పోలీసులు నలుగుర్నీ అరెస్ట్ చేసి రూ.20 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, దత్తత ఒప్పంద పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

రెండో కేసు (క్రైం నం.389/2025, టూ టౌన్ పోలీస్‌స్టేషన్)లో ఒడిశాకు చెందిన ఒర్సు శ్రీను, మమత (ఏ1, ఏ2) దంపతులు తమ 21 రోజుల మగ బిడ్డను రూ.4.5 లక్షలకు కనగల్ మండలం వేముల నాగరాజు, సువర్ణ (ఏ4, ఏ5) దంపతులకు అమ్మారు. మధ్యవర్తిగా ఒర్సు శ్రీను (ఏ3) పనిచేశాడు. తల్లిదండ్రులు పరారీలో ఉండగా, మిగతా ముగ్గుర్నీ పట్టుకున్నారు. బాబును రెస్క్యూ చేసి శిశు గృహానికి తరలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శివరాం రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, ఎస్సైలు సైదులు, గోపాలరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి నేతృత్వంలోని మూడు ప్రత్యేక బృందాలు దాడులు నిర్వహించాయి. మైనర్ పిల్లల అమ్మకం, కొనుగోలు, దత్తత, మధ్యవర్తిత్వం తీవ్ర నేరాలని, ఇటువంటి సమాచారం అందితే వెంటనే పోలీసులకు లేదా ఐసీడీఎస్ అధికారులకు తెలపాలని, సమాచారదారుల గోప్యత భద్రపరుస్తామని ఎస్పీ శరత్ పవార్ హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐలు రాజశేఖర్ రెడ్డి, రాఘవరావు, డీసీపీవో గణేష్, డబ్ల్యూవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ సరస్వతి తదితరులను ఎస్పీ అభినందించారు.

**ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామానికి చెందిన రాయినేని రాకేష్ (25) పురుగుల మందు తాగి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు.**

# తపాల శాఖ నూతన కార్యాలయం ప్రారంభం

- తపాల సంస్థను కాపాడుకోవాలి: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



పెద్ద కొడప్గల్ అక్టోబర్ 29 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన తపాలా శాఖ కార్యాలయాన్ని బుధ వారం జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతారావు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎస్.ఎస్.పి.ఓ తో కలిసి పెన్షన్, పొదుపు పుస్తకాలను ఖాతాదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతా రావు మాట్లాడుతూ.. బూరుగుపల్లికి కొత్త తపాలా సౌకర్యం రావడం సంతోషదాయకమని, తపాలా శాఖ మనందరి జీవితంలో ఎంతో ప్రముఖమైన స్థానాన్ని సంతరించుకుందని తెలిపారు. నూతన సాంకేతికత పెరగడం వల్ల ఉత్తర ప్రత్యుత్తరాల వ్యవస్థ బాగా తగ్గిందని తెలిపారు. తపాలా శాఖ కూడా అనేక నూతన సేవలను అందిస్తుందన్నారు. తపాల శాఖను కేవలం పెన్షన్ల కోసం మాత్రమే ఉపయోగించుకుంటే సరైన సార్థకత ఉండదని, మనమందరం తపాలా శాఖను కాపాడుకోవాలని సూచించారు. తపాల శాఖలో పొదుపు చేసుకుంటే డబ్బులు సురక్షితంగా ఉండటమే కాకుండా ఇతర బ్యాంకుల కంటే అధికంగా వడ్డీ వస్తుందని అన్నారు. తపాలా శాఖను కాపాడుకోవడానికి గ్రామస్తులందరూ ఖాతాలను తెరిచి చిన్న చిన్న పొదుపులు చేసుకోవాలని సూచించారు. తపాల శాఖ కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తదనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారంతోనే, పట్టుదలతోనే నూతన తపాలా శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పెన్షన్లు, ఉపాధి హామీ డబ్బులు, ఆడపిల్లల కోసం డబ్బులు దాచుకోవడానికి వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. బ్యాంకుకు వెళ్లే అవసరం లేకుండా ఆధార్ సహాయంతో బ్యాంకు సర్వీసులను అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ తపాలా శాఖ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో బీ.ఆర్. అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, ఆర్ఐ అంజయ్య, బోధన్ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ప్రకాష్, మెయిల్ ఓవర్సీస్ రూపేష్, సూర్యకాంత్, పిట్లం సబ్ పోస్ట్ మాస్టర్ లింగొండ, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ లు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మోహన్, శ్యామప్ప, మొగుల గౌడ్, శ్రీహరి పటేల్, నారాయణరావు, పండరి, తదితరులు ఉన్నారు.

# ఏరియా పర్సనల్ అధికారులతో డీజీఎం సమీక్ష



యైటింక్లయిన్ కాలనీ అక్టోబర్ 29 (జనంసాక్షి) : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా పర్సనల్ డిపార్టుమెంటు అధికారులతో డీజీఎం(ప) పీ. అరవింద్‌రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం డీజీఎం చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకువాలని తెలిపారు. అలాగే సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డ్స్, ఉద్యోగి పదవి విరమణ చేసిన రోజునే అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గైర్హాజరు పై నూతనంగా విడుదలైన సర్క్యులర్ గురించి సంక్షేమధికారులకు వివరించారు. అలాగే ఈ సమావేశంలో డిపెండెంట్ ఉద్యోగాలు, కోర్ట్ కేసులు, ఉద్యోగుల ప్రమోషన్స్ మొదలగు అంశాల గురించి అంశాలపై సుదీర్ఘంగా చర్చించా రు. ఈ సమావేశంలో డీవైపీఎంలు నలివెల్లి వేణుగోపాల్, నందికొండ వంశీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎస్. సాధన్, సంక్షేమధికారులు సాయి క్రిష్ణ, అజీజ్, నరేష్ పాల్గొన్నారు.

# సీజేఐపై జరిగిన దాడికి నిరసన... ఎమ్మార్పీఎస్ మహాధర్నా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



నలగొండ,అక్టోబర్ 29 (జనం సాక్షి) : సీజేఐ పై జరిగిన దాడికి నిరసన హైదరాబాద్ లో నవంబర్ 1న మహా ధర్నా కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెప్పుతో దాడి చేస్తే చట్టాలు ఎందుకు మౌనంగా ఉన్నాయన్నారు.దాడికి పాల్పడిన వారికి శిక్షలు ఉండవా కేసు ఎందుకు నమోదు చేయలేదని, సుమోటో గా ఎందుకు తీసుకోలేదని,మానవ హక్కుల సంఘాలు ఏం చేస్తున్నాయని అన్నారు.వారికి చట్టాలు వర్తించవా రాజ్యాంగానికి లోబడి ఏదైనా సమస్య ఉత్పన్నమైతే పరిష్కారం కోసం పని చేద్దాం. ఈ దాడి దేశ పౌరులందరినీ ఆగ్రహానికి గురిచేసిందని చెప్పారు. ఈ దాడిని యావత్ భారతదేశం మొత్తం ఖండించిందన్నారు. సోనియా గాంధీ రాహుల్ గాంధీ మల్లికార్జున కర్గే తో పాటు జాతీయస్థాయి నాయకులు ఈ దాడిని ఖండించారని గుర్తు చేశారు. న్యాయ వ్యవస్థలో చట్టాలకు లోబడి ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ను 2004లో సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, అదే సుప్రీంకోర్టు 2024లో తీర్పు ఇచ్చిందని,సాంకేతిక లోపాలున్న పరిష్కారానికి 20 సంవత్సలు పట్టిన విజయం

సాధించామన్నారు.చీఫ్ జస్టిస్ చేసిన తప్పేంటి అని చీఫ్ జస్టిస్ దళితుడు కాకపోతే ఈ దాడి జరిగేది కాదని ఆయన అన్నారు.చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి న్యాయవ్యవస్థకి మాయని మచ్చ అని రాజ్యాంగంలో ప్రధాన వ్యవస్థల్లో న్యాయవ్యవస్థ ప్రధానమైనదని,రాజ్యాంగంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు.సుప్రీంకోర్టులోనే దాడి జరిగితే దళితులకు ఎక్కడ భద్రత,రక్షణ ఎక్కడని ప్రశ్నించారు.ఈ అనాగరిక చర్యను ఎమ్మార్పీఎస్ తీవ్రంగా ఖండిస్తుందని హెచ్చరించారు. చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా నవంబర్ 1న హైదరాబాద్లో జరిగే మహా ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా.గోవింద్ నరేష్ మాదిగ,ఎమ్మెస్ ఎఫ్ జాతి అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం మాదిగ, ఉద్యోగ సంఘాల నాయకులు మల్లెపాక వెంకన్న సీనియర్ నాయకులు మేడి శంకర్ మాదిగ, కురుమే స్వామి మాదిగ,ఉరపాటి కలమ్మ మాదిగ పూలే యాదయ్య మాదిగ పాల్గొన్నారు

# నిజాంపేటలో పార్కులను కాపాడిన హైడ్రా

- 2600 గజాల పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్
- రూ. 39 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా
- సంబరాలు చేసుకున్న కాలనీవాసులు






నిజాంపేట, అక్టోబరు 29 (జనంసాక్షి) : నిజాంపేట మున్సిపాలిటీలో వేర్వేరు ప్రాంతాల్లో రెండు పార్కులను హైడ్రా బుధవారం కాపాడింది. బృందావన్ కాలనీలో 2300 గజాల పార్కును కాపాడగా.. కౌశల్యా కాలనీ లోని 300ల గజాల పరిధిలోని బనియన్ ట్రీ పార్కును కబ్జాల నుంచి రక్షించింది. 2600ల గజాల స్థలం విలువ రూ.39 కోట్లకుపైగా ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్ర స్థాయిలో విచారించిన అధికారులు పార్కు స్థలాలుగా గుర్తించి బుధవారం ఆక్రమణలను తొలగించింది. దీంతో బృందావన్ కాలనీ నివాసితులు పిల్లా పాపలతో పార్కుకు వచ్చి సంబరాలు చేసుకున్నారు. సర్వే నంబరు 93లో ఉన్న ఈ స్థలాన్ని పార్కు స్థలంగా గతంలోనే నిర్ధారించారు. అయితే సర్వే నంబరు 94కి సంబంధించిన ల్యాండ్‌గా స్థానికంగా పేర్కొంటూ స్థానికంగా ఉన్నవారు కబ్జా చేశారు. ఇప్పటికే వినియోగంలో ఉన్న పార్కు స్థలంలోని పిల్లల ఆటవస్తువులు ధ్వంసం చేసి, పార్కు బోర్డును తొలగించి.. ప్రహరీని కూడా కూల్చేసి కబ్జా చేశారు. బృందావన్ కాలనీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేయగా.. హైడ్రా సంబంధిత స్థానిక అధికారులతో పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించి పార్కు స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కులను కాపాడినట్టు సూచిస్తూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. దీంతో బృందావన్ కాలనీ నివాసితులు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రాను తెచ్చిన ప్రభుత్వానికి, ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పార్కులను కాపాడిన హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు. హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

# మైనార్టీలను మోసం చేసింది బీఆర్ఎస్

- ముస్లింలకు మేలు చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బోరబండలో ప్రచారం
- జోరు వానలోనూ ప్రచారాన్ని కొనసాగించిన సీతక్క



హైదరాబాద్, అక్టోబరు 29 (జనంసాక్షి) : మైనార్టీలను కాంగ్రెస్ మోసం చేసిందంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క గట్టి కౌంటర్ ఇచ్చారు. ముస్లింలకు మేలు చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని స్పష్టం చేశారు. అన్ని మతాలను సమానంగా గౌరవించే సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, దేశ ఏక త్వం, సమానత్వం కోసం ఎప్పుడూ అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. "మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వా లు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నాయి. కేంద్రంలో మైనార్టీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను 2006లో ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీ. మైనార్టీల వెనకబాటు తనాన్ని అధ్యయనం చేయడానికి జస్టిస్ సచ్చార్ కమిటీని ఏర్పాటు చేసి, వారి అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రారంభించింది. తెలంగాణలో ముస్లింలకు నాలు గు శాతం రిజర్వేషన్లు కల్పించింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వ మే. ఆ రిజర్వేషన్ల వల్ల వేలాది మైనార్టీ విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉద్యోగులుగా ఎదిగే అవకాశం పొందారు. ఉన్నత విద్యలో కొనసాగుతున్న విద్యార్థుల కోసం మౌలానా ఆజాద్ స్కాలర్షిప్లను అమలు చేసింది కూడా కాంగ్రెస్" అని పేర్కొన్నారు.

టిఆర్ఎస్ ముస్లింలకు, మైనార్టీలకు చేసినదేమీ లేదని, 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిన పార్టీగా ప్రజలు గుర్తించారని అన్నారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ, అన్ని మతాలకు సమాన గౌరవం ఇచ్చే పార్టీ అని తెలిపారు. బోరబండలో మైనారిటీ నాయకుడు సయ్యద్ సిరాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడిన సీతక్క, టిఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్న వారందరినీ స్వాగతిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితమై సిరాజ్ పార్టీకి చేరడం సంతోషక రమని పేర్కొన్నారు.

"మాకు కులమూ, మతమూ తేడా లేదు. ప్రజలందరి సమగ్రాభివృద్దే మా లక్ష్యం" అని ఆమె స్పష్టం చేశారు. సీతక్క మాట్లాడుతూ, "టిఆర్ఎస్కు పదేళ్ల అధికారం లో ఉన్నా చెప్పుకునే అభివృద్ధి లేదు. మూడు సార్లు టిఆర్ఎస్‌కు అవకాశం ఇచ్చారు, ఒకసారి నవీన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వండి - అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తాం" అని అన్నారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కోరుకునే ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. "ఫామ్ హౌస్‌లు, క్లబ్బులు, పబ్బులు టిఆర్ఎస్‌కే కావాలి. కానీ పేద ప్రజలకు అండదండలు ఇచ్చేది కాంగ్రెస్ మాత్రమే. చేతి గుర్తు కు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించండి" అని పిలుపునిచ్చారు.

# ట్రాఫిక్ ఫ్లో స్మూత్‌గా ఉండేలా చూడాలి

- క్షేత్రస్థాయిలో పర్యటించిన జీహెచ్ఎంసీ కమిషనర్, హైడ్రా కమిషనర్లు
- నగర రహదారులపై నీరు నిల్వకుండా చూడాలంటూ ఆదేశం



హైదరాబాద్, అక్టోబరు 29 (జనంసాక్షి) : "మోంథా" తీవ్ర తుపానుతో గ్రేటర్ హైదరాబాద్ లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లక్డికపూల్ పరిసర ప్రాంతాలను బుధవారం హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్, ఆర్వీ కర్ణన్లు సంయుక్తంగా పరిశీలించారు. మాసబ్ ట్యాంకు నుంచి లక్డికపూల్ వైపు వస్తున్నప్పుడు మెహదీ ఫంక్షన్ హాల్ వద్ద వర్షపు నీరు రోడ్డు మీద నిలవడానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వర్షపు నీరు నిలవడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని.. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఇరువురు కమిషనర్లు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఇక్కడ ఇరువైపులా రోడ్డును తవ్వి రెండు ఫీట్ల విస్తీర్ణంతో ఉన్న పైపులైన్లను వేశామని.. వాటికి మహావీర్ ఆసుపత్రి పరిసరాలతో పాటు చింతలబస్తీ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగు, వరద నీటిని అనుసంధానం చేయాల్సినవసరం ఉందన్నారు. త్వరితగతిన ఈ పనులు కూడా పూర్తి చేయాలని సూచించారు. ఈ లోగా మహావీర్ ఆసుపత్రి ముందు నుంచి మెహిదీ ఫంక్షన్ హాల్ వరకు రోడ్డుకు పక్కగా ఉన్న పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తే.. సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని కమిషనర్లు సూచించారు. ఒకటి రెండు రోజుల్లో ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులు కూడా సహకరించి పైపులైన్ల అనుసంధాన పనులు త్వరగా జరిగేలా సహకరించాలని సూచించారు. లకడికాపూల్ పరిసరాలను సందర్శించిన వారిలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్యగారు, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ కమిషనర్లతో పాటు ఉన్నారు.

# డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో పోలీసుల సాయం





- ప్రయాణికులకు పోలీసు సిబ్బంది మానవతా సహాయం
- అభినందించిన రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి

**మహబూబాబాద్ (జనంసాక్షి) :** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా డోర్నకల్ లో గోల్కొండ ఎక్స్ ప్రెస్, మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైళ్లలో ఉన్న ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ స్పందించి సంబంధిత పోలీసు అధికారులను సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్ రెడ్డి , రూరల్ సీఐ సరవయ్య , డోర్నకల్ సీఐ చంద్రమౌళి మరియు సిబ్బంది, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు రైల్వే స్టేషన్‌కు చేరుకొని రైలులోని ప్రయాణికులకు వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్లు, పులిహోర పొట్లాలు అందజేశారు. రైలు ఆలస్యం అయినప్పటికీ, ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా పోలీసు సిబ్బంది సకాలంలో సహాయం అందించి మానవతా దృక్పథంతో సాయం చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... మహబూబాబాద్ పోలీస్ ఎప్పుడూ ప్రజలతో ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా సహాయం అవసరమైతే ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలకు సేవ చేయడం పోలీసుల ప్రధాన ధ్యేయమని, వర్షం వంటి విపత్తు సమయంలో ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు. మానవతా దృక్పథంతో స్పందించి భారీ వర్షాల్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు సహాయం చేస్తున్న మహబూబాద్ జిల్లా పోలీసులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభినందించారు. ఆపదలో ఆదుకున్న పోలీస్ సిబ్బంది కృషిని ప్రశంసించారు.

# కారు లేకుంటే పిల్లను ఇవ్వలేని పరిస్థితి

- కారు కొనద్దని ఎవరికైనా చెప్పగలమా?
- టన్నెల్ ప్రాజెక్ట్ పై డికె శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్య
- దాంతో సమస్య పరిష్కారం కాదన్న బిజెపి ఎంపి తేజస్వి





**బెంగళూరు, అక్టోబర్29 (జనంసాక్షి) :** సొంతకారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వరంటూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ప్రతిపాదించిన టన్నెల్ రోడ్ ప్రాజెక్టును సమర్థిస్తూ కాంగ్రెస్ నేత ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన మాటలను భాజపా ఎద్దేవా చేసింది. ఈ టన్నెల్ ప్రాజెక్టును రద్దు చేసి, మాస్ ట్రాన్స్‌పోర్ట్‌ను విస్తరించాలని భాజపా ఎంపీ తేజస్వీసూర్య డీకే ను కలిశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజలు కార్లు కొనడం వెనక ఉన్న సామాజిక పరిస్థితి సూర్యకు అర్థం కాదని వ్యాఖ్యానించారు. మీరు సొంత వాహనంలో రాకుండా నేను ఆపగలనా..? ప్రజలు వారి కుటుంబాలతో కలిసి సొంతవాహనాల్లో వెళ్లడానికే మొగ్గుచూపుతారు. వారిని కార్లు వాడొద్దని చెప్పగలమా..? అంతగా అవసరం అనుకుంటే ప్రజా రవాణా వాడుకోమని తమ నియోజకవర్గ ప్రజలకు ఎంపీలు విజ్ఞప్తి చేసుకోవచ్చు. అయితే దానిని ఎంతమంది వింటారో చూడాలి. కారులేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచిస్తున్న పరిస్థితి ఉందని శివకుమార్ మీడియాతో మాట్లాడారు. దీనిపై తేజస్వి స్పందిస్తూ.. బెంగళూరు ట్రాఫిక్ సమస్యను తీర్చడానికి టన్నెల్ రోడ్ ప్రాజెక్టును తీసుకువచ్చారని ఇంతకాలం నేను అపార్థం చేసుకున్నాను. కానీ ఇది ఒక సామాజిక సమస్యను తీర్చడానికి ఉద్దేశించిందని డిప్యూటీ సీఎం స్పష్టత ఇచ్చారు. నేను ఎంత తెలివితక్కువగా ఆలోచించాను‘ అని డీకే వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ఉపముఖ్యమంత్రితో భేటీ సందర్భంగా టన్నెల్ రోడ్ ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయాన్ని, ప్రజారవాణాకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రతిపాదనలు చేశానని వెల్లడించారు. అయితే వాటన్నింటిని ఆయన తిరస్కరించారని చెప్పారు. కర్ణాటక రాజధాని నగరమైన బెంగళూరులో ట్రాఫిక్ సమస్యలను తీర్చేందుకు ఉద్దేశించిన టన్నెల్ రోడ్ ప్రాజెక్టును సమర్థిస్తూ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారంనాడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సొంత కారు లేని అబ్బాయిలకు పిల్లను ఇవ్వడానికి కూడా ప్రజలు ఆలోచించే పరిస్థితి ఉందని అన్నారు. దీనిపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వెంటనే స్పందించారు. రోడ్ ప్రాజెక్టు ఒక సామాజిక సమస్య తీర్చడానికి ఉద్దేశించిన అంశమని ఇంతవరకూ తాను ఆలోచించనే లేదని కౌంటర్ ఇచ్చారు. టన్నెల్ ప్రాజెక్టు రాజధాని ట్రాఫిక్ కష్టాలను తీరుస్తుందని డీకే చెబుతుండగా, ఆ ప్రాజెక్టును రద్దు చేసి ప్రజా రవాణాకు ప్రాధాన్యత ఇవ్వాలంటూ కొన్ని ప్రతిపాదనలను తేజస్వి సూర్య డిప్యూటీ సీఎం ముందుంచారు. డీకేను స్వయంగా ఆయన కలిశారు. అయితే ప్రత్యామ్నాయం అడిగితే సొరంగ మార్గమే వద్దని తేజస్వి చెప్పినందున ఆయన సలహాతో ప్రాజెక్టును ఆపేయలేమని డీకే మీడియా ముందు స్పష్టం చేశారు. ప్రజలు కార్లు కొనడం వెనక సామాజిక పరిస్థితి తేజస్వికి అర్థం కాదన్నారు. ఇవాళ సొంతకారు లేని అబ్బాయిలకు ఆడపిల్లను ఇవ్వడానికి కూడా వెనుకంజ వేస్తున్న పరిస్థితి ఉందని డీకే అన్నారు. డీకే వ్యాఖ్యలపై అంతే వేగంగా తేజస్వి స్పందించారు. బెంగళూరు ట్రాఫిక్ సమస్య తీర్చడానికి రోడ్ ప్రాజెక్ట్ తీసుకువచ్చారని తాను ఇంతకాలం అనుకున్నానని, కానీ ఇది ఒక సామాజిక సమస్యని తీర్చేందుకు ఉద్దేశించినదని డీకే స్పష్టత ఇచ్చారని అన్నారు. తాను చాలా తెలివి తక్కువగా ఆలోచించానంటూ వ్యాఖ్యానించారు. బెంగళూరు ట్రాఫిక్ సమస్యలతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే ఈ ఐటీ రాజధాని కష్టాలకు టన్నెల్ ప్రాజెక్ట్ ఒక మంచి పరిష్కారం అని డీకే ఎప్పటినుంచో చెప్తున్నారు. దానివల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, ప్రజా రవాణా విషయంలో సరైన పరిష్కారం కాదని సూర్య వ్యతిరేకిస్తున్నారు.

# 8వ వేతన సవరణ సంఘంతో గొప్ప నిర్ణయం

- కేబినేట్ నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం



**హైదరాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ దిశగా కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయంపై కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 8వ వేతన సవరణ సంఘం విధివిధానాలను ఆమోదించినందుకు కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన స్పందించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నినాదం ఆధారంగా దేశంలోని ప్రతివర్గం సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కృషికి సరైన గుర్తింపు ఇవ్వడమే కాకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. వేతన సవరణతో ఉద్యోగుల్లో ఉత్సాహం పెరగడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉత్పాదకత పెరిగి ప్రజా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందన్నారు. ఉద్యోగుల ఆర్థిక స్థితి మెరుగుపడటం ద్వారా దేశీయ వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి కూడా ఊతమిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన పేర్కొంటూ మోదీ గారు నాయకత్వం వహించిన తర్వాత 2016లో 7వ వేతన సవరణ కమిషన్ ద్వారా ఉద్యోగులకు అనుకూలమైన సంస్కరణలు తీసుకువచ్చారు. 2006లో జరిగిన 6వ పీఆర్సీలో కనీస వేతనం రూ.7 వేలుగా ఉండగా, 7వ పీఆర్సీలో దాన్ని రెండున్నర రెట్లు పెంచి రూ.18 వేలుగా నిర్ణయించారు. అంతేకాకుండా, కనీసం 3 శాతం ఇంక్రిమెంట్ తప్పనిసరిగా ఇవ్వాలనే నిర్ణయం కూడా మోదీ ప్రభుత్వంలోనే తీసుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు 8వ పీఆర్సీ ద్వారా కేంద్ర ప్రభుత్వం మరిన్ని మార్పులు తీసుకువచ్చిందని, ఈ నిర్ణయం ద్వారా 50 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షలకు పైగా పెన్షనర్లు లబ్ధి పొందనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉద్యోగుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ద్విగుణీకృత ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

# నవీన్ యాదవ్ బెదిరింపులు సహించేది లేదు

- బిఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ హెచ్చరిక




**హైదరాబాద్, అక్టోబర్29 (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ బెదిరింపు వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. నవీన్ యాదవ్ గల్లీ కూడా దాటనియ్యను అంటున్నాడు.. జూబ్లీహిల్స్ నీ అయ్యా జాగీరా? అని నవీన్ యాదవ్‌ను ఆర్ఎస్పీ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. నేను తలచుకుంటే జూబ్లీహిల్స్ దాటనియ్యను అంటున్నాడు నవీన్ యాదవ్. నేను ఓపెన్‌గా అడుగుతున్నా.. జూబ్లీహిల్స్ నీ అయ్యా జాగీరా..? పోలీసులు ఎక్కడ పోయారు. సుమోటో కేసులు ఎందుకు నమోదు చేయడం లేదు. నవీన్ యాదవ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. పోలీసులు నవీన్ యాదవ్‌కు సపోర్టు చేస్తున్నారని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు, అసెంబ్లీకి పోకముందే ఇంత రౌడీయిజం చేస్తున్నారు. వీళ్ల పహిల్వాన్‌లు బస్తీల్లోకి వచ్చి అరాచకం చేస్తారు. ఇక్కడ సీసీ కెమెరాలు పెట్టండి.. గుండాయిజం పెరుగుతుందని ఓ మహిళ ఆందోళన వ్యక్తం చేసింది. కేసీఆర్ అధికారంలో నుంచి పోయినప్పటి నుంచి బస్తీల్లో గుండాయిజం పెరిగిందని ఆమె చెప్పారు. మరి ముఖ్యంగా మహిళలు అభద్రతాభావంతో ఉన్నారు. గుండాగిరి, దౌర్జన్యం పోవాలంటే కారు గుర్తుకు ఓటేయాలి అని ఆర్ఎస్పీ పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ ఓ వ్యక్తికి ఫోన్ చేసి మీ ఇంట్లో గంజాయి పెట్టి ఉల్టా కేసులు నమోదు చేయిస్తామని బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఇలా ధమ్కీలు ఇవ్వడం ఎంత వరకు కరెక్ట్. వీళ్లందరు రేపు మన ఇండ్లలో తిండి కాదు పెట్టేది గంజాయి. కేసీఆర్ అందరికి తిండి పెడితే.. వీళ్లు అందరి ఇంట్లో గంజాయి పెట్టి కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. జూబ్లీహిల్స్ ప్రజలంతా నవంబర్ 11వ తేదీన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు వేచి చూస్తున్నారు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

## ఇద్దరు పిల్లలకు ఉరేసి

# తల్లి ఆత్మహత్య

**బెంగళూరు, అక్టోబర్29 (జనంసాక్షి) :** కర్నాటకలోని కొప్పళ జిల్లాలో ఇద్దరు పిల్లలను హతమార్చి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. కుకనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బెణకల్ గ్రామంలో లక్ష్మి భజంత్రి (30), పిల్లలు రమేశ్ (3), జానవి(2)లను హతమార్చి తర్వాత ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సమస్యలు కారణమై ఉంటాయని భావించారు. అయితే మృతురాలు లక్ష్మి తల్లి బసవ్వ ఆరోపణలతో కొత్త అంశం వెలుగులోకి వచ్చింది. అదే గ్రామానికి చెందిన బీరప్ప అనే వ్యక్తితో లక్ష్మికి వివాహేతరసంబంధం ఏర్పడిందని,అతడి ఒత్తిడిని తట్టుకోలేక కొన్ని నెలలకాలంగా ఇబ్బంది పడుతున్నట్టు ఆరోపించారు. భర్త పిల్లలను వదిలిపెట్టి వచ్చేయాలని, ఇద్దరం కలసి కాపురం చేద్దామని బీరప్ప వేధించాడని అదే మానసికంగా ఇబ్బంది కలిగి లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. తొలుత ఇద్దరి పిల్లలను ఉరి వేసి హతమార్చిన తర్వాత లక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జిల్లా ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ధి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# రఫేల్ యుద్ధవిమానంలో విహరించిన రాష్ట్రపతి

- రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ రాణి శివాంగీ సింగ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత వైమానికి దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేసారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించినట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్ధాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు. సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచీ పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్‌గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగీ.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు. మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్‌బేస్‌లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్‌తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న రెండో పైలట్‌గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

# అవసరమైతే తప్ప బయటకు రావద్దు

- వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయొద్దు
- పంటల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- అధికారులతో సమీక్షించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, అక్టోబర్29 (జనంసాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క సూచించారు. తుపాను ప్రభావంపై మహబూబాబాద్, ములుగు, అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పరిస్థితులు సమీక్షిస్తూ అత్యవసర చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. పలు రైళ్లు నిలిచిపోయినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు.. ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీతక్క దిశానిర్దేశం చేశారు. తుఫాను పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అత్యావసర చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్న మహబూబాబాద్, ములుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంత్రి సీతక్క మాట్లాడారు. తుఫాను కారణంగా అధికారులు చేపట్టిన చర్యలపై మంత్రి సీతక్క తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకి కీలక ఆదేశాలు జారీ చేశారు. చలిగాలులు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. రైతులు పంటల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్గనిర్దేశర చేశారు. పశువుల కాపరులు తమ పశువులని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ప్రజలు వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయొద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం అందుతున్న క్రమంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు వంటి అవసరాలు వెంటనే అందించాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని మంత్రి సీతక్క సూచించారు.

# తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు

- ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు చేసిన వాతావరణ శాఖ
- ప్రజలు వాతావరణ సూచనలు పాటించాలని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్29 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాలకు మరో ముప్పు పొంచి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖహెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు తక్షణ వరద ముప్పు పొంచి ఉందని ఐఎండీ ప్రకటించింది. రాబోయే కొన్ని గంటల్లో ఏపీ,తెలంగాణ, విదర్భా, మరాఠవాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందనిపేర్కొంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని, వరద ప్రభావంతో రహదారులపై నీరు వచ్చి చేరవచ్చని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తీర ప్రాంతమైన యానంతో పాటు గుంటూరు, ప్రకాశం జిల్లాలకు ఈ ముప్పు పొంచి ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్గిరి, పెద్దపల్లి జిల్లాలకు ఈప్రమాదం పొచివుంది. మరాఠవాడా సమీప ప్రాంతాలలైన నాందేడ్, హింగోలి, పర్బణీ. విదర్భా ప్రాంతం కూడా ఫ్లాష్‌ఫ్లడ్ హెచ్చరికలో ఉన్నాయి. బుల్దానా, అకొలా, అమరావతి, వార్ధా, యవత్మాల్, నాగ్పూర్ జిల్లాలకు ఎ÷-లాష్ ఫ్లడ్ హెచ్చికలు జారీ అయ్యాయి. వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొదని.. వాగులు, కాల్వలు, చెరువుల దగ్గర తిరగవద్దని ఐఎండీ హెచ్చరించింది. ప్రయాణం ముందు వాతావరణ సమాచారం తెలుసుకోవాలని సూచించింది. రైతులు పంటలు, పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని.. స్థానిక అధికారులు అత్యవసర సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసర పరిస్థితుల్లో ఆయా జిల్లాల డిజాస్టర్ కంట్రోల్ రూమ్, స్థానిక సహాయ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని సూచనలు చేసింది. ఐఎండీ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నుంచి జారీ అయ్యే తాజా సమాచారం తప్పకుండా పాటించాలని భారత వాతవారణ శాఖ పేర్కొంది.

# ఫీజు బకాయిలను చెల్లించండి: కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబర్ 29 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం త్వరలో బీసీ రథయాత్ర చేపట్టనున్నట్లు తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అమలును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయకపోతే నవంబరు రెండవ వారంలో రథయాత్ర ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని ఎంపీ ఆర్. కృష్ణయ్య మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం తగదన్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370